# హాస్యవల్లరి




శ్రీ
కౌముది
మీ మునివేళ్ళలో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 38




# నెలనెలా నవ్వుల పండుగ

## బాపురే..సినారె..!

సి.నారాయణరెడ్డి గారు మధుర కవిగా అందరికీ పరిచయమే. ఆయన పాటల్లో సుందరమైన అంత్య ప్రాసలు అందంగా , మంద గమనం చేస్తూ శ్రోతల్ని అలరిస్తాయి. ఉపన్యాసాల్లో కూడా మాటలతో ఆయన చేసే గారడీలు ఆసక్తికరంగాఉంటాయి.. ఆయన ఉపన్యాసాల్లోంచి కొన్ని చెమ్మక్కులు ...

- ప్రముఖ కవి బోయి భీమన్న గారు ఉపన్యసించేప్పుడు చాలా నిర్భయంగా ఉంటూ, ఎవరి గురించైనా, ఏ విషయం గురించి ఐనా కుండబద్దలు కొట్టినట్లు చెప్పేవారట. భీమన్న గారి కున్న ఈ స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని భీమన్న గారితో కలిసి పాల్గొన్న సభలో సినారె...

*" బోయి భీమన్న కాదు.*
*బాబోయి భీమన్న"* అని చమత్కరించారు.

***

అలానే మరో సభలో అప్పటి రెవెన్యూమంత్రి పి.తిమ్మారెడ్డి గారి గురించి వ్యాఖ్యానిస్తూ
*" ఈ తిమ్మరెడ్డి.. తతిమ్మా రెడ్ల వలె కాదు.."* అన్నారు..

***

అధికారభాషా సంఘం అధ్యక్షులుగా వున్నప్పుడు ఒక సభలో ప్రసంగిస్తూ " తెలుగు వాడకం గురించి చట్టాలెన్నో చేశాం .కానీ వాటి అమలులోనే లోపం జరుగుతోంది...." అంటూ
*"అమలు కాని చట్టం*
*అక్కరకు రాని చుట్టం."* అని చమత్కరించారు..



# నాటకాల నవ్వులు

ఇప్పుడంటే టి.వి.లు సినిమాలు వచ్చి రంగ స్థల నాటకాలకి ఆదరణ తగ్గింది కానీ 30-40 యేళ్ళ క్రిందట రంగస్థలనాటకాలకి విపరీతమైన క్రేజ్ ఉండేది. ముఖ్యంగా పౌరాణిక పద్యనాటకాలకీ..అందునా పాండవోద్యోగవిజయాలకీ ..ఇంకా చెప్పాలంటే అందులోని 'జెండాపై కపిరాజు..' , 'చెల్లియో..చెల్లకో..' లాంటి పద్యాలకీ..! ఈనాటక ప్రదర్శనల్లోని కొన్ని హాస్య సందర్భాలు..

ఒక పల్లెటూళ్ళో ఈ నాటకం జరుగుతోంది.. కృష్ణుడు పాత్రధారి ఓ మోస్తరు గా పాడుతున్నాడు. కళాకారుల ప్రతిభకి నిదర్శనం ఈ పద్యానికి ఎన్ని వన్స్‌మోర్ లు వచ్చాయనేది.. సరే మన కృష్ణుడు సరిగా పాడలేక పోతున్నా కానీ ఒక పద్యానికి పదే పదే వన్స్‌మోర్ లు వచ్చాయి. అలా వన్స్‌మోర్ లు కొడుతున్న ప్రేక్షకుడ్ని పక్క నున్నతను అడిగాడు..

"ఏమయ్యా ఆయన సరిగ్గా పాడడం లేదుకదా..ఎందుకన్ని సార్లు వన్స్‌మోర్ లు కొడుతున్నావు.." అని.'

"అందుకే సార్..ఆయన బాగా పాడే వరకూ వన్స్‌మోర్ అంటూనే ఉంటాను.."



***

పల్లెటూళ్ళలో ఇలాంటి నాటకాలు వేసేప్పుడు కొన్నిసార్లు ఊళ్ళోవాళ్ళే నేర్చుకుని వేస్తుంటారు. అలాంటి సందర్భాలలోని కొన్ని హాస్య సంఘటనలు..

తన సహాయం అర్థించడానికి వచ్చిన అర్జునుడ్ని చూసిన కృష్ణుడు.." బావా ఎప్పుడు వచ్చితీవు.." అని పద్యం పాడూతుంటే ఆయన తీసిన సుదీర్ఘమైన రాగానికి నిలుచునే చిన్నగా కునుకు తీస్తున్నాడు అర్జునుడు. ఒక కంట ఇది గమనిస్తున్న కృష్ణుడు పాత్రధారి అతని భుజం మీద తట్టి 'బావా..నిన్నే అడుగుచుంటిని...ఎప్పుడు వచ్చితీవు..?" అన్నాడు. ఉలికి పాటుతో కునుకునుంచీ లేచిన అర్జునుడు..

"అందేటా .. నిన్న ఇద్దరం ఒకే బస్సులో వచ్చాం కదా..మళ్ళీ ఎప్పుడొచ్చావ్..అనడుగుతావేంటీ.." అన్నాడు.!

***

కరెంటు లేని రోజుల్లో పెట్రో మాక్స్ లైట్ల వెలుతురులో నాటకాలు వేసేవారు..

ఒక వూళ్ళో ఇలానే కృష్ణుడు " బావా..." అంటూ నోరు తెరిచి పద్యం పాడుతుంటే పెట్రోమాక్స్ లైటు దగ్గరకి చేరిన దోమలు కృష్ణుడు పాత్రధారి నోట్లోకి వెళ్ళాయుట..ఆయన వెంటనే .."బావా థూ.. .వీటి సిగదరగా..ఎప్పుడు వచ్చితీవు..." అని పద్యాన్ని కంటిన్యూ చేశాట్ట..!

***

ఒకసారి బళ్ళారి రాఘవ గారు 'చంద్రగుప్త' నాటకం వేస్తున్నారట. రాఘవ గారు చాణక్యుడుగా నటిస్తున్నారు. నందుని సభలో జరిగిన అవమానానికి రగిలిపోతూ మాంచి రసపట్టులో ఆవేశంతో భారీ సంభాషణలు చెబుతుండగా రంగస్థలం మీదికి కుక్క వచ్చి నిలుచుందట. ఇంకొకకరైతే ఏం చేసే వారో కానీ కదలకుండా అలానే నిలుచున్న కుక్కను చూసి " ఓసీ శునకరాజమా.. నీకు కూడా నేను లోకువయ్యానా!?" అని సందర్భోచితంగా కలిపేశారట..! ***

# పిల్లు-పిడుగులు

ఐదో తరగతి క్లాసులో ముకుందం మాస్టారు పాఠాన్ని ప్రాక్టికల్ గా చెబుదామని..

"ఒరే రాజూ..నేను కూర్చున్న కుర్చీకి ఎన్ని కాళ్ళున్నాయి..?"అని అడిగారు.

"నాలుగు సార్.."

"అందులో ఒకటి విరిగిపోతే ఏమౌతుంది?"

"సైన్సు లోనా, లెక్కల్లోనా?"

"అతి తెలివి తేటలా..? కుర్చీ కాళ్ళల్లో ఒకటి విరిగిపోతే ఏమౌతుందంటే సైన్సా,,లెక్కలా? అంటా వేంట్రా?"

"అదే సార్..లెక్కల్లో ఐతే కుర్చీ కాలు ఒకటి విరిగితే మూడు కాళ్ళు మిగులుతాయి.. సైన్సులో ఐతే కుర్చీ కాలు విరగ్గానే మీరు బొక్క బోర్లా పడిపోతారు..

***



"ఒరేయ్..నీ ప్రోగ్రెస్ రిపోర్టు చూడు..ఇన్ని తక్కువ మార్కులొచ్చాయ్..మంచి మార్కులొస్తే సైకిల్ కొనిపెడతానన్నాను కదా.. నువ్వసలు చదవకుండా ఏం చేస్తున్నట్లు..!?"

"సైకిల్ నేర్చుకుంటున్నా నాన్నా.."

***

"ఏరా కెమిస్ట్రీ పరీక్ష సరిగ్గా రాయలేదంటున్నావ్..అన్నీ కాపీలు రాసి షర్టులోపల పెట్టుకెళ్ళావ్ కదా.."

"పొరబాటున కెమిస్ట్రీ చొక్కా బదులు ఫిజిక్స్ చొక్కా తొడుక్కున్నానా..!"

***

"అంత పిసినారి తనం పనికి రాదురా బుజ్జీ..చెల్లికి కూడా గోళీలివ్వు ఆడుకోడానికి.."

"ఆడుకోమంటున్నానమ్మా.. అదే తీసేసుకుంటానంటోంది.."

"ఛా..చెల్లి అలా చెయ్యదే."

"ఎందుక్కాదూ.. ఇప్పటికే రెండు గోళీలు మింగేసింది..!"

***

"అమ్మా..పక్కింటిలోకి కొత్తగా వచ్చిన పిన్ని గారి పేరు 'ప్రియ' కదా.."

"కాదనుకుంటాలేరా.."

"కాదు ఆవిడపేరు ప్రియనే..నాకు బాగా తెలుసు.."

"మరి నాతో కామాక్షి అనిచెప్పిందేమిటీ?"

"నువ్వు మొన్న షాపింగ్ కి వెళ్ళావు కదా..అప్పుడు డాడీ.. పిన్నిని అలానే పిలిచారు..ఒక సారి కాదు..నాలుగు సార్లు పిలిచారు.."

***



# హాస్య వల్లరి




## నెలనెలా నవ్వుల పండుగ



చేతికి దెబ్బతగిలిన పేషెంటుకి కట్టుకడుతూ డాక్టరు గారు ..
" మరేం భయం లేదు..ఒక్క రెండు వారాలు జాగ్రత్తగా వుంటే కట్టు తీసేస్తాను.. ఆపైన అన్ని పనులూ అద్భుతంగా చేసుకోగలరా చేతితో.." అన్నాడు.
"నిజంగానా డాక్టర్..ఈ చేత్తో వయొలిన్ వాయించగలనంటారా? "
" ఓ..భేషుగ్గా.."
" అరె..అదెలా.. ఇప్పటివరకూ నాకసలు వయొలిన్ పట్టుకోవడమే రాదు కదా..!"




ఒక సారి చర్చిల్ ఇంగ్లండ్ పార్లమెంట్‌లో ఆవేశంగా ప్రసంగిస్తూ " నిజం చెప్పాలంటే..ఈ సభలో సగం మంది ఫూల్సే" అన్నాడు. ఇంకేముందీ..సభదద్దరిల్లింది. చర్చిల్ తనమాటలు ఉపసంహరించుకోవాలనీ, సభకు క్షమాపణ చెప్పాలనీ పట్టుపట్టారు సభ్యులు.
అలాగేనంటూ లేచిన చర్చిల్ "ఐ యామ్ వెరీ సారీ.నిజంగా ఈ సభలో సగం మంది ఫూల్స్ కారు.." అన్నాడు..
మళ్ళీ గొడవమొదలైంది..
"మొదట అన్న మాటను వెనక్కు తీసుకున్నాను. పైగా సారీ చెప్పాను. ఇంకెందుకు గొడవ చేస్తున్నార"ని అన్నాడాయన అమాయకత్వం నటిస్తూ.. !!



ఒక యువరచయిత ఓ నాటకం రాసి దానిని విని అభిప్రాయం చెప్పమని బెర్నార్డ్ షాని అడిగాడు. ఆ కుర్రాడు రెండో సీన్ మొదలుపెట్టే సమయానికే షా నిద్రలోకి జారాడు.. యువకుడు ఆయన్ని నిద్రలేపి..
"అదేమిటి సార్! నిద్రపోతున్నారు? నా నాటకం మీద అభిప్రాయం తెలుసుకోవడానికే కదా మీకు వినిపిస్తోంది..!?" అన్నాడు.
"చూడు నాయనా! నాటకాలపై అభిప్రాయం కావాలన్నావు..ఐతే నిద్రకూడా ఒక అభిప్రాయమేనని నువ్వు తెలుసుకుంటే మంచిది.." అన్నాడు బెర్నార్డ్ షా..!

కౌముది



"అబ్బా..ఈ దోమల భరించలేకుండా ఉన్నానోయ్.. ఇప్పటిదాకా ఇరవై దోమల్ని చంపాను తెలుసా?"

పరమానందం భార్యతో గొప్పగా చెప్పాడు..

" ఏమిటీ..చంపిన దోమల్ని లెక్కపెడుతున్నారు కూడానా..?"

" అవును మరీ..ఇంకా కావాలంటే అందులో మగదోమలెన్నో, ఆడ దోమలెన్నో కూడా చెప్ప గలను. వాటిల్లో పన్నెండు మగ దోమలూ , ఎనిమిది ఆడ దోమలూ ఉన్నాయి తెలుసా?"

"ఆఁ.. దోమల్లో ఆడ మగా ఎలా తెలుసుకున్నారండీ.."

" బీరు బాటిల్ మీద ఉన్నవి మగదోమలూ.. టెలిఫోన్ మీద ఉన్నవి ఆడ దోమలూ.. ఆ మాత్రం కనిపెట్టలేననుకున్నావా?" పరమానందం పరమరహస్యాన్ని బయట పెట్టాడు.



"హల్లో గోదావరి ఎక్స్ ప్రెస్ ఎప్పుడొస్తుందండీ..?" ఫోన్లో అడిగాడు చిదంబరం..



"ఒంటిగంటకి.."

"పగలా? రాత్రా?"

"రాత్రే.."

"ఇవాళా..రేపా?"

"ఇవాళే.."

"ప్లాట్ ఫారమ్ నంబరెంత?"

"నాలుగు.."

"ఖచ్చితంగా నాలుగు పైకే వస్తుందంటారా?"

".. నాలుగు పైకే వస్తుందయ్యా..నీకేమన్నా అభ్యంతరమైతే చెప్పు..మీ ఇంటికి పంపిస్తాను.."



"ఏమయ్యా..తిక్క శంకరయ్యా..నువ్వు ప్రతి ప్రశ్నకీ ఎదురు ప్రశ్న వేస్తావట నిజమేనా..?"

" అలా అని నీతో ఎవరు చెప్పారు?"



"డాక్టర్ గారూ.. రక్తపోటుకి కారణమేమిటంటారూ.."

"రక్తం ఉండడమే.."



"అరేయ్..బుడుగూ.. స్కూల్లో పాఠాలు శ్రద్ధగా వింటున్నావా? బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలి. తెలిసిందా?"

" నువ్విలా అడగడం ఏమీ బాలేదు నాన్నా.. నిన్నెపుడైనా నీ ఆఫీసులో మీబాస్ చెప్పిన పనులన్నీ శ్రద్ధగా చేస్తున్నావా?  అని ఎప్పుడైనా అడిగానా?"

" గందరగోళం ఛానెల్.. వార్తలు చదువుతున్నది అయోమయం అచ్చమాంబ.. ఇప్పుడే అందిన తాజా వార్త.. మెహదీ పట్నం దగ్గర సెవెన్ సీటర్  ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న 44 మందిలో 40 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి.."


" అరే నానీ.. లెక్కల టెస్ట్‌లో ఎన్ని లెక్కలిచ్చారు...?"

"మొత్తం ఏడు లెక్కలిచ్చారు నాన్నా?"

"ఎన్ని వదిలేశావేమిటీ.."


"ముందునుంచీ ఐదూ..వెనకనుంచీ రెండూ.."


"మా ఇంట్లో ఎవరు ఏ విషయాల మీద నిర్ణయాలు తీసుకోవాలి అనే విషయం మీద నాకూ మా  ఆవిడకీ ఒక ఒప్పందం కుదిరిందోయ్.."



"ఎలాగా?"


" అదే. మా అమ్మాయి పెళ్ళి సంబంధాలు, మా అబ్బాయి ఉద్యోగం, ఇంటి లోనూ..ఇలాంటి చిన్న చిన్న విషయాల మీద నిర్ణయం తీసుకునే స్వేచ్ఛని మా  ఆవిడకిచ్చాను. నేనేమో ఇరాన్ నుంచీ అమెరికా సైన్యాన్ని ఎప్పుడు వెనక్కి తీసుకుంటుంది, చమురు ధరలు ఎప్పటికి తగ్గుతాయో, ఆఫ్రికా అడవుల్లోని జంతువులకి వచ్చిన వ్యాధిని నయం చేయడం ఎలా .. అనే విషయాల గురించి  ఆలోచిస్తూ ఉంటాను.."


నాన్నోయ్! నేను నీ అంత అవుతాను
పొడుగులోనా.. ఉన్నతిలోనా అర్థం కాక... బుర్ర గోక్కుంటాడు
*చలపాక ప్రకాష్*


టీవి లో సీరియళ్ళు చూస్తూ అలక్ష్యం చేస్తుందని టీవి అమ్మేసిన భర్త.. ఇల్లు విడిచే పారిపోయిన భార్య.. ఆచూకి తెలిసిన వారు మాకు తెలియ.. చేసిన వారికి బహుమతి..
*చలపాక ప్రకాష్*



# హాస్య వల్లరి



# నెలనెలా నవ్వుల పండుగ



శాంతికుమార్, శాంతిప్రియ ఇద్దరూ మొదటిసారి రైల్వేప్లాట్ ఫామ్ మీదనే కలుసుకున్నారు. ఎన్ని రోజులైనా పెళ్ళికి మాత్రం ఒప్పుకోవడంలేదు శాంతిప్రియ.
ఏమైనా సరే రైల్వేప్లాట్ ఫామ్ సాక్షిగా ఆ రోజు అటో ఇటో తేల్చేసుకోవాలనుకున్నాడు శాంతికుమార్.
"ప్రియా..ఈ రోజు మన పెళ్ళి విషయంలో తేల్చి చెప్పాల్సింది.. నువ్వు కాదంటే రాబోయే ట్రైన్ కింద తెలపెట్టి చచ్చిపోతానంతే.." అన్నాడు..
శాంతి ప్రియ తాపీగా .."అబ్బబ్బా నన్ను కొంచెం అలోచించుకోనివ్వు. మరీ అంతతొందరేమిటి కుమార్. ప్రతి అరగంటకీ ఏదో ఒక రైలు వస్తుంది కదా.." అంది.

***



"ఒరేరే...బుడుగూ..నువ్వు స్కూలుకెళ్ళడం మొదలెట్టి వారం కాలేదు..అప్పుడే చాలా రాసేస్తున్నావ్..ఏమిటమ్మా అది.."

"ఇదీ.. ఉత్తరం రాస్తున్నా.."

"ఎవరికీ.."

"ఎవరికేమిటీ..నాకే.."

" నీకేనా..ఏం రాశావందులో.?"

"ఏదీ నేనింకా పోస్టుచెయ్యందే. దీన్ని పోస్టుబాక్స్ లో వెయ్యాలి. అది నాకందాలి. అందాక గదా దీన్లో ఏముందో తెలిసేదీ.."

***

"మాస్టారూ.. మీరెప్పుడూ చిన్నకుటుంబం చింతలు లేని కుటుంబం అంటుంటారు కదా. మరి మీకు 8 మంది పిల్లలున్నారే!?"

" అదేనయ్యా బాబూ.. స్వానుభవంతోనే బుద్ధి తెచ్చుకుని, మిగతావాళ్ళు నాలా కాకూడదని అలా చెబుతున్నా.."

***

"బుడుగూ..స్కూల్లో ఏం నేర్చుకున్నావ్?"

"రాయడం ఎలానో చెప్పారమ్మా.."

"గుడ్.ఏం రాశావైతే.."




"ఇంకా చదవడం ఎలానో చెప్పలేదు.. అందుకే ఏమీ రాయలేదు..!"

***

"బుడుగూ..నిన్న నువ్వు స్కూలు ఎగ్గొట్టి మామిడి తోటల్లో తిరిగావట నిజమేనా?"

"లేదు టీచర్..నేను సినిమాకి వెళ్ళాను. కావాలంటే ఇదిగోండి..టిక్కెట్ ముక్క..!"

***



" - అంతా విషాదం - సినిమాలో నేను చనిపోయే సన్నివేశం చూసి మా ఆవిడ వెక్కి వెక్కి ఏడ్చిందిరా.." ఫ్రెండ్ తో గొప్పగా చెప్పాడు హీరో కుక్కుటేశ్వర్..

" పాపం..అది నిజం కాదని గుర్తొచ్చి అలా ఏడ్చి ఉంటుందిలే.."

***

"ఏమేవ్..కాంతం..కూర వండే ముందు చేపని బాగా కడిగావా?" అడిగింది రంగనాయకమ్మ పనిమనిషిని..

" లేదమ్మగారూ.. చేప పుట్టినదగ్గర్నుంచీ నీళ్ళలోనే ఉంది కదా.. ఇంకా కడగడం ఎందుకని అలానే వండేశా.." పనిమనిషి సంజాయిషీ ఇచ్చింది.

కామెడీ కార్నర్ — యర్రంశెట్టి శాయి

# కూ..చుక్..చుక్..



విజయవాడ నుంచీ బందరు వెళ్ళే రైలు అతి నెమ్మదిగా పోవడం ప్రయాణీకులకు విసుగు కల్గించింది.
బండి వెళ్తుండగానే ఓ ప్రయాణీకుడు దిగి ఇంజన్ దగ్గరకెళ్ళి దాన్తోబాటే నడుస్తూ డ్రైవర్ మీద మండిపడ్డాడు.
"ఏమయ్యా! ఇంతకంటే వేగంగా వెళ్ళడం చేతకాదా?"
"ఎందుకు వెళ్ళలేనయ్యా! కానీ వెధవది రూల్ ప్రకారం నేను ఇంజన్‌తో పాటే వెళ్ళాలి. "

***

ఒకావిడ వాళ్ళ కుక్కతో సహా గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఎక్కి దాన్ని పక్కనే సీటుమీద కూర్చోబెట్టింది. మిగతా ప్రయాణీకులు అభ్యంతరం చెప్పి టి.టి.యి. ని పిలుచుకొచ్చారు.
"అవునయ్యా! దానికి టికెట్ తీసుకున్నాను. అంచేత మిగతా ప్రయాణీకుల్లా దానికి సీటుమీద కూర్చునే హక్కుంది.." అందావిడ మొండిగా.
" సరే - ఐతే మిగతా అందరు ప్రయాణీకుల్లాగ దాని కాళ్ళు సీటుమీద పెట్టకుండా కూర్చోబెట్టండి దాన్ని.." అన్నాడు టి.టి.యి.

***

ఒక పర్మినెంట్ వే-ఇన్స్పెక్టర్ ఎప్పుడూ పొడుగాటి లెటర్స్ రాయడంతో విసుగెత్తిన డి.యి.ఎన్ గారు అతనిని ఆఫీసుకి పిలిపించి నాలుగు చివాట్లు వేశారు. "ఏమిటయ్యా...కొండవీటి చేంతాడు లాగా  లెటర్స్ రాయడం? ఏ విషయమైనా కుప్తంగా రాయడం నేర్చుకోవాలి! ఇంకోసారి పొడుగాటి లెటర్స్, మెసేజస్ రాయకు!"
పి.డబ్ల్యూ "ఆయ్..ఓకె సార్ " అని తిరిగి తన స్టేషన్ కొచ్చేశాడు.
ఆ తర్వాత వర్షాకాలంలో డి.యి.ఎన్ గారికి అతని దగ్గరనుంచీ మెసేజ్ వచ్చింది.
"డి.యి.ఎన్ గార్కి,
రైల్వే ట్రాక్ ఉండాల్సిన చోట నది ఉన్నది . గమనించ ప్రార్థన"

***

ఓ లావుపాటి పెద్దమనిషి రైల్లో రెండు సీట్లు ఆక్రమించుకుని కూర్చోవడం - పక్కనే నిలబడ్డ రమణమ్మ గారికి చిరాకు కలిగించసాగింది.

"మర్యాదకైనా కూర్చోమని అనడేం?" అని విసుక్కోవడం గమనించి ఆ పెద్దమనిషి జేబులోనుంచి రెండు టిక్కెట్లు తీసి ఆమెకు చూపించాడు.

***

ఓ రెల్వే ఆఫీసర్ గారికి ఓ ఫైల్ సంతకానికి వచ్చింది

అందులో రాసిన విషయం ఏమిటో అర్థంకాక ఆ ఫైల్ పంపిన క్లర్క్‌ని పిలిపించాడాయన.

"ఏమిటయ్యా ఈ అర్థం పర్థం లేని భాష? ఒక్క ముక్క కూడా తెలీటం లేదు? నీకేమైనా కామన్ సెన్సుందా ఇలా రాసి పంపడానికి?" కోపంగా అడిగాడా అధికారి.

"అది మీరు చెప్పిన మేటరే సార్! యథాతథంగా పేపర్ మీద ఉంచాను.." అన్నాడా క్లర్క్!

***

గేయకవి గేయశ్రీ గారిని డేరాడూన్ లో తెలుగు సమితి వారు సన్మానం చేయడానికని ఆహ్వానించారు. వెంటనే గేయశ్రీ ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ లో ఢిల్లీ చేరుకుని తరువాత డేరాడూన్ రైలెక్కారు. మధ్యలో టికెట్ కలెక్టర్ వచ్చి ఆయన టికెట్ చెక్ చేసి అయిదు నిమిషాలసేపు ఏదో హిందీలో మాట్లాడాడు. హిందీ ఏమాత్రం తెలీని గేయశ్రీ గారు అంతా అర్థమైనట్లు చిరునవ్వుతో తలూపారు. టికెట్ కలెక్టర్ వెళ్ళిపోయాక ఎదురుగ్గా కూర్చున్న మరో తెలుగతను గేయశ్రీ గారిని

"మీరు తెలుగు వారా?" అనడిగాడు.

"అవును!" అన్నాడు గేయశ్రీ

"మీకు హిందీరాదా?" తిరిగి అడిగాడతను.

"ఆc.. ఏదో కొంచెం తెలుసు!" అబద్ధమాడేశాడు గేయశ్రీ

"మరి మీరు ఎక్కాల్సింది ఈ రైలుకాదు అని టి.టి.యి చెబుతుంటే అలా తెలిసినట్లు తలూపుతారెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడా వ్యక్తి.

***






# నెలనెలా నవ్వుల పండుగ

కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

## లేఖ



ముఖ్యమంత్రి గారికి

ఇటీవల దినపత్రికల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీద మేధావుల సూచనలు, సలహాలు అడిగారని తెలుసుకున్నాక ఈ ఉత్తరం రాస్తున్నాను. నేనూ ఒకప్పుడు డబ్బుకి ఇబ్బంది పడిన వాడినే. అయితే ఈ క్రింది పద్ధతుల్ని పాటించి నా ఆర్థిక స్తోమతని పెంచుకున్నాను. ఇవి మీకు కొత్త దారులకు ఇన్స్పిరేషన్ అయితే నాకంతకంటే సంతోషం ఇంకోటిలేదు

**మొదటి పద్ధతి**

ఆదాయాన్ని మించి ఖర్చుచేయాలి. కిరాణా దుకాణంలో మనం పదిహేను వందల రూపాయలు అప్పుంటే మిగిలిన వాళ్ళకన్నా మనల్ని వాడు గౌరవంగా చూస్తాడు, ఆ పరిస్థితుల్లో మనల్ని చూసిన తోటి కస్టమర్ కూడా మన గురించి గొప్పగా అనుకుంటాడు. దీనివల్ల అలాంటి కస్టమర్స్ నుంచి కూడా మనకి అప్పుపుడుతుంది.

**రెండో పద్ధతి**

బేంక్ లో మన డబ్బు వుండేకంటే, మన దగ్గర బేంక్ డబ్బు ఉండడం మెరుగు. ఈ ఓవర్ డ్రాఫ్టు వల్ల బేంక్ మేనేజర్కి మనమంటే శ్రద్ధ పెరుగుతుంది. మనం ఏం పనిచేస్తాం. ఎంతొస్తుంది, ఎంత ఖర్చు చేస్తాం, మన అలవాట్లేమిటి లాంటివన్నీ వివరంగా మన చుట్టుపక్కల వాళ్ళని వాకబుచేస్తాడు.

**మూడో పద్ధతి**

మనం బాకీ వున్న వాళ్ళు ఎదురు పడితే చిరునవ్వుతో సిగరెట్ ముట్టించుకుని చెప్పాలి `అయ్యా! నేను కాల్చేది తమరి డబ్బునే` అని. ఇంకేం మాట్లాడాలో వారికి అర్థం కాదు. అప్పుడు మనం చల్లగా జారుకోవచ్చు.

**నాలుగో పద్ధతి**

మనం అసలు మన దగ్గర డబ్బే వుంచుకోకూడదు. గర్ల్‌ఫ్రెండ్స్‌కి గిఫ్ట్‌లు కొనివ్వాలి. ఫైవ్ స్టార్ హోటల్స్‌లోనే భోజనం చేయాలి. సూట్లు, బూట్లు అవసరానికి మించి కొనాలి. దాంతో ఎవరూ మన నించి బలవంతంగా డబ్బు తీసుకెళ్ళలేరు.- ఖర్చయిపోయింది కాబట్టి.

**అయిదో పద్ధతి**

వీలైనన్ని క్రెడిట్ కార్డులకి అప్లయ్ చేసి వాటిని ఉపయోగించి సమస్తం కొనండి. విమానం టిక్కెట్లు, హాలిడే రిసార్ట్‌లో హోటల్ బిల్లు, అన్నీ క్రెడిట్ కార్డుతో చెల్లించండి. ఆనక అవి పోయాయని క్రెడిట్ కార్డ్ కంపెనీకి రిజిస్టర్డ్ లెటర్ రాయండి.

***భవదీయుడు***

***రుద్రయ్య***

షరా: మీరు నన్ను స్వయంగా సంప్రదించదలిస్తే, విజిటింగ్ టైమ్‌లో చంచల్ గూడ జైలుకి రండి. ప్రిజన్ నంబర్ 420 అని అడగండి చాలు.

## ఆకాశవాణి... అశరీరవాణి

యర్రంశెట్టి శాయి

ఓ వూళ్ళో కొత్తగా రేడియో స్టేషన్ తెరిచారు. ఓ అధికారి స్టేషన్ ప్రారంభోత్సవం చేస్తూ సభలో రేడియో గురించీ, దాని కనిపెట్టిన శాస్త్రజ్ఞుడి గురించీ పొగుడుతూ చెప్పాడు.

ముందు వరుసలో కూర్చున్న ఒక శ్రోత లేచి నుంచుని కోపంగా అడిగాడు.

"మీరు చెప్పిన మేధావి కన్నా మరో గొప్ప మేధావి గురించి చెప్పడం మరిచిపోయారు!"

"ఎవరది?"

"దాని నోరు మూయించే స్విచ్ కనిపెట్టినాయన!"



ట్రంక్ రోడ్ మీద జరిగిన కారు ప్రమాదం గురించి రేడియో

"..జరిగిన కారు ప్రమాదంలో ఒక వ్యక్తికి కనీసం రెండు కాళ్ళయినా విరిగి వుంటాయని అంటున్నారు!"



బస్ స్టాప్‌లో గంటసేపు నిలబడ్డాక రామనాధానికి బస్ దొరికింది. తీరా బస్సెక్కాక "అరరే! కండక్టర్ బస్సాపు! నేను దిగిపోవాలి"

అన్నాడతను కంగారుగా.

"ఎందుకు? ఏమైంది?" అడిగాడు కండక్టర్ పకుండానే.

"ఇంట్లో రేడియో కట్టేయడం మర్చి పోయానయ్యా! త్వరగా ఆపు! నీకు పుణ్యం వుంటుంది.." అన్నాడతను బ్రతిమాలుతూ.

"సాయంత్రం వరకూ వాగినా దానికి కరెంటేమంత ఎక్కువ కాలదు లేవయ్యా" ఎవరో వెనకనుంచి అన్నారు.

"కరెంట్ కోసం కాదయ్యా ఈ బాధ! రేడియో దగ్గరే మా కుక్కని కట్టేశాను. సాయంత్రం వరకూ ప్రోగ్రాములు వింటుందంటే ఇంకేం బ్రతుకుందది!" కన్నీళ్ళు పెట్టుకుంటూ అన్నాడు రామనాథం.

బస్ సడెన్ బ్రేకుతో ఆగిపోయింది.



"రేడియో కంటే టెలివిజన్ గొప్పది కదూ?"

"అవును! రేడియోలో పిచ్చి వాగుడు వినేవాళ్ళం! టెలివిజన్‌లో అది చూడవచ్చుకూడా."



హఠాత్తుగా రేడియోలో ప్రోగ్రామ్స్ అన్నీ ఆపి వార్తాప్రసారం చేశారు.

ఆకాశవాణి అతి ముఖ్యమైన వార్త వినండి..

చంద్రమండలం హఠాత్తుగా తన కక్ష్య వదిలి భూమివేపు అతి వేగంగా ప్రయాణిస్తోంది. షుమారు రెండు గంటల కాలంలో అదిభూమిని ఢీ కొంటుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు - ఆ తాకిడికి భూమి పూర్తిగా తునాతునకలయి విడిపోతుంది. మిగతా వార్తలువినేముందు ఈ వ్యాపారం సందేశం వినండి..

'టింగ్..టింగ్..నేడే కొనండి! రాజ్ విమల్ వారి అప్పడాలు ..కరకర లాడుతూ కరిగిపోయే రాజ్ విమల్ వారి అప్పడాలు ఇప్పుడు అన్ని సైజుల్లోనూ దేశం నలుమూలలా లభిస్తున్నాయ్ - నేడే వాడండి..రాజ్ విమల్ వారి అప్పడాలు..టింగ్.. టింగ్.."

# చౌచౌ

"ఒరే లంబూ ఎవరైనా మంచి డాక్టరెవరైనా ఉంటే చెప్పు ఒంట్లో బాలేదు.."

"ఓ తప్పని సరిగా మా ఫేమిలీ డాక్టర్ కొండా రెడ్డి గారి దగ్గరకెళ్ళు"

" నిజంగా బాగా చూస్తారంటావా?"

మరి..! నా దగ్గు తగ్గడానికి గత ఐదు సంవత్సరాలుగా ప్రతి వారం వెళుతున్నాను అయన వద్దకే. నేనేం పిచ్చి వెధవననుకున్నావా?"

***

బుడుగు వాళ్ళ నాన్నతో కలిసి స్విమ్మింగ్ పూల్ లో ఈత నేర్చుకుంటున్నాడు..

"నాన్నా .ఇంకొంచెం లోపలికి వెళ్ళనా?"

"వద్దురా బుడుగూ..అక్కడ లోతెక్కువ మునిగిపోయే ప్రమాదం వుంది..'

"లేదులే నాన్నా..నేను బాగా నే ఈదగలను కదా..'

"సరే..మునిగిపోయావంటే..ఇక చూస్కో ఇంటికొచ్చాక చావ తంతాను.."

***

కుక్కుటేశ్వర్ పరీక్షహాల్లో ఏమీ రాయకుండా దిక్కులు చూస్తున్నాడు..ఇన్విజిలేటర్ వచ్చాడు..

"ఏరా..కుక్కూ సమాధానాలు రాయకుండా అటూ ఇటూ చూస్తున్నావేం?"

" ఈ క్రింది ప్రశ్నలకు అయిదింటికి సమాధానాలు వ్రాయుము అని వుందండీ. ఇంకా టైమ్ అయిదు కాలేదు కదండీ.. అందుకే.."

***

"బుడుగూ..పెద్దయ్యాక ఏం చేద్దామనుకుంటున్నావ్?"

"టీచర్ ఔతాను టీచర్.."

"గుడ్ బాయ్..ఎందుకనో చెప్పగలవా?"

"టీచరైతే ఎంచక్కా అప్పుడు ఏమీ నేర్చుకోనవసరంలేదు... ఏమి తెలీకపోయినా పిల్లలని అడిగి తెలుసుకోవచ్చు.."

***

"ఇదో సర్వర్..రెండు ప్లేట్లు మైసూర్ బజ్జీ తీస్కురా.."

"అలానే సార్.."

"ఇదో ఒక్క మాట..మరీ వేడిగా ఉండొద్దు. అలాగని చల్లగానూ వుండొద్దు. శెనగపిండి ఎక్కువొద్దు. తోలు మరీ పల్చగా ఉండొద్దు."

"మరి ఇంతకీ లోపల మైసూర్ ఉండాలంటారా? అదికూడా వద్దా?"

***

పెంపుడు జంతువులు అమ్మే ఒక దుకాణానికి వెళ్ళి ముడొందల బొద్దింకలు,ఇరవై సాలీడ్లు, ఆరు ఎలకలు, ఆరు ఎలుకపిల్లలు, రెండు పిల్లులు అడిగాడు జంబులింగం.

" మేము ఎలుకలు, పిల్లులు మాత్రమే ఇవ్వగలం. మిగతావి మావద్ద లేవు. ఐనా అవన్నీ మీరేం చేసుకుంటారు?"

"ఈ రోజు మా ఇంటి వోనర్ నన్ను ఖాళీ చెయ్యమని అడిగాడు. నేను అద్దెకి దిగినప్పుడు యిల్లు ఎలా వుందో అలానే అప్పజెప్పమని అడిగాడు. అందుకని..." జంబులింగం జవాబు.!

***




# మెమొ నవ్వుల పండుగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## వేగం

అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా అనేక దేశాలనించి తొమ్మిది ఏళ్ళ వయసుగల పిల్లలు అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి. కి వెళ్ళారు.

ఇండియా నించి రాజేష్ అనే తొమ్మిదేళ్ళ పిల్లవాడిని ఎన్నిక చేశారు. అతని తండ్రి ఇలాంటి సాంస్కృతిక వ్యవహారాలు చూసే శాఖలో ఉద్యోగంలో వుండబట్టే రాజేష్ తేలికగా ఎన్నిక అయ్యాడు. రాజేష్ వారం రోజులపాటు వాషింగ్టన్‌లో వుండడానికి చిన్న సూట్‌కేస్ తో చేరుకున్నాడు. అతన్ని వాషింగ్టన్ ఏర్ పోర్ట్‌లో ఓ యువతి రిసీవ్ చేసుకుంది.

ఆ రోజు సాయంత్రం వివిధ దేశాలనించి వచ్చిన పిల్లలందరికీ ఓ టాపిక్ యిచ్చి దానిమీద మాట్లాడమన్నారు.

ఆ టాపిక్ 'మా నాన్నగారు ఎందుకు గొప్పవారంటే'.

చైనా నుంచి వచ్చిన చిన్ లున్ అనే పిల్లవాడు ముందుగా మైక్ ముందుకి వెళ్ళి ఇలా అన్నాడు..

"మా నాన్న గారు అత్యంత వేగంగా పరిగెత్తగలరు. ఎంత వేగంగా అంటే ఆయన బాణం వేసి, పరిగెత్తుకెళ్ళి అది గుచ్చుకునే చోటికి బాణం కన్నా ముందే చేరుకోగలరు."

తర్వాత ఆస్ట్రేలియా నించి వచ్చిన ఆల్బర్ట్ అనే పిల్లవాడు చెప్పాడు.

" మా నాన్న గారు కూడా పరిగెత్తే విషయంలో గొప్పవారు. ఆయన తుపాకి పేల్చి, పరిగెత్తుకెళ్ళి గుండు గుచ్చుకునే లోగా ఆ చోటికి చేరుకోగలరు."

ఇండియా నుంచి వచ్చిన రాజేష్ వంతు వచ్చింది. మైక్ ముందు నిలబడి రాజేష్ ఇలా చెప్పాడు.

"మా నాన్న గారు ఇంకా వేగం. ఆయన ఆఫీసు టైమ్ సాయంత్రం అయిదు గంటలవరకూ ఆఫీసులో ఉండి కూడా మా ఇంటికి రోజూ ఖచ్చితంగా మూడు గంటలకల్లా చేరుకోగలరు."

## జల్సా..జల్సా..జల్సా..! యర్రంశెట్టి శాయి

"మీ స్నేహితుడు చెట్టుమీద నుంచి కిందపడి చనిపోయాడట గదా?"

"అవును.."

"పాపం! ఎక్కకుండా ఉంటే ఇలా ప్రాణంమీదకొచ్చేది కాదు కదా!"

"అవును"

"ఇంతకూ చెట్టెందుకెక్కినట్లు?"

"ఉరేసుకోడానికి తాడు కట్టబోయాడు.."

***

రమాపతీ, సీతాపతీ హైద్రాబాదెళ్ళి మొదటి సారిగా సిటీబస్సెక్కారు. ఖాకీ బట్టలేసుకున్న ఒక వ్యక్తిచేతిలో రూపాయి నోటుంచి "రెండు టిక్కెట్లు కోటీ కివ్వండి" అనడిగాడు రమాపతి.

ఖాకీ బట్టలతను నవ్వి "నేను టాక్సీ డ్రయివర్ని!" అన్నాడు రూపాయి తిరిగి ఇచ్చి వేస్తూ. వెంటనే బస్ లో నుంచీ రమాపతీ, సీతాపతి కిందకు దూకేశారు.

"బస్సనుకుని మనం టాక్సీ ఎక్కేశాం చూశావా?" అన్నాడు పతి బట్టలు దులుపుకుంటూ.

***

స్కూళ్ళ ఇన్స్‌పెక్టర్ గారు ఒక స్కూలు ఇన్స్పెక్షన్ చేసేస్తున్నారు.

ఆరో క్లాసులో ఒక కుర్రాడిని "రామాయణం ఎవ్రాశారోయ్" అంటూ ఠకీమని అడిగాడు.

ఆ కుర్రాడు కంగారుపడిపోయాడు. " నేన్రాయలేదండీ.." అన్నాడు భయంగా.

ఇన్స్‌పెక్టర్ కి కోపం వచ్చేసింది.

"ఇదన్న మాట నువ్వు పిల్లలకి చెబుతోంది?" అన్నాడు పంతులుతో.

ఆ పంతులు మరీ కంగారు పడిపోయాడు.

"అబ్బే భయం కొద్దీ వాడలా అంటున్నాడండీ.. నిజానికి వాడే రాశాడు!" అన్నాడు దీనంగా.

ఇది విని ఇన్స్పెక్టర్ మరీ మండిపోయాడు.- సరాసరి హెడ్‌మాస్టర్ గదిలోకెళ్ళి గావు కేకలేశాడు.

"ఇదీ మీస్కూల్లో పరిస్థితి! రామాయణం ఎవ్రాశారో కూడా ఎవ్వరికీ తెలీదు.!" అన్నాడు.

హెడ్‌మాస్టర్ నొచ్చుకున్నాడు. నిజంగా అలాంటి సమాధానాలు రావడం, అందులోనూ బాధ్యతగల పంతులే రకంగా చెప్పడం సిగ్గుచేటని

ఒప్పుకున్నాడు.

" ఈ సారికి క్షమించండి సార్! నేను స్వయంగా క్లాసుకెళ్ళి అది ఏ కుర్రాడు రాశాడో తేల్చుకుని ఇంకెప్పుడూ రాయనని వాడి దగ్గర హామీ తీసుకుని - రిపోర్టు మీకు రేపే పంపిస్తాను!" అన్నాడు.

ఇన్స్పెక్టర్ తల రెండు చేతుల్తో పట్టుకున్నాడు. "అ అయితే రామాయణం వాల్మీకి రాసినట్లు మీకూ తెలీదన్నమాట!" అన్నాడు ఆశ్చర్యంగా.

"వాడా వాల్మీకి గాడా? వాడు ఫోర్తు ఫారం `బి` సెక్షన్లో ఉన్నాడండీ.. కానీ వాడెప్పుడూ అలాంటి పనులు చేయడే.!" అన్నాడు హెడ్మాస్టారు పేము బెత్తం తీసుకుని ఫోర్త్ ఫారం `బి` సెక్షన్ కేసి నడుస్తూ.

***

ఓ అమాయకపు అరుణాచలం సినిమా హాలు నుంచి రోడ్డుమీద కొస్తుంటే సింహాచలం పలుకరించాడు.

"ఏమోయ్ సినిమా నుంచా?"

"కాదు! మా అమ్మాయి ఎవడితోనో రిక్షాలో వెళుతూ కనిపించింది. ఎక్కడికెళుతున్నారా అని వెంబడించాను. ఇద్దరూ ఈ హాల్లో సినిమాకెళ్ళారు. ఈ సినిమా ఏమో నేనిదివరకు చూసిందానాయె! అందుకని తిరిగి వచ్చేస్తున్నాను.." తేలిగ్గా చెప్పాడు అరుణాచలం.

***

వెంకట్రామయ్య గారి కారు బురదగా వున్న రోడ్డుమీద గుంటలో దిగబడిపోయింది. పక్కనే ఇంట్లో ఉన్న రైతు తన ఎద్దులను తీసుకొచ్చి కారుకి తాడు కట్టి కారుని బయటకు లాగాడు. అతని సహాయానికి పదిరూపాయలు ఇచ్చారు వెంకట్రామయ్య గారు.

"పాపం రాత్రింబగళ్ళు ఈ గుంటలో దిగబడే కార్లకు నువ్వు సహాయం చేస్తూనే వుండాల్సి వస్తుందేమో! కదూ.." అడిగారాయన.

"అబ్బే రాత్రిళ్ళు బురద ఎండిపోకుండా నీళ్ళు తెచ్చి తడుపుతూ ఉండాలి కదండీ.. గుంట పూడిక తీస్తుండాలి అప్పుడప్పుడూ.."

***

# చౌచౌ

జంబులింగం పట్నం వెళ్ళడం అదే మొదటి సారి. సూపర్ మార్కెట్లో అడుగుపెట్టాడు..

"ఇదేమిటండీ.."

"అది ఆరెంజ్ జ్యూస్ పౌడర్. దాన్ని నీళ్ళలో కలిపితే ఆరెంజ్ జ్యూస్ తయారౌతుంది.."

"మరిదీ..?"

"అది మిల్క్ పౌడర్. " " అంటే దాన్ని నీళ్ళలో కలిపితే మిల్క్ ఔతుంది కదా.."

"అవునండీ.."

"ఇదో?"

"అది బేబీ పౌడర్.."

"అయితే దీన్ని నీళ్ళలో కలిపితే బేబీ వస్తుందన్నమాట..ఓ నాలుగు డబ్బాలివ్వండీ.. మా వూళ్ళో అందరికీ చూపించాలి.." జంబులింగం తొందరపెట్టాడు..

***

"ఏరా ఆనంద్..నీ భార్యకు కొత్త ఆసుపత్రిలో ఆపరేషన్ చేయిస్తున్నావట గదా.. ? డాక్టర్‌కి ఇదే మొదటి కేసు తెలుసా?"

"పోనీలేరా.. ఆపరేషన్ సక్సెస్ అయితే అదృష్టం తడిదీ..కాకపోతే నాదీ.."

***

రాత్రి సమయం..జంబులింగం భార్య జాంబవతి " ఏమండీ..రాత్రి ఎంత ప్రశాంతంగా ఉందో.. నేను పాట పాడుతాను..మీరు తాళం వెయ్యండి.." అంది

"తాళం ఎప్పుడో వేసేసాను. ఇక ఎవ్వరూ రారు. నువు పాడటం మొదలెట్టు.." అన్నాడు జంబులింగం ధీమాగా.

***

జాంబవతి తన భర్త జంబులింగం గురించి పక్కింటావిడకి ఇలా చెబుతోంది..

"మా ఆయనకు దురలవాట్లేమీ లేవు తెలుసా? పేకాట ఆడరు..తాగరు.. చీకటి పడేలోపే ఇంటికి చేరతారు.."

పక్కింటావిడ వెక్కిరింతగా " సిగిరెట్లు కూడా తాగరా?" అంది.

"తాగుతారనుకో.. సుష్టుగా, తృప్తిగా భోంచేసినప్పుడు ఈ సిగరెట్ తాగందే తోచదంటారు. అంటే ఏడాదికి ఒకటి రెండు సార్లు అన్నమాట. అదేమైనా పెద్ద అలవాటా?"

***

జంబులింగానికీ, జాంబవతికీ పెద్ద గొడవ మొదలైంది..

జాంబవతి పెద్దగా అరుస్తోంది..

"మీ వల్ల తప్పుంటే మీరు పోతారు.. నావల్ల తప్పుంటే నా పసుపు కుంకుమే పోతుంది.."

***

"మా ఆవిడ సమస్తమూ తీసుకుని నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోయిందిరా" విచారంగా అన్నాడు రామలింగం.

"నువ్వు అదృష్టవంతుడివిరా. ఆవిడైతే సమస్తం తీసుకుంది. అయినా ఇప్పటికీ నన్ను వదిలి పెట్టలేదు.." అన్నాడు జంబులింగం.

***

జంబులింగం, జాంబవతిని తీసుకుని సరదాగా పట్నంలో సినిమా చూద్దామని వెళ్ళాడు. సినిమాకి ఇంకా టైముందని పక్కనే ఉన్న కేఫ్ కెళ్ళి కాఫీ ఆర్డరిచ్చాడు.. జాంబవతి వేడి కాఫీని ఊదుకుంటూ నెమ్మదిగా తాగుతోంది..

"తొందరగా..తొందరగా తాగు.." అన్నాడు జంబులింగం.

"ఎందుకండీ..అలా తొందర చేస్తున్నారు?" అంది జాంబవతి..

"పిచ్చి మొహమా అక్కడ బోర్డు చూడు..హాట్ కాఫీ ఐదు రూపాయలు..కోల్డ్ కాఫీ పది రూపాయలు అని లేదూ.. "

***




# నెలనెలా నవ్వుల పండుగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## డబ్బెవరికి చేదు?

హైదరాబాదులోని ఓ బేంక్‌ని పట్టపగలే దోచుకున్నాడో దొంగ. నాటు బాంబులు, తుపాకీలతో కేషియర్లని బెదిరించి ఇరవై ఆరు లక్షల రూపాయలతో పరారీ అయ్యాడు.

సి.ఐ.డి కి చెందిన డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ పిళ్ళై కేసు టేకప్ చేసాడు. బేంక్ కౌంటర్ల మీద దొరికిన వేలి ముద్రలని, ఫింగర్ ప్రింట్ బ్యూరోలోని అంతకు ముందే వున్న వేలి ముద్రలతో పోల్చి చూసి, అవి పంజాబ్ రాష్ట్రానికి చెందిన గజదొంగ హర్ భజన్ సింగ్ వని గుర్తించారు. హర్ భజన్ సింగ్‌కి సంబంధించిన ఫైల్ తిరగేశారు.

హర్ భజన్ సింగ్ ఆచూకి తేలికగా కనుక్కున్నాడు పిళ్ళై. వెంటనే చండీఘర్‌కి అరవై కిలో మీటర్లదూరంలో ఉన్న ఓ చిన్న పల్లెకి ప్రయాణమయ్యాడు, ఎలాగైనా డబ్బుని తనే కొట్టెయ్యాలని.

ముందే ఫోటోలు చూసి ఉండడం చేత హర్ భజన్ సింగ్‌ని , పల్లెటూరిలోని నాలుగురోడ్ల కూడలిలో గల టీ బంక్ ముందు తేలికగా గుర్తించగలిగాడు పిళ్ళై.

పిస్తోలు తీసి ఛాతీమీద గుచ్చాడు. దురదృష్టవశాత్తూ పిళ్ళైకి పంజాబీ భాషరాదు. సింగ్‌కి తమిళం కాని, ఇంగ్లీషుకాని రాదు. ఆ టీ బంక్ యజమాని చాలా రోజుల క్రిందట అక్కడ సెటిలయిన తమిళ తంబి. ఆయన్ని దుబాసిగా వ్యవహరించమని కోరాడు పిళ్ళై.

"ఇతని పేరు హర్ భజన్ సింగ్ అవునో కాదో అడగండి.."

టీ బంక్ యజమాని సింగ్‌తో మాట్లాడి " ఆను.. హర్ భజన్ సింగ్" చెప్పాడు.

"హైదరాబాదులోని బేంక్ స్టేట్‌లో ఎనిమిది రోజులక్రితం వున్నాడో లేదో అడగండి.."

మళ్ళీ ఆయన మాట్లాడి "ఆను..ఉన్నాడట" చెప్పాడు.

"ఇరవై ఆరు లక్షల రూపాయలు దోచుకెళ్ళాడో లేదో అడగండి.." చెప్పాడు పిళ్ళై.

సింగుతో మాట్లాడి నిజమేనట అని చెప్పాడు.

వెంటనే పిస్తోలు హర్ భజన్ సింగ్ ఛాతీలో ఇంకాస్త గుచ్చి " డబ్బు ఎక్కడ దాచాడో చెప్పకపోతే ట్రిగ్గర్ నొక్కి చంపుతానన్నానని చెప్పండి." చెప్పాడు.

ఆ సంగతి చెప్పగానే హర్ భజన్ సింగ్ వళ్ళంతా చెమటలు పట్టాయి. పంజాబీ భాషలో గబగబా చెప్పాడు - టీ బంక్ యజమానితో భయంగా..

"చంపవద్దని చెప్పు . భార్యా పిల్లలు కలవాడిని. డబ్బుని మా అత్తగారింటిలోని మర్రి చెట్టు కిందపాతిపెట్టాను"

ఏమి చెప్పాడన్నట్లు ఆసక్తిగా చేసాడు పిళ్ళై.

టీ బంక్ యజమాని చెప్పాడు పిళ్ళైతో..

" ఏడ్చినట్టే ఉంది. ఇంత కష్టపడింది మీకు చెప్పడానికా? కాలిస్తే కాల్చుకో పో..అంటున్నాడండి..నాక్కొద్దిగా పని ఉంది..వెళతాను మరి.."

## భర్తహరి సుభాషితాలు..!

యర్రంశెట్టి శాయి

యోగాభ్యాసం వల్ల చనిపోయిన భర్తతో మాట్లాడగలిగిందో ఇల్లాలు.

"ఏమండోయ్! ఎలా వున్నారు?"

"సంతోషంగా, ఆనందంగా వున్నాను"

"నాతో కాపురం చేసినప్పటికంటే ఎక్కువ ఆనందంగా వున్నారా?"

"అంతకంటే చాలా రెట్లు ఎక్కువ ఆనందంగా వున్నాను"

"అలాగా! స్వర్గంలో అంత ఆనందంగా వుంటుందన్నమాట!"

"స్వర్గం!! సరేలే..నేను నరకంలో ఉన్నాను..!"

***

"మీ ఆవిడను నీకెవరు పరిచయం చేసారు?"

"మేమే కలుసుకున్నాం..ఇందుకు నేనెవ్వరినీ నిందించను.."

***

ఒక గొప్ప శాస్త్రజ్ఞుడు ఓ మహిళల సభలో పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు. స్టేజి దిగిపోయాక చాలా మంది స్త్రీలు అతని చుట్టూ మూగి, కుతూహలంగా ఏవేవో ప్రశ్నలడగ సాగారు.

ఒక స్త్రీ అందరినీ తోసుకుంటూ ముందుకొచ్చి అడిగింది.."అబద్ధాలని కనిపెట్టే మిషన్లు కనిపెట్టారని అంటున్నారు! మీరది చూసారా?"

"చూడడమేమిటి నా తలకాయ! ఒక దాన్ని పెళ్ళిచేసుకొన్నాను కూడా!" అన్నాడా సైంటిస్టు దిగాలుగా.

***

వళ్ళంతా కట్లు కట్టుకున్న ఒక భర్త విడాకులకోసం కోర్టుకెళ్ళాడు.

"నా భార్యతో కలసి ఉండడం చాలా ప్రమాదకరం సార్! పెళ్ళయిందగ్గరనుంచీ చూస్తున్నాను! చేతిలో ఏదుంటే అదే విసిరేస్తుంది నా మీదకు"

"అలాగే ఇరవై ఏళ్ళు సంసారం చేశావు కదా మరి? ఇప్పుడు విడాకులెందుకు?" అడిగాడు జడ్జి.

"ఇప్పుడు ఖచ్చితంగా గురి తప్పకుండా కొట్టగలుగుతోంది.."

***

"ఏమండోయ్. రేపటికి మన పెళ్ళయి పదేళ్ళు. ఓ కోడిని తీసుకురారాదూ..కోసుకుందాం.."

"తీసుకురావొచ్చు కానీ,మనం పదేళ్ళక్రిందట చేసిన తప్పుకి పాపం దాన్ని చంపడమెందుకే?"

***

భర్త: "ఇదిగో ! ఇంకోసారి నువ్వు ఆత్మహత్య ప్రయత్నం చేసావంటే ఊరుకోను చెప్తున్నా!"

భార్య: "ఎందుకని"

భర్త: "వారానికో కిరసనాయిలు డబ్బా తేవడం నా వల్ల కాదు.."

***



"సబిన్స్‌పెక్టర్ గారూ! నిన్న నేను ఊళ్ళో లేనప్పుడు మా ఇంట్లో పడ్డ దొంగని ఓ సారి చూడనిస్తారా?" అడిగాడో భర్త.

"ఎందుకు"

"వాడితో రెండు ముక్కలు మాట్లాడాలండి.."

"అదేనండీ.. మా ఆవిడని అంత సులువుగా స్తంభానికి కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కేయడం - ఎలా సాధ్యమయిందో తెలుసుకొందామని!" నసిగాడా భర్త.

***

"చూశారా! రమణికెంత పొగరో! నేను ఇందాక మార్కెట్ కెళ్తోన్నప్పుడు కనబడి పలుకరించకుండా వెళ్ళిపోయింది" మండి పడుతూ భర్తతో చెప్పింది కళ్యాణి.

"ఎలాగూ ఆవిడతో ఇకనుంచీ మాట్లాడనని నువ్వే అన్నావుగా?"

"అక్కడే నాకు వళ్ళు మండేది..నేను మాట్లాడడం మానేసే లోపే తను మాట్లాడడం మానేస్తే నాకెంత చిన్నతనంగా వుంటుంది?"

***

## చౌ చౌ

పెట్ మార్ట్ కి వెళ్ళాడు పెరుమాళ్ళు, ఓ కుక్కని కొందామని. షాపతను రకరకాల కుక్కల్ని చూపించాడు. అందులో ఒక కుక్క బాగా నచ్చింది పెరుమాళ్ళుకి.

"ఈ కుక్క నాకు బాగా నచ్చింది కానీ, కాళ్ళే మరీ పొట్టిగా ఉన్నాయనిపిస్తోంది.." సందేహం వెలిబుచ్చాడు పెరుమాళ్ళు.
"పొట్టి అంటారేమిటి సార్..నాలుగుకాళ్ళు నేలకే ఆనుతుంటే.." షాపు ఓనర్ ఓదార్పు..!

***

జంబులింగం కొత్తగా పదివేల రూపాయలు పెట్టి ఒక పురాతనమైన కారు కొన్నాడు. కారు ఓనరే వొచ్చి జంబులింగం ఇంటి దగ్గర కారుని ఒదిలి వెళ్ళాడు. మర్నాడు సొంతంగా కారు స్టార్ట్ చెయ్యబోతే ఎంతకీ అది స్టార్ట్ కాలేదు.. జంబులింగం అలా కుస్తీ పడుతుండగానే , కారు అమ్మినతని నౌకరు వొగరుస్తూ సైకిల్ మీద వొచ్చి.."సార్.. నిన్న మా సారు కారుతో బాటు మీకిది ఇవ్వడం మరిచిపోయారు.." అంటూ పెద్ద తాడుని జంబులింగం చేతిలో ఉంచాడు..!

***

"ఏమోయ్ వంటముగిసిందా?" స్నానానికి వెళ్ళబోతూ అడిగాడు జంబులింగం.
"ఆఁ..అంతా ఐపోయింది.. మీరు స్నానం నుంచీ తిరిగి రాగానే పచ్చడి చేస్తా.." అంది జాంబవతి ప్రేమగా.

***



పిసినారి పరంధామయ్యకి పొదుపు ఉద్యమశాఖలో ఉద్యోగం వచ్చింది. ఆ సందర్భంగా సన్మానం చేసి అందరూ చప్పట్లు కొట్టారు.
అందుకు సమాధానంగా పరంధామయ్య " అదే వద్దంటున్నాను. మనం అన్నింటిలోనూ పొదుపు పాటించాలి. అన్ని సార్లు చప్పట్లు కొట్టకూడదు. ఒక్కసారి ..ఇలా..అంటే చాలు పొదుపుగా.." అన్నాడు.
సరే ఇంటికి వచ్చేసరికి పెద్దమ్మాయి ప్రమీల రెండుజడలు వేసుకుని ఎదురొచ్చింది.
"ఇదిగో..నేనేమో పొదుపు గురించి ఉపన్యాసం ఇచ్చి వస్తుంటే నువ్వు దుబారాగా రెండు జడలు వేసుకుంటావా? ఒక్క జడ సరిపోదూ పొదుపుగా.." అని క్లాసు పీకాడు.

***

జంబులింగం వెళ్ళక వెళ్ళక ఉడిపి హోటల్‌కి వెళ్ళాడు. టమాట సూప్ ఆర్డరిచ్చాడు.
తీరా చూస్తే సూప్ లో ఈగ కనిపించింది. సర్వర్ ని పిలిచి కేకెలెయ్యసాగాడు.
అందుకు సర్వర్ సమాధానం ఇది..
"సారీ సర్..ఇందాక సూప్ బకెట్ లో కుక్క మూతి పెట్టింది. బహుశా ఈ ఈగ ఆ కుక్క మూతి నుంచీ వచ్చి ఉంటుంది.."



***

ఒక ప్రైవేటు నర్సింగ్ హోమ్ లో రోగంతో చేరిన జంబులింగానికి చాలా భయం వేస్తోంది..
"మీరేం భయపడకండి..మీకేం కాదు." అని ధైర్యం చెప్పింది జాంబవతి..
"అంత ధైర్యంగా ఎలా చెబుతున్నావే..నాకేమో చనిపోతానని భయంగా వుంది.."

" మందులు, రూమ్ రెంటూ, డాక్టర్ ఫీజులూ అన్నీ కలిపి 20 వేల వరకూ కట్టాలి మనం. వాళ్ళకింత బాకీ ఉండగా ఎలా చావనిస్తారు ఈ ఆసుపత్రి వాళ్ళు?" ధీమాగా చెప్పింది జాంబవతి.

***

"డాక్టర్ గారూ.. మా ఆయన ఉన్నట్టుండి 'నేను కారుని' అంటుంటాడు. ఇవాళా కారు కూతలు మరీ ఎక్కువయ్యాయి. భయం వేసి వెంఠనే మీదగ్గరకొచ్చాను.."

" మీ ఆయన్ని కూడా తీసుకురావల్సింది.."

" వచ్చేరండీ.. బైట పార్కింగ్ ప్లేస్ లో ఉన్నారు. అంతకు మించి ముందుకు రాకూడదట.."

***

ఒక్ చోట బాక్సింగ్ పోటీలు జోరుగా జరుగుతున్నాయి." ఊ కొట్టు..కొట్టు.. దెబ్బకు పళ్ళన్నీ రాలి పోవాలి.." అని ప్రేక్షకుల్లోంచి అరుస్తున్నాడో వ్యక్తి.

"మీకు బాక్సింగ్ అంటే అంతిష్టమా?" అడిగేడు పక్కనున్న జంబులింగం.

"ఇష్టమా? పాడా? నేను పక్క వీధిలో ఉన్న డెంటిస్ట్ని.." అన్నాడా పెద్దమనిషి.

***

నాసా శాస్త్రవేత్తలు ఒక అద్భుతమైన స్పేస్ షటిల్ని తయారు చేసారు. కానీ అంతరిక్షంలోకి పంపేందుకే ఆటంకం వచ్చింది. ఎంత ప్రయత్నించినా షటిల్ స్టార్ట్ కావడం లేదు..

ఆఖరికి అక్కడే పనిచేస్తున్న జంబులింగంగారి పెద్దబ్బాయి సోమలింగాన్ని సహాయం చెయ్యమని అడిగారు.

సమస్యంతా విన్న సోమలింగం " షటిల్ని 45 డిగ్రీల కోణంలో వొంచి ప్రయోగించి చూడండి" అని సలహా ఇచ్చాడు.

శాస్త్రవేత్తలు అలానే చేసారు.. అంతే రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్ళిపోయింది.. సైంటిస్టులు ఆనందం పట్టలేకపోయారు..

" మీకు ఇంత గొప్ప ఆలోచన ఎలా వచ్చింది.." అని అడిగారు సోమలింగాన్ని.

" ఆс..ఏముందీ.. మా దేశంలో స్కూటర్ లు స్టార్ట్ కాకుంటే..మా వాళ్ళంతా చేసేది అదే కదా.." అసలు రహస్యం చెప్పాడు సోమలింగం..!






## నెలనెలా నవ్వుల పండుగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

### ఫోటో చూడాలని వుంది..!

కీర్తి రాజు తల్లి 'వచ్చే బుధవారం కీర్తిరాజు పుట్టినరోజని, ఆ రోజు తలంటు పోసుకుని గుడికి వెళ్ళి దేముడికి అర్చన చేయించమని' రాసింది.

కీర్తిరాజు ఛీఫ్ ఇంజినీర్స్ ఆఫీసులో గత నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ఇంకా బ్రహ్మచారే.

కొత్త బట్టలు కుట్టించుకునే వ్యవధి లేదు. సాయంత్రం ఆఫీసయ్యాక లక్‌డీకా పూల్ లో ఒక రేడీమేడ్ బట్టల దుకాణానికి వెళ్ళాడు. దాదాపు అరగంటసేపు ఇరవై రకాల దుస్తులు చూసి చివరికి ఒక జత ఎన్నిక చేసుకున్నాడు. రెండు వందల నలభై రూపాయల చిల్లర ఐంది. ట్రయల్ రూమ్‌లో వాటిని వేసుకుని చూసి బిల్లు చెల్లించాడు.

పుట్టినరోజు ఉదయం షేంపూతో తలంటు పోసుకుని ఆఫీస్‌కి వెళ్ళే దారిలో వున్న వినాయకుడి గుడికి వెళ్ళి అర్చన చేయించాడు. కేంటీన్ లో షర్ట్ జేబులోంచి చేతిరుమాలు తీస్తూంటే, జేబులోంచి చిన్న కాగితం కూడ వచ్చింది. దానిమీద ఇంగ్లీషులో ఏదో రాసి ఉంది. చదివాడు.

"ఈ షర్టుని కొన్న వ్యక్తి ఈ ఉత్తరం చూడగానే దయచేసి తన ఫోటోని ఈ కింది చిరునామాకి పంపించాల్సిందిగా కోరుతున్నాను. - హైందవి"

అది ఆడవాళ్ళ చేతి వ్రాతని స్పష్టంగా తెలిసిపోతోంది.

కాసేపు ఆలోచించాక అర్థమయింది ఆ షర్ట్ బాంబేలో తయారయిందని. , కాలర్ కున్న లేబుల్ని చూసి గ్రహించాడు ఉదయం దాన్ని తొడుక్కుంటూ.

ఆమె చిరునామా - హైందవి, కేరాఫ్ డ్రెస్ వెల్ కంపెనీ, దాదర్, బాంబే అని ఉండడంతో, హైందవి బాంబేలోని ఆ కంపెనీలో పనిచేస్తూండొచ్చని, షర్ట్‌లో చీటీ ఆమె వుంచి వుండచ్చని అనుకున్నాడు.

ఈ షర్ట్ కొనేవాళ్ళ ఫోటోని ప్రత్యేకంగా హైందవి ఎందుకు అడుగుతోంది? కీర్తిరాజుకి అదిమాత్రం అర్థం కాలేదు. ఒక ఫోటో తీయించుకుని ఆమెకి బాంబేకి పోస్ట్‌లో పంపాడు. తన చిరునామాని 'మీరీ ఫోటో ఎందుకడిగారో తెలుసుకోవాలని కుతూహలంగా వుంది' అన్న వాక్యం వెనక రాశాడు.

హైందవి నించి ఒక పోస్ట్ కార్డ్ వచ్చింది కీర్తిరాజుకి.

అందులో ఒకే ఒక వాక్యం వుంది.

" నే కుట్టిన అతి డొక్కు ప్రింట్ షర్ట్ కొనేవాడి మొహం ఎలా వుంటుందో చూడాలని తప్ప వేరే ఏం లేదు.."

## అత్తగారి ఉత్తమ జోకులు ..! — యర్రంశెట్టి శాయి

అత్తగారు నుంచుని అల్లుడితో ఆవుపాలు తీయిస్తోంది. ఈ లోగా ఒక ఆంబోతు రంకెలు వేసుకుంటూ అతని మీదకు రాబోయి వెంటనే తలవంచుకుని వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

ఏ మాత్రం బెదరకుండా అలా పాలు తీస్తూనే ఉన్నాడు.

"అదలా పొడవడానికి వస్తుంటే భయం వేయలేదటోయ్?" అడిగింది అత్తగారు ఆశ్చర్యంగా.

"ఏం వేయలేదు! ఈ ఆవంటే దానికి వణుకు ఇది దాని అత్తగారు.." అన్నాడతను తాపీగా.

****

'సరోజా, నువ్వూ పెళ్ళిచేసుకుందామనుకున్నారుగా! ఏమయింది?"

నాకొచ్చే జీతం ఇద్దరికీ చాలదని మానేశాము!"

"అలాంటప్పుడు మీ మామగారింట్లోనే కాపురం పెట్టేస్తే సరి పోయేది!"

"అదీ ఆలోచించాను! కానీ మా మామగారే వాళ్ళత్తగారింట్లో వుంటున్నారు!"

****

"ఇద్దరు స్త్రీలను పెళ్ళాడిన వాడికి శిక్ష ఏమిటి?"

"ఇద్దరు అత్తగార్లు"

****

రిక్షాదిగి ఇంట్లోకొస్తున్న భార్యనీ- ఆమె వెనుక అత్తగారినీ చూసి మండిపడ్డాడు సుబ్బారావు.

"మీ అమ్మని నీతో తీసుకురావద్దని టెలిగ్రామిచ్చాను కదా! అందలేదా!?"

కోపంగా భార్యనడిగాడు.

"అందింది. ఆ టెలిగ్రామ్ విషయమే తేల్చుకోడానికి కొచ్చింది" అంది భార్య దబాయింపుగా.

****

ఒక లావుపాటావిడ ఓ యువకుడిని డాక్టరు గారింటికి బరబరా ఈడ్చుకొచ్చింది.

"వీడు మా అల్లుడు..! కాళ్ళమీద కర్రతో బాగా కొట్టాను. బొమికలు విరిగినట్లు అనుమానంగా ఉంది.." అంది సీరియస్‌గా.

"మీ స్వంత అల్లుణ్ణే అలా కొట్టుకోడానికి మీకు మనసెలా వప్పింది?"

అడిగాడు డాక్టరు.

"నేను కొట్టక ముందు అల్లుడు కాదు మరి.." గొణిగిందావిడ

****

"ఎందుకోయ్! అలా విచారంగా వున్నావ్?"

" మా అత్తగారి చనిపోయారు..."

"అదేమిటి? మొన్నటి వరకూ ఆవిడెప్పుడు పోతుందా అని ఎదురుచూసే వాడివిగా! ఇప్పుడు దిగులెందుకు?"

"అది నిజమే కాని, ఈ మధ్యన తెలివి తక్కువ పనిచేశాను. ఆవిడకు ఛాదస్తం ఎక్కువయిందని వళ్ళు మండి పిచ్చాసుపత్రిలో చేర్చాను. ఇప్పుడామె చనిపోతూ తన ఆస్తి అంతా నా పేరున రాసింది,.."

"మరింక సంతోషించక ఏడుపెందుకు?"

"ఏడుపుకాక మరేమిటి? ఇప్పుడామెకు పిచ్చిలేదని ఋజూ చేస్తేగాని ఆ విల్లు చెల్లదు.."

***

# చౌ చౌ

"జుట్టు పెరగడానికి మా కంపెనీ తయారు చేసే ఈ మందు వాడండి సార్..ఇది ఎంత అద్భుతంగా పనిచేస్తుందో తెలుసా? రబ్బరు బంతిమీద కూడా జుట్టు మొలిపించగలదు.." గొప్పగా చెప్పాడు సేల్స్‌మన్ శంకర్రావు..

" నువ్వు చెప్పిందంతా బావుందయ్యా..కానీ బంతిమీద మొలిచే మొలిచే జుట్టు ఎవడిక్కావాలి?" విసుక్కున్నాడు జంబులింగం.

***

జంబులింగం గారబ్బాయి సోమలింగబాబు..

సోము అల్లరి భరించలేక విసుగెత్తిపోయి జంబులింగానికి ఒక లెటర్ పంపించాడు టీచర్.

"అయ్యా మీ అబ్బాయి సోము అల్లరి భరించలేకుండా వున్నాం. మీ వాడికి చదునేర్పడం నా వల్లకాదు.." అని వుంది అందులో..

జంబులింగం కొడుకుని పిలిచి ఆ లెటర్ చూపించి

"చూడరా.. నీకు చదువు చెప్పడం తన వల్లకావడం లేదంటున్నారు మీ టీచర్.."

"చెప్పాను కదా డాడీ.. ఆ టీచర్ కి అసలేమీ రాదని.."

***

ఆఫీసు పనిమీద నెలరోజులు కాంపుకెళ్ళిన జంబులింగానికి ఫోన్ చేసాడు కొడుకు సోమలింగం.

"అందరూ బావున్నారు కదా!" అడిగాడు జంబులింగం.

"మన కుక్క పిల్ల చనిపోయింది నాన్నా" చెప్పాడు కొడుకు.

షాక్ తిన్నాడు జంబులింగం. మెల్లగా తేరుకుని "ఇలాంటి వార్తలను ఒక్క సారిగా చెప్పకూడదు..ముందు కుక్కపిల్ల గోడెక్కింది అని చెప్పాలి. తరువాత అక్కడి నుంచి పడింది..కాలు విరిగింది ..హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం..కానీ లాభం లేకపోయింది..అలా మెల్లగా చెప్పాలి..సర్లే ఏం చేస్తాం..ఇంతకీ బామ్మ ఎలా వుంది.." అడిగాడు .

ఒక్క క్షణం లోచించి–

"బామ్మ గోడెక్కింది నాన్నా" చెప్పాడు సోమలింగం.

***

"ఊరుకోవే ఎంత ఏడిస్తే మాత్రం పోయిన మీ ఆయన తిరిగొస్తాడా?" స్నేహితురాల్ని ఓదార్చింది జాంబవతి.

"నూరేళ్ళూ కలిసి ఉందామన్నాడు..ముందే వెళ్ళిపోయాడే." భోరుమంది సూర్యాకాంతం.

" అవునే తను సంపాదించిన డబ్బునంతా తనతోనే సమాధి చేయమని అన్నయ్యగారు చివరికోరిక కోరారట కదా! ఏర్పాట్లు చేసావా?"

"ఆc చేసానే.. డబ్బు మొత్తాన్ని బేంక్‌లో వేసి..అంత మొత్తానికీ చెక్కురాసి ఆయన పక్కనే పెట్టా. ఖర్చు పెట్టుకుంటాడో..దాన్ని అట్టే దాచి పెట్టుకుంటాడో ఆయనిష్టం..మధ్యలో నాకెందుకు.."

" ఆc..!?"

***

"మా టీచర్ నన్ను ఇంకా అర్థమయ్యేలా వ్రాయమంటోంది నాన్నా.." సోమలింగం కంప్లెయింట్ చేసాడు.

"అయితే ఏమయింది..అలవాటు చేసుకుంటే నువ్వే రాయగలుగుతావ్.." జంబులింగం సర్ది చెప్పబోయాడు.

" నువ్వు చెప్పింది బాగానే ఉంది నాన్నా.. కానీ నేను అర్థమయ్యేలా రాస్తే..అందులో తప్పులు తెలిసిపోతాయి కదా.." అమాయకంగా అడిగాడు సోమలింగం..!

***

రోడ్డుమీద పోతున్న ఒకతన్ని ఒక కారు ఢీకొట్టి వెళ్ళిపోయింది. వెంటనే పోలీసు వొచ్చి "మిమ్మల్ని గుద్దేసి వెళ్ళిన కారు నంబరు ఎంతో చెప్పగలరా?" అని అడిగాడు.

"చెప్పటానికి ప్రయత్నిస్తానుండండి..ఆ నంబరుని అదే నంబరు పెట్టి హెచ్చవేసి వచ్చినదాన్ని మూడు పెట్టి భాగించి, ఆ వచ్చిన దానికి స్క్యేర్ రూట్ కడితే జవాబు అసలైన కారు నంబరులోని అంకెలను తారుమారు చేస్తే ఎంత ఉంటుందో..అలానే వుంటుంది.. పైగా అది బేసి సంఖ్యకూడా.." అంటూ చెప్పాడతను.. అన్నట్టు ఆయనో లెక్కల మాస్టారండీ..!

***

లెక్కలు మాస్టారు లక్ష్మణరావుతో కలిసి జంబులింగం షికారుకి వెళ్ళాడు.. దూరంగా మైదానంలో ఆవుల మందొకటి పచ్చిక మేస్తోంది..


"మాస్టారూ.. గుంపులో ఎన్ని ఆవులున్నాయంటారూ.." అడిగాడు జంబులింగం..

" ఆc..ఏముందండీ.. వాటన్నింటికీ కలిపి మొత్తం కాళ్ళు ఎన్నున్నాయో లెక్కపెట్టి ఆ మొత్తాన్ని నాలుగు తో భాగిస్తే సరి.. ఆవుల సంఖ్య ఖచ్చితంగా వచ్చేస్తుంది..!"

***



# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండుగ

కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

### పెళ్ళిచూపులు

ఓ వెర్రి వెంగళప్పకి పెళ్ళి చేసే ఉద్దేశంతో అన్ని జాగ్రత్తలూ చెప్పి పెళ్ళిచూపులకి తీసుకెళ్ళింది అతని తల్లి.

పెళ్ళిచూపులకి వెళ్ళగానే "ఈ అబ్బాయేనా పెళ్ళికొడుకు?" అడిగారు ఆడపిల్ల తరఫు వాళ్ళు. వెంటనే అందుకుని "నేనే పెళ్ళి కొడుకుని. ఈ చొక్కా మాత్రం నాది కాదు" అన్నాడు వెంగళప్ప నవ్వుతూ. వెంగళప్ప సంగతి బయటపడి సంబంధం కుదరలేదు.

"చొక్కా నీదికాకపోయినా ఆ సంగతి చెప్పకూడదు. అందరూ అది నీదే అనుకోవాలి" అని మందలించింది తల్లి.

మరోసారి ఇంకో సంబధం చూడడానికి తల్లితో వెళ్ళాడు వెంగళప్ప. అక్కడకూడా పెళ్ళికొడుకు సంగతి అడిగారెవరో.

"నేనే పెళ్ళికొడుకుని. చొక్కా కూడా నాదే అలాగే అనుకోవాలి మీరంతా.." అన్నాడు వెంగళప్ప.

ఈ సారి కూడా సంబంధం కుదరలేదు. "చొక్కా సంగతి చెప్పడమెందుకు?" అంటూ వెంగళప్పని కసిరింది తల్లి.

కొంతకాలానికి ఎలాగో కష్టపడి మరో సంబంధం కుదుర్చుకోడానికి వెళ్ళారు తల్లీకొడుకులు. "చొక్కా సంగతి మర్చిపో" అంటూ ముందుగానే బోధించింది తల్లి.

కానీ ఈసారి కూడ వెంగళప్ప బుద్ధిమారలేదు. "ఇతనే పెళ్ళికొడుకు" అని పిల్లకి పరిచయం చేస్తున్నారెవరో..

"అవును నేనే పెళ్ళికొడుకుని. నేను తొడుక్కున్న చొక్కా నాది అవునోకాదో నాకు తెలియదు. అయినా చొక్కా సంగతి మర్చిపోవాలి.." అన్నాడు..!!

డాక్టర్..డాక్టర్..!

యర్రంశెట్టి శాయి

డాక్టర్..డాక్టర్..

డాక్టర్: ఇరవై మూడో నెంబరు బెడ్ స్త్రీకి స్పృహవచ్చిందా?

నర్స్: ఇప్పుడే వచ్చింది డాక్టర్!

డాక్టర్: ఏం చేస్తోంది?

నర్స్: పాపం ఆ దెబ్బ తగిలిన చేతులతోనే మొఖానికి పౌడర్ రాసుకుంటోంది.

***

ఒక అర్థరాత్రి డాక్టరు గారింట్లో ఫోన్ మోగసాగింది.

"హలో!" అన్నాడు డాక్టరు విసుగ్గా.

"డాక్టరు గారూ! త్వరగా రావాలి మీరు! మా అబ్బాయి చిన్న పెన్ను మింగేశాడు!" అందో గొంతు.

"ఇప్పుడు రావటం కుదరదు! ఉదయాన్నే వచ్చి చూస్తాలెండి.!"

"మరి అంతవరకూ ఏం చెయ్యమంటారు?" ఆదుర్దాగా అడిగిందా గొంతు.

"పెన్సిల్ తో రాసుకోండి.."

***

కుర్రడాక్టర్ తనను చూస్తేనే చాలు తెగ భయపడిపోతున్న రోగికి ధైర్యం చెప్పాలనుకున్నాడు.

"చూడండి! మీది పెద్ద ప్రమాదకరమైన వ్యాధేం కాదు.! అందాకా ఎందుకు..ఒకప్పుడు నాకూ వచ్చిందీ జబ్బు తెలుసా?" అన్నాడు తేలిగ్గా.

"అవుననుకోండీ..కానీ మీకు నయం చేసింది వేరే డాక్టరు కదా.." నసిగాడా రోగి.

***

"నమస్తే డాక్టరు గారూ! మీరు ఎంతో గొప్పగా వైద్యం చేసి నా లాంటివారికి సహాయపడుతున్నందుకు ధన్యవాదాలర్పించడానికి వచ్చాను.."

"కానీ..నేను మీకెప్పుడూ వైద్యం చేసిన గుర్తు లేదే."

"అది నిజమే కానీ, మా కోటీశ్వరుడు మావయ్యకి మీరు చేసిన వైద్యం మూలానే నేనింత త్వరగా లక్షలకు వారసుడినవగలిగాను."

***

తెల్లారుఝామున మూడింటికి డాక్టర్ గారింట్లో ఫోన్ మోగింది.

"హలో!" అన్నారు డాక్టరుగారు కళ్ళు నులుముకుంటూ.

"డాక్టరు గారూ! నేను శ్రీనివాసరావుని! మీరు అర్జంటుగా మందులన్నీ తీసుకుని మా ఇంటికి రావాలి!" అన్నాడు శ్రీనివాసరావు.

"ఎందుకు ఏమయిందీ?" ఆత్రుతగా అడిగాడు డాక్టరు.

"ఒకటే కలలండీ! పాడు కలలు! ప్రాణం తీసేస్తున్నాయి.."

"ఏం కలలొస్తున్నాయి..?"

"మరేమీ లేదు..త్రిష, శ్రియ, యిలియానా, స్నేహ, ముమాయత్ ఖాన్..- అందరూ కలలో కొచ్చి నన్ను కౌగలించుకుంటున్నారు!"

"ఓరినీ! అదృష్టమయ్యా అదృష్టం! హాయిగా ఆనందించక గొడవ చేస్తావెందుకు? పైగా అంత మంచి కలని పట్టుకుని పాడు కల

అంటవా?"

"ఖచ్చితంగా అంటాను! లేకపోతే ఏమిటిసార్! కలలో నేనూ ఒక అమ్మాయినేనట!" అన్నాడు శ్రీనివాసరావు బాధగా.

***

"డాక్టర్ గారూ! వారం రోజుల క్రితం మా ఆయన వైద్యంకోసం మీ దగ్గరకొచ్చారు.! మీరేం మందిచ్చారో ఏమోగానీ నా సంసారమే సర్వనాశనమై పోయే పరిస్థితికొచ్చింది. ఇంతకుముందు నేనే అందరిలోకీ అందగత్తెననీ, నాకున్న గ్లామర్ మరేస్త్రీకీ లేదనీ అనేవారు. మీ దగ్గర వైద్యం చేయించుకున్న మర్నాటి నుంచీ నేను ఏమాత్రం అందంగా లేననీ, నేను తప్ప మిగతా స్త్రీలంతా ఎంతో అందంగా ఉన్నారనీ అంటున్నారు..."

"నేను చేసిందేమీ లేదమ్మా! కళ్ళు సరిగా కనబడకపోతే సరిపోయే కళ్ళజోడు కొనిపించానంతే.."

***

ఓ పెద్దమనిషి పిచ్చాసుపత్రిలోని డాక్టరు దగ్గరకొచ్చాడు.

"ఏమిటి విషయం?" అడిగాడు డాక్టరు.

"ఓ సారి మానసిక వైద్యుడి దగ్గర చూపించుకురమ్మని మా ఆవిడ పోరేస్తుంటే బాధపడలేక వచ్చాను.!" అన్నాడు పెద్దమనిషి.

"ఆవిడెందుకలా పోరేస్తోంది?" శ్చర్యంగా అడిగాడు డాక్టరు.

"నాకు బూట్లంటే చాలా ఇష్టం అదే దానిక్కోపం.." అన్నాడా పెద్దమనిషి.

"దానిదేముందీ! బూట్లు చాలామందికి ఇష్టమే. అందాకా ఎందుకూ నాక్కూడా బూట్లంటే ఇష్టమే! నాలుగు జతలు కొనుక్కున్నాను మొన్ననే.." అన్నాడు డాక్టరు.

"అరె! మీక్కూడా ఇష్టమేనా! ఆశ్చర్యంగా ఉందే! అయితే వాటిని మీరు ఎలా తింటారు? ఉడకబెట్టా? వేయించుకునా?" అడిగాడా పెద్దమనిషి.

***

"నాకు జరగబోయే ఆపరేషన్ ప్రమాదకరమయిందంటారా?" ఆపరేషన్ టేబుల్ మీద పడుకుని అడిగాడు రామారావు.

"పిచ్చి వాడా!" నవ్వాడా డాక్టర్.." మీరిచ్చే మూడొందలకి ప్రమాదకరమైంది కాదుగదా, మామూలు ఆపరేషన్లు కూడా ఎవ్వరూ చేయరోయ్.."

***

## చౌ చౌ

"ఏరా! నాగురించి అన్నీ అబద్ధాలు చెబుతున్నావంట అందరికీ..అలా ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పడం మానేస్తే..నీకో సాయం చేస్తాను.."

"ఏమిటదీ..?"

"నీ గురించి నిజాలు చెప్పడం మానేస్తాను.."

***

"జాంబవతీ.. ఈ విషయం విన్నావా? ఈ విదేశీ పత్రికలో ఒక వ్యాసం వచ్చింది. మగవాడు ఎంత మూర్ఖుడైతే అతనికి అంత అందమైన భార్య దొరుకుతుందట.."

"అవును నిజమే సుమా..చిన్నప్పటి నుంచీ అందరూ నన్ను అందగత్తెననే పొగుడుతుంటారు..!"

***

"నాపెళ్ళయ్యాక ఒకే ఒక్కసారి మా ఆవిడ నా మాట విందిరా"

"ఓ..అలానా? ఎప్పుడూ?"

" ఆ మధ్య భూకంపం వచ్చినప్పుడు..ఏమేవ్ బయటికొచ్చేయ్..అని అరిచా.అంతే తక్కున బయటికొచ్చేసింది.."

***

"పాడటం వలన రక్తం వేడెక్కుతుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు తెలుసా మీకు..?"

"అవును నిజమే.. మీరలా వేదికమీద మైకు వదలకుండా పాడుతుంటే..వింటున్న మా రక్తం వేడెక్కుతూ ఉంటుంది..."

***

"అవునూ...గత వారంరోజుల నుంచీ మీవారితోటే మొక్కలకి నీళ్ళు పట్టిస్తున్నావంట.. ఏమి టెక్నిక్ వాడావోయ్.."

"ఏం లేదు..ఒక్కటే మాట అన్నాను.. తోటలో మొక్కలకి కూడా నీళ్ళు పెట్టలేనంత ముసలితనం వచ్చేసిందా? అన్నానంతే..!"

***



"ఎందుకు జంబులింగం..అలా విచారంగా వున్నావ్.."

"మా ఆవిడ ఉద్యోగం వెదుకుతోంది.."

"దానికి నీకెందుకు విచారం?"

"ఆవిడ ఉద్యోగం వెదికేది నాకోసమే.."

***

జంబులింగం హెల్మెట్ లేకుండా స్కూటర్ మీద వెళ్తుంటే ట్రాఫిక్ పోలీస్ ఆపాడు..

"ఏయ్..మిస్టర్..మీరు హెల్మెట్ పెట్టుకోలేదు..స్కూటర్ కి హెడ్ లైట్లు కూడా లేవు.."

"లైట్లెందుకు..నాకు చూపు బాగానే ఆనుతుంది.."

"అసలు లైసెన్స్ ఉందా?"

"లైసెన్సా..ఎందుకు..నేనెప్పుడు తీసుకోలేదు.."

"స్టేషన్ కి నడవండి.."

వెంటనే మిసెస్ జంబులింగం జాంబవతి కలగచేసుకుని..

"దయచేసి మీకు పుణ్యం ఉంటుంది..ఆయన్ని వదిలేయండి ఇన్స్పెక్టర్ గారూ..తాగి నప్పుడు ఏం మాట్లాడతారో..వారికే తెలీదు.." అంది.

***

జంబులింగం, జాంబవతి వాళ్ళబ్బాయి సోమలింగం పుట్టినరోజుకని స్నేహితుల్ని ఇంటికి పిలిచారు. జంబులింగం ఇంట్లో సామాన్లన్నీ సర్దుతూ డ్రాయింగ్ రూమ్ లో ఉన్న కొన్ని పుస్తకాలూ, అలంకరణ సామాగ్రీ తీసేసి లోపల ఎక్కడో పెట్టేస్తుంటే జాంబవతి అడిగింది.."ఏమండి..అవన్నీ ఉంటే డ్రాయింగ్ రూమ్ అందంగా ఉంటుంది కదా.. ఎందుకలా లోపల పెట్టేస్తారు.." అని అడిగింది.

" పిచ్చి మొహమా.. ఎవరి వస్తువులు వాళ్ళు గుర్తు పట్టెయ్యరూ.."

***

"ఏమండీ..ఇందాక టి.వి9 లో ఒక కొత్త వార్త చెప్పారు తెలుసా?"

"ఏమిటది?"



"చాలా ప్రమాదాలు వంటింట్లోనే జరుగుతాయుట,,"

"అవును నిజమే వాటిల్లో కొన్నింటిని మేము తినాల్సి వస్తుంది కూడా.."

***

"మీవారు రీసెర్చి స్కాలరంట కదా..అంటే ఎప్పుడూ ఏదో ఒకటి వెదుకుతూనే ఉంటారన్న మాట..అయినా ఎప్పుడూ అన్వేషించడానికి ఏముంటుందండీ?"

"ఎందుకుండదూ.. ఆయన కళ్ళజోడే ఉదాహరణ.. రోజులో చాలా భాగం దాన్ని అన్వేషించడంలోనే సరిపోతుంది.."

***


"జంబులింగం గారూ.. అన్యోన్య దాంపత్యానికి కొన్ని సూత్రాలు చెబుతారా?"

"కొన్ని ఎందుకు నాయనా..ఒక్కటి చాలు.."

"ఏమిటది.."

"మీ ఆవిడ అనుకున్న దార్లో ఆవిడని వెళ్ళనీ.. నువ్వూ ఆవిడ దార్లోనే వెళ్ళిపో.."

***



"కష్టపడి పనిచేయడం కాదురా స్మార్ట్‌గా పనిచేయడం నేర్చుకోవాలి.."

"అలాగా?"

"అవును మరి..నన్ను చూడు..ఈ హోటల్లో కాషియర్‌గా చేరిన సంవత్సరానికే ఈ హోటల్‌ని కొనేశాను.."

"నాకలా కుదరదోయ్.. మా ఓనర్ ఎప్పుడూ కాష్ కౌంటర్ దగ్గరే నిలుచుంటాడు..!" ***




# నెలనెలా నవ్వుల పండుగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## తత్వం

'వేరు కాపురం' అన్నది రాధిక మనసులో చిన్నప్పట్నుంచీ వున్న కోరిక. అయితే సంబంధం మంచిదని సమిష్టి కుటుంబం అయినా శ్రీనివాస్‌కే ఇచ్చి చేశారు. వాళ్ళ పెళ్ళవగానే ఆషాఢమాసం వచ్చి పడింది. అది అయ్యేలోగా శ్రీనివాస్‌కి ఏలూరు నుంచీ విజయవాడకి బదిలీ అయింది. రాధిక కోరిక తీరి వేరు కాపురం పెట్టింది.

మొదటి మూడు నెలలు గడిచాక రాధికకి టీచర్‌గా వాళ్ళున్న పేట లోనే నడిచి వెళ్ళేంత దూరంలో ఒక స్కూలులో వుద్యోగం దొరికింది. రాధిక ఆ సంగతి తండ్రికి లెటర్రాసింది. అసలే కొత్త కాపురం, పైగా రెండే రెండు గదుల ఇల్లు కాబట్టి రాధిక తల్లిదండ్రులు తాము వెళ్ళి కొత్త దంపతులని డిస్టర్బ్ చెయ్యకూడదని ఇంతకాలం కాపురం చూడడానికి వెళ్ళలేదు.

ఆ లెటర్ చదివాక కాస్త సాయంగా వున్నట్లవుతుందని వెళ్ళారు. అయితే రాధిక ఇంటికి వెళ్ళేసరికి తాళం కప్ప కనబడింది వాళ్ళకి. స్కూల్ కి వెళితే తండ్రిని చూసి ఆశ్చర్యపడింది. సంతోషపడింది. వాళ్ళ లెటర్ అందనందుకు నొచ్చుకుంది రాధిక.

ఇంటి తాళంచెవి ఇచ్చి, తను మధ్యాహ్నం వచ్చేస్తానని చెప్పి పంపింది. తాళం తీసి లోపలికి వెళ్ళిన దంపతులు అవాక్కయ్యారు.

వెనక గదిలోంచి పెరటిలోకి ఉన్న తలుపు దగ్గరికి వేసి వుంది. ఇంట్లో సామానంతా చెల్లాచెదురుగా పడిఉంది.

అలమరాలో ఉండాల్సిన పుస్తకాలు, తెరిచిన బీరువాలో ఉండాల్సిన బట్టలు నేలమీద కుప్పగా పడిఉన్నాయి.

"దొంగలు పడినట్లున్నారండి.." చెప్పిందావిడ భర్తతో. అరగంటలో పోలీసులు వచ్చి ఆ ఇంటిని పరీక్షగా చూసి చెప్పారు.

" దొంగలు కాస్త ఖరీదైన రకాల్లా ఉన్నారు. ఇల్లంతా విలువైన వాటికోసం మాత్రమే వెదికారు."

ఈ లోగా రాధిక వచ్చింది. "ఏమేం పోయాయో లిస్ట్ రాసివ్వమ్మా.." చెప్పాడు ఎస్.ఐ.

రాధిక అందరి వంకా సిగ్గుగా చూసి తలవంచుకుని చెప్పింది..

"దొంగలు పడలేదండీ.. మా ఇల్లెప్పుడూ ఇంతే! వెనక తలుపు మూయడం మరచినట్లున్నానంతే..మా వారికి శుభ్రత తెలీదు. ఇల్లంతా

సర్దినా మళ్ళీ ఆగం చేస్తారని విసిగి నెల రోజులుగా సర్దడం మానేశాను.."

## సరదా సరసాలు

యర్రంశెట్టి శాయి

ఎంత బ్రతిమాలినా తను ప్రేమించిన అమ్మాయి తనను నిర్లక్ష్యం చేస్తుండే సరికి విక్రమార్కరావు కొత్త ఉపాయం ఆలోచించాడు.
ఓ రోజు రాత్రి ఆమె తన గదిలో కూర్చుని చదువుకుంటుంటే అతగాడు నిచ్చెన వేసుకుని మేడ ఎక్కి ఆమె గదిలోకి చేరుకుని "నేనొచ్చాసా" అన్నాడు ఆనందంగా.

ఆమె అతనిని చూసి మండిపడింది.

"ఛీ! నీ మొఖం చూడడం నాకిష్టం లేదు.."అందా అమ్మాయి కోపంగా.

"ఓకె..అలాగే!" అనేసి లైట్లార్పేసాడతను.

***

ఓ మిలటరీ మేజర్ ఓ సాయంత్రం ఒక అందమయిన అమ్మాయితో కబుర్లు చెప్తున్నాడు. మాటల మధ్యలో అతని బుగ్గమీదున్న గాయం గుర్తు చూసి "ఏదో పెద్ద ప్రమాదం తప్పించుకున్నట్లున్నారే!" అందా అమ్మాయి.

"అవును! చాలా పెద్ద ప్రమాదం!"

"ఎలా తప్పించుకున్నారు?"

"అదృష్టం! వెంట్రుకవాసిలో తప్పిపోయింది.."

"ఎప్పుడు జరిగింది? సరిహద్దు యుద్ధంలోనా?"

"కాదు..! ఒక అమ్మాయికి ముందు మాట ఇచ్చి తరువాత కాదన్నప్పుడు.." అన్నాడు మేజర్ రావు.

***

ప్రేమారావ్‌కి, భామామణికి పెళ్ళయిపోయింది.

"భలే.. పురోహితుడు కళ్ళు మూసుకుని నాలుగు మంత్రాలు చదువుతే చాలు పెళ్ళయిపోయినట్లే! తమాషాగా లేదూ..?" ప్రేమారావుతో అంది భామామణి.

"అంతకంటే తమాషా ఇంకోటుంది.. కళ్ళు మూసుకుని నిద్రలో నేను నాలుగు సార్లు ఏ ఆడపేరైనా కలవరిస్తే మనం విడాకులు తీసుకున్నట్లే..భలే..కదూ.." అన్నాడు ప్రేమారావ్.

***

ఆఫీసరుగా ఉన్న తన స్నేహితుడిని చూడ్డానికి వెళ్ళాడు బోసుబాబు.



ఆ స్నేహితుడు దిగులుపడి కూర్చుని కనిపించాడు.

"ఏంట్రా అలా వున్నావ్?" అడిగాడు బోసుబాబు ఆశ్చర్యంగా.

"ఏం చెప్పను? మా ఆవిడతో పెద్ద చిక్కొచ్చి పడింది.."

"ఏం చేసింది?"

"నా పాత సెక్రటరీని తీసి పారేసి కొత్త సెక్రటరీని ఏర్పాటు చేసింది.."

"ఇంతేనా? దానికింత దిగులెందుకు? ఇంతకూ ఈ కొత్త సెక్రటరీ ఎలా వుంటుంది..? జడవేసుకుంటుందా లేక ముడి వేస్తుందా?"

" నా మొఖం..వాడిది బట్ట తల..!"


***

బోలెడు సంబంధాలు చూసి బోలెడు అందంగా ఉండే రాజేశ్వరిని పెళ్ళి చేసుకున్నాడు ఏకాంబరం

"నాకు తెలీకడుగుతాను! అందమయిన అమ్మాయిలు సాధారణంగా భయం, అనుమానాలతో బాధపడే మగాళ్ళనే చేసుకుంటారెందుకని?" అడిగాడు ఏకాంబరం.

"మేము కావాలని అలాంటి వాళ్ళని చేసుకోము! వాళ్ళే తరువాత అలా తయారౌతారు.." అంది రాజేశ్వరి.

***



ఓ వరహాల్రావుకి ఎలాగయితేనేం - ఓ ఉద్యోగం దొరికింది.

అది ఆడపిల్లల హాస్టల్లో వార్డెన్ ఉద్యోగం. హాస్టల్ అధికారి అతనికి వార్డెన్ ఉద్యోగం తాలూకు వివరాలన్నీ చెప్పి, హాస్టల్లోని అన్ని గదుల తాళం చేతులూ అతని చేతికిచ్చాడు.

"ఇక జీతం విషయానికొద్దాం.. నెలకు వెయ్యి రూపాయలు..ఫరవాలేదనుకుంటాను.." అడిగాడతను.

వరహాల్రావు ఒక క్షణం ఆలోచించి " అంత డబ్బు కట్టటం నాక్కొంచెం కష్టమవుతుందేమోనండీ..ఏమయినా తగ్గించగలరా?" అని అడిగాడు దిగులుగా.

***



"నావద్ద మాటలొచ్చిన మేక ఉంది తెలుసా?.."

"ఎలాగా?"

"ఏప్రిల్ నెల తర్వాత ఏనెల వస్తుంది అని అడిగితే ..మే..మే.. అని బదులిస్తుంది.."

"నా దగ్గర లెక్కలు వచ్చిన పిల్లి ఉంది తెలుసా?"

"పిల్లికి లెక్కలు వస్తాయా?"

"అవును మరి.. రెండులోంచి రెండు తీసేస్తే ఎంత అంటే ఏం మాట్లాడదు తెలుసా మరి..!"

***

"అరే..ఒక సిగరెట్ ఉంటే ఇస్తావా.."

"ఒకటేం ఖర్మ...మొత్తం పాకెట్టే తీసుకో.."

"పనిలో పని అగ్గి పెట్టిస్తే వెలిగించుకుని ఇస్తాను.."

"మళ్ళీ ఇవ్వనవసరంలేదు..ఉంచేసుకో.."

"ఏమిట్రా అడిగినవన్నీ ఇచ్చేస్తున్నావ్..లాటరీ ఏమైనా కొట్టావేమిటీ.."

"లాటరీ కాదు..నిన్ననే డాక్టర్ నాకు లంగ్ కాన్సర్ అని చెప్పాడు."

***

జంబులింగం మిత్రుడితో బాతాఖానీ వేస్తుంటే అతడు చెప్పాడు..

"నీకు తెలుసా జంబులింగం...నువ్వు ఏటాపిక్ చెప్పినా సరే నేను అనర్గళంగా అరగంట సేపు మాట్లాడగలను.."

"ఓస్ ఇంతేనా.. మా ఆవిడైతే ఏటాపిక్ చెప్పకపోయినా సరే.. గంటల తరబడి మాట్లాడగలదు తెలుసా?"

***

అర్థరాత్రి ఎవరో తలుపు కొట్టారు."లేచి చూడండి.." అంది జాంబవతి జంబులింగంతో..

వెళ్ళి చూసి వచ్చి..

"ఎవరో..మంచి నిద్ర చెడగొట్టాడు.."

"విషయం ఏమిటీ.."

"కొంచెం తొయ్యమంటున్నాడు.."

"పాపం ..సాయం చెయ్యకపోయారా?"

"బయట ఒకటే వాన ఎవరు వెడతాడు.." విసుక్కున్నాడు జంబులింగం..

"అదేమిటండి..పాపం..వర్షంలో కారు ఆగిపోయిందేమో..కాస్త తోసి సాయం చేస్తే ఏం పోతుందండీ.."

భార్య సణుగుడు భరించలేక గొడుగేసుకుని బయటికి వచ్చాడు జంబులింగం.

"హలో ఎక్కడున్నారు.." కేకేసాడు బిగ్గరగా..

""ఇదుగో ఇక్కడ మీ ఇంటి ముందున్న పార్కులో ఉయ్యాలలో ఉన్నా..త్వరగా వచ్చి కాస్త తొయ్యండి.." హుషారుగా సమాధానమిచ్చాడు తాగుబోతు తిమ్మారావ్..

***

హోరా హోరీగా జరిగిన వేలం పాటలో ఒక చిలకని కొనుక్కుంది జాంబవతి..

"ఇంతకీ ఈ చిలక బాగా మాట్లాడుతుందని నమ్మొచ్చా.." షాపతన్ని అడిగింది.

"భలే వారే..ఇంకా నమ్మకపోతే ఎలా మేడం..ఇందాకట్నుంచీ మీతో పోటీపడి వేలం పాట పెంచిందెవరనుకుంటున్నారు..?"

***

భార్యని ఉడికిద్దామని జంబులింగం ఒకరోజు..

"డియర్...నేను చనిపోతే నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగాడు..

"ఛా..లేదండి.. నేను మా చెల్లితో ఉంటాను.." అంది జాంబవతి పవిత్రంగా.." మరి ఒక వేళ నేను పోతే ..మీరూ..?" ఎదురు ప్రశ్న వేసింది జాంబవతి..

"నేనూ అంతే.. మీ చెల్లితోనే ఉండిపోతాను.."

***


జంబులింగం ఆఫీసులో కొత్త ఉద్యోగాలకి ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. జంబులింగం కాండిడేట్స్‌ని ప్రశ్నలు అడుగుతున్నాడు..

"ఈ ఉద్యోగానికి మామూలు క్వాలిఫికేషన్స్ మాత్రమే కాక అదనంగా ఏమైనా ప్రత్యేక స్కిల్స్ ఉండాలి..మరి మీకు..?"

"ఉన్నాయి సార్.. నేను పది నవలలూ, పాతిక కథలూ, ఒక వంద గేయాలు రాసాను..అన్నీ పత్రికల్లో పబ్లిష్ అయ్యాయి కూడా.."

"నేనడిగేది.. ఆఫీసులో చెయ్యగలిగే పనులగురించి.."

"క్రిందటి జాబ్‌లో ఇవన్నీ ఆఫీసు టైములో వ్రాసిన వేనండీ.."






# నెలనెలా నవ్వుల పండుగ

కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

## కాలక్షేపం



**"అది కాదు**..పక్కది చూపించండి.."

సేల్స్ కౌంటర్ ముందున్న చిన్న స్టూల్ మీద కూర్చున్న నలభై ఏళ్ళావిడ ఎదురుగావున్న బట్టలని చూపిం

సేల్స్ గర్ల్ రేవతికి విసుగ్గా వుంది. కాని తప్పదు. అప్పటిదాకా దాదాపు నలభై రకాల చీరలు తీసి ఆవిడ

ఆవిడకి.

ఆవిడ చూపించిన చీర తీసి, కౌంటర్ మీద పరచింది. చేత్తో దాని నాణ్యతని పరిశీలించింది. ఆవిడ పె

చెప్పింది.

"ఆకు పచ్చరంగు అంచుండే చీర దొరుకుతుందా ఇదే రంగులో?"

తల అడ్డంగా వూపింది ఆవిడకళ్ళు మళ్ళీ చీరలమీదికి వెళ్ళాయి. కొన్ని నిమిషాలు పరీక్షగా చూసి చెప్పింది.

" వూదా రంగు చీర చూపించండి"

రేవతి విసుగుని ప్రదర్శించకుండా దాన్ని బయటికి తీయడానికి వెనక్కి తిరిగింది. ఆవిడ కూతురు మాటలు వినబడ్డాయి.

"వర్షం తగ్గిందే అమ్మా! తగ్గాక చెప్పమన్నావు కదా.."

ఆవిడ మాటలు వినబడ్డాయి వెంటనే..

"వద్దులెండి..తీయకండి..థాంక్స్.."

వెనక్కి తిరిగే సరికి ఆవిడ తన ఆరేళ్ళ కూతురి చేతిని పట్టుకుని వెళ్ళడం కంటపడింది.

***

## హోటల్ హాస్యం

యర్రంశెట్టి శాయి

రామారావు బార్ కెళ్ళేటప్పటికి రాత్రి ఒంటిగంటయిపోయింది. బార్ లో ఓ మూల టేబుల్ మీద తలపెట్టుకుని పడుకున్న దేవదాసు తప్పితే వేరెవ్వెరూ లేరు.

తనూ ఓ టేబుల్ ముందు కూర్చుని "బీరు సప్లయి చేస్తావా?" అనడిగాడు రామారావు దగ్గరకొచ్చిన బేరర్ ని.

"ఇప్పుడు సర్వీసు లేదు సార్! టైమైపోయింది.." అన్నాడు బేరర్.

"మరి- అతనెవరో ఇంకా టేబుల్ మీదే పడుకున్నాడు కదా! అతనిని బయటికి పంపరేం?" కోపంగా అడిగాడు రామారావు.

"ఎందుకు పంపుతాము సార్! ఇప్పటికి మూడు సార్లు లేపాము! మూడు సార్లూ లేచి బిల్లెంతయిందో కనుక్కొని, మూడు సార్లూ బిల్లు చెల్లించాడు.." అన్నాడు బేరర్ ఆనందంగా మళ్ళీ ఆ టేబుల్ వైపు నడుస్తూ.

***



ఓ లావుపాటి వస్తాదు ఓ మిలటరీ భోజన హోటల్‌కి వెళ్ళాడు.

"ఒక కోడిని బాగా రోస్టు చేసి తీసుకురా!" అన్నాడు సర్వారావుతో.

కొద్దిసేపటి తర్వాత సర్వరు కోడిని ప్లేట్లో తీసుకొచ్చి అతని ముందుంచాడు.

ఆ కోడికి ఒకే కాలు ఉండడం చూసి "ఇదేమిటీ...దీనికి ఒకటే కాలుంది?" అనడిగాడు వస్తాదు ఆశ్చర్యంగా.

"ఇవాళ పొద్దున ఈ కోడి, మరోకోడితో పోట్లాడింది సార్! ఆ పోట్లాటలో ఒక కాలు విరిగిపోయింది.!" అన్నాడు సర్వారావు అప్పటికప్పుడే ఒక కథ అల్లి చెబుతూ.

"ఓహో..! అలాగే! అయితే దీన్ని వాపసు తీసుకెళ్ళి, ఆ గెలిచిన కోడినే రోస్టు చేసుకురా!" అన్నాడు వస్తాదు.

***

ఓ రంగనాథ రావు హోటల్లోకి జొరబడి 'టీ'కి ఆర్డరిచ్చాడు. సర్వారావు 'టీ' తెచ్చి అతని ముందుంచగానే ఓ చుక్క చప్పరించి సర్వరు మీద మండిపడ్డాడతను.



"ఈ 'టీ' ఎలా ఉందో తెలుసా నీకు?" రౌద్రంగా అడిగాడతను.

"ఎలా వుందండీ..?"

"అంట్లు కడిగిన నీళ్ళూ ఉంటాయ్ చూడూ..అదే రుచి.."

సర్వారావు హోరున ఆశ్చర్యపోయాడు.." ఆ రుచి మీకెలా తెలుసు సార్?"

***

"ఏమిటయ్యా.. ఇవి పూరీలు! ఇలాగేనా పూరీలు చేసేది?" అడిగాడు ఒక పెద్దమనిషి హోటల్ మేనేజర్ ని.

"ఇదిగో చూడండి! మీరు పుట్టకముందునుంచీ నేను పూరీలు చేస్తున్నాను.." కోపంగా అన్నాడు మేనేజర్.

"అయితే అయుండవచ్చు! కానీ వాటిని ఇప్పుడా అమ్మటం?" ఇంకా కోపంగా అన్నాడా పెద్దమనిషి.

***

భోజనం చేస్తూ మధ్యలో సర్వర్ ని పిలిచాడు జంబులింగం.

"ఏమయ్యా! ఆ కుక్కేమిటీ, ఇందాకటి నుంచీ నా వైపే చూస్తోంది?"

"మరేం లేదు సార్! మీరు భోజనం చేసే ప్లేట్ నిజానికి దానిది. ప్లేటులు చాలక అది వాడుతున్నాం - అందుకని చూస్తోంది.."

***

ఈఫెల్ టవర్ రెస్టారెంట్లోనే ఎప్పుడూ భోజనం చేసే ఒక ఫ్రెంచి దేశీయుడిని అదే చోట ఎందుకు భోజనం చేస్తున్నావని ప్రశ్నించారు.

"ఇంకెక్కడ చేయాలయ్యా! అదొక్కచోటే ఆ పాడు టవర్ కనిపించకుండా ఉంటుంది.."

***

## చొచొ

"మేస్టారూ.. మీరు చెప్పేది వినాలనే ఉంది కానీ అదేమిటో సార్..రెండు చెవుల్లోంచి లోపలికి వెళ్ళి ఇంకోచెవిలోంచి బయటికి వచ్చేస్తోంది.." సూరిలింగం టీచర్ తో చెప్పాడు..

"ఏంటీ.. రెండు చెవుల్లోంచి వెళ్ళి ఇంకోచెవిలోంచి బయటికి వస్తోందా? నీకున్నది రెండు చెవులే కదరా.."

"చూసారా సార్..నాకు లెక్కలు కూడా రావని తెలిసి పోయింది.."

***

"న్యూస్ పేపర్ కీ టి.వి. కి తేడా ఏమిటో చెప్పరా సూరీ.."

"న్యూస్ పేపరైతే చదివేసాక ఇంచక్కా పొట్లాలు కట్టుకోవడానికి ఉపయోగపడుతుంది..లేదా పాత పేపర్ల అబ్బాయికి అమ్మెయ్యొచ్చు.. టి.వి. తో అలా వీలుకాదు.."

***

"మా స్కూల్లో పిల్లలు ఎవరూ చేయలేని పని..చివరికి టీచర్లు కూడా చేయలేనిది నేను ఒక్కణ్ణే చేయగల్ను..."

"ఏంటది..?"

"నేను రాసిన నోట్సుని చదవటం.."



***



'ఏమోయ్..చూసావా నీ సుపుత్రుడేం చేసాడో.."
"ఏం చేసాడండీ.."
"నా జేబులు డబ్బులు దొంగతనం చేసాడు.."
"వాడే చేసాడని మీకు నమ్మకమేమిటీ..నేనైనా చేసుండవచ్చు కదా.."
"నువ్వు కాదులే.."
"మీకెలా తెలుసు.."
"జేబులో ఇంకా వంద రూపాయలు మిగిలున్నాయిలే.."

***

భర్తని తలమీద కొట్టడం వల్ల ఆయన చనిపోయాడన్న ఆరోపణమీద గుండమ్మ గారి మీద కోర్టులో విచారణ జరుగుతోంది.
"గుండమ్మ గారూ..మీరు తలమీద కర్రతో కొట్టడం వల్లే మీ వారు చనిపోయారని ఆరోపణ.. మీరేమంటారు..?"
"జడ్జిగారూ..! అది కావాలని చేసింది కాదు. ప్రమాదావశాత్తూ జరిగింది.." నెమ్మదిగా చెప్పింది గుండమ్మ.
"ఎలా?"
" కర్ర విరిగిపోవాలని నేను అనుకోలేదు.."

***

"సార్..బేంకులో డిపాజిట్ చెయ్యడానికి తీసుకెళ్ళిన కాష్ అంతా మధ్యలోనే దొంగలు కొట్టేసారు.."
" అదేమిటీ సెక్యూరిటీ కోసం నీకు పిస్తోలు కూడా ఇచ్చాను కదా.."
"అవునుసార్.. అది నా పాంటు జేబులో ఉంది..అదృష్టవశాత్తూ..అది వాళ్ళకంటపడలేదు..లేకపోతే అదికూడా దోచుకునే వాళ్ళే.."

***

జంబులింగాన్ని మిత్రులందరూ కలిసి హాస్పిటల్లో ఎమర్జెన్సీ రూమ్‌కి తీసుకొచ్చారు..
"అరే..విచిత్రంగా ఉందే..ఈయన తలలో ఇన్ని గుండుసూదులెలా గుచ్చుకున్నాయీ..?"
"ఆఫీసులో టేబిల్ మీద తలపెట్టుకుని నిద్రపోతున్నాడు సార్.."

***

74 సంవత్సరాల శోభారాజ్ 25 సంవత్సరాల అందమైన జూలీని పెళ్ళి చేసుకోవడం చూసి మిత్రులంతా ఆశ్చర్యపోయారు..అంత అందమైన యంగ్ లేడీ ఎలా పెళ్ళికి ఒప్పుకుందా అని సస్పెన్స్ తట్టుకోలేక అడిగేసారు..
" ఏమీ లేదు..చాలా సింపుల్..నా వయసు 75 బదులు 95 అని చెప్పాను.." అసలు రహస్యం చెప్పేసాడు వృద్ధ శోభారాజ్..!

***




కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

## అభినందన సభ

ఓ తెలుగు నిర్మాత ఒరియా కథని, బెంగాలీ దర్శకుడితో హిందీలో తీశాడు - అవార్డులకోసం. అది హైదరాబాదులో రిలీజ్ అయింది. యథావిధిగా , తెలుగు నిర్మాతల సాంప్రదాయం ప్రకారం సినిమాకి అభినందన సభని ఏర్పాటు చేసారు. నవాయితీగా చిత్రనిర్మాణం మీద అవగాహన లేని రచయిత్రులని మాట్లాడడానికి పిలిచారు.

ఓ అయిదు నక్షత్రాల హోటల్లో నాలుగో తారీఖున ముగ్గురు రచయిత్రులు సినిమా మీద తమ అభిప్రాయాలని మైక్ ముందు పలికారు.



అంతదాకా సదరు తెలుగు నిర్మాత తీసిన చిత్రాలన్నీ ఒక ఎత్తైతే ఇదొక్కటే ఒక ఎత్తని, అది చూసి పరవశించిపోయానని, దీన్ని తెలుగులో తీస్తే తెలుగు ప్రేక్షకులు కూడా నందాన్ని పంచుకుంటారని, కనీసం తెలుగులోకి డబ్ చేసైనా విడుదల చేయాలని, తెలుగు ప్రేక్షకుల తరఫున కోరుతున్నానని మొదటి రచయిత్రి వక్కాణించారు.

రెండో రచయిత్రి `హా! ఏమి కథ! ఏమి పాత్ర పోషణ!? ఏమి కెమేరా పనితనం!! ఏమేమి దర్శకత్వపు మెళకువలు?షడసోపేతమైన విందారగించిన భావన కలిగేను కదా!?` అని తెలుగు క్లాసు తీసుకున్నారు.

ఇక మూడో రచయిత్రి మాత్రం తక్కువ తిందా?

" సినిమా అంతా ఒక ఎత్తు, పొలం గట్టున హీరో కొడుకు గడ్డిపూవు కోసిన షాట్ ఒక ఎత్తు, ఒక్కషాట్ కోసం సినిమాని ఇంకో సారి చూడాలనుకుంటున్నాను. దర్శకుడు గారికి అలాంటి కోణాం ఎలా స్ఫురించిందో తెలుసుకోవాలని ఉంది." అంది.

వెంటనే బెంగాలీ దర్శకుడికి విషయం ఇంగ్లీష్ లో వివరిస్తే, యన మైక్ అందుకుని ఒక ముక్కలో జవాబు చెప్పాడు.

"కెమేరాని ఒరిఃఈఐ అంగుళం లెఫ్టికి పెడితే, అక్కడున్న టి.వి.టవర్ కనిపిస్తుంది. ఒక్క అంగుళం కుడి వైపుకి పెడితే ఎయిర్ పోర్ట్ కనిపిస్తుంది. ఈ రెండూ చిత్రకథా సమయానికి చెందినవి కావు కాబట్టి షాట్ ని అలా తప్పని సరిగా తీయాల్సి వచ్చింది."

***

## లక్ షాధికారి

యర్రంశెట్టి శాయి

"మీ పర్స్ దొరికిన వారికి వెయ్యి రూపాయలు బహుమానం యిస్తానంది మీరేనా?" లక్ షాధికారి దగ్గరకు ఒక బిక్ షాధికారి వచ్చి అడిగాడు.

"అవును! నీకు దొరికిందా?" సంబరంగా అడిగాడు లక్ షాధికారి.

"ఇంకా లేదు. ఇంకొంచెం టైమ్ పడుతుంది. ఈ లోగా వెయ్యి రూపాయల్లో కొంత ఎడ్వాన్స్ తీసుకుందామని వచ్చాను.."

***

అర్జంటుగా లక్ షాధికారి అయిన వ్యక్తిని ఓ విలేఖరి ఇంటర్వ్యూ చేయడానికొచ్చాడు.

"మీరు లక్షాధికారి ఎలా అయ్యారు?"

"నేను ఒక లక్షాధికారికి వ్యాపారంలో భాగస్తుడిగా చేరాను. అతని దగ్గర డబ్బుంది, నా దగ్గర వ్యాపారానుభవం వుంది."

"అందువల్ల మీకు ఉపయోగమేమి జరిగింది?"

"కనబడ్డంలా!? ఇప్పుడు నాకు లక్షరూపాయలూ, ఆ లక్షాధికారికి వ్యాపారానుభవమూ మిగిలింది!"

***

ఓ లక్ షాధికారికి తన వంటవాడిమీద అసంతృప్తి కలిగి మంచి అనుభవం గల, బ్రహ్మాండమయిన వంటవాడు కావాలని, రహస్యంగా పేపర్లలో వేయించి బాక్స్ నంబర్ ఇచ్చాడు. దానికి ఒక్క అప్లికేషన్ వచ్చింది. అది వాళ్ళ వంటవాడిదే.

***



చదువూ సంధ్యాలేని ఓ అవారాకి లాటరీలో లక్ష రూపాయల బహుమతి వచ్చింది.

"ఎలా వచ్చింది లాటరీ? ప్రైజ్ నంబర్ టికెట్ ఎలా కొన్నావ్?" అడిగాడు ఒక పెద్దమనిషి.

"ఎలాగేముందీ టికెట్ చివరనంబర్లు - 24 ఉండేట్లు చూసి కొన్నాను."

"కానీ ఇరవై నాలుగుకే టికెట్ వస్తుందని ఎలా అనుకున్నావ్?"

"మూడు సార్లు నాకు ఏడు నంబరు కలిసొచ్చింది! అందుకని మూడు ఏడులూ కలిపితే ఇరవై నాలుగు వస్తుంది కదా!"

"అదేమిటి మూడు ఏడ్లు ఇరవై ఒకటి కదా?"

అవారా విసుక్కున్నాడు.

"అందుకే- మీకు చదువొచ్చింది- నాకు లాటరీ వచ్చింది"

***

తన కొడుకు ఓ అమ్మాయితో షికారుకెళ్ళడం చూసిన లక్షాధికారికి రాత్రంతా నిద్రపట్టలేదు. పొద్దున్నే కొడుకుని పిలిచాడతను.

"రాత్రి చాలా ఆలస్యంగా ఇంటికొచ్చావ్..మీ ఇద్దరికీ చాలా ఖర్చుచేసి వుంటావ్ కదూ?" అంటూ ఆతృతగా అడిగాడు.

"అబ్బే..వందరూపాయలే ఖర్చయింది.."

అన్నాడు కొడుకు.

"అదేమిటీ..అంత తక్కువలో సరిపోయిందా?" ఆశ్చర్యంగా అడిగాడు లక్షాధికారి.

"సరిపోలేదనుకో! కానీ చేయగలిగిందేముందీ? అమ్మాయి దగ్గర అంతకంటే ఎక్కువడబ్బులేదు పాపం!" జాలిగా అన్నాడు సుపుత్రుడు..

***

# చౌచౌ

"మందులో ఐస్ వాటరెందుకు కలుపుకుంటారంటావ్?"

"ఏదో వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడుగా ఉంటాయనీ.."

***

"నేను విడాకులు తీసుకుందామనుకుంటున్నాను. ఆర్నెల్ల నుంచీ నాతో మా ఆవిడ మాట్లాడడమే లేదు"

"ఎందుకైనా మంచిది . ఇంకోసారి ఆలోచించరా..అలాంటి భార్యలు దొరకటం చాలా అరుదురా..అదృష్టం రా..!"

***



తమ్ముడిని కొడుతున్న బాబీతో అమ్మ చెప్పింది " తప్పు అలా కొట్టుకోకూడదమ్మా..శత్రువుని కూడా ప్రేమించడం నేర్చుకోవాలి.."చెప్పింది తల్లి.

"నువ్వు చెప్పింది నిజమేనమ్మా..కానీ వాడు శత్రువుకాదు..తమ్ముడు కదా..!" బాబీ సమాధానం.

***

"ఏంటి అరటిపండుని తొక్క ఒలుచుకోకుండా ఉన్న పళంగా తినేస్తున్నావ్?"

"లోపల ఏముంటుందో నాకు తెలియకపోతే కదా?"

***

"బాబు గారూ..బోరింగ్ వేసుకునేందుకు లోన్ కావాలండీ.." బిక్షపతి బ్యాంకు ఆఫీసర్ వద్దకి వచ్చాడు.

"బోరింగ్ కోసమా..ఎన్ని ఎకరాల పొలం ఉందేమిటీ.."

"పొలమా పాడా..? నాలుగు గేదెలున్నాయి..పాల వ్యాపారం కాస్త పెద్ద ఎత్తున చేద్దామనీ.."

***

"రాత్రి నిద్రలో నన్ను చాలా చెత్తగా తిట్టావు.." భర్త ఆరోపించాడు.

"లేదు..మీరు పొరబడుతున్నారు.." భార్య సమాధానం.

" లేదు..నేను చెవులారా విన్నానే.."

" అహఁ మీరు వినడం పొరబాటు కాదు..అప్పుడు నేను నిద్రపోతున్నాననుకోవడం మీ పొరబాటు"

***

జంబులింగం తర్కవేదాంతం మీటింగ్ కి వెళ్ళొచ్చి భార్యతో చెప్పాడు..

" ఏమోయ్..నేనో నిజం తెలుసుకున్నాను..ఏమిటంటే మనం ఎక్కువ చదువుకున్నామనుకో ఎక్కువ తెలుసుకోవచ్చు.ఎక్కువ తెలుసుకున్నామనుకో ఎక్కువ మరిచిపోతుంటాం. ఎక్కువ మరిచిపోవడం వల్ల తక్కువ తెలుసుకున్నట్లే అవుతుంది కదా..అంచేత ఎక్కువ తెలుసుకోవడం వల్ల ఏమాత్రం ఉపయోగం లేదు.."

***

"బొమ్మ వెయ్యమంటే నా మొహం కేసి చూస్తారేమిట్రా.." టీచర్ ప్రశ్నకి

"కోతి బొమ్మ వెయ్యమన్నారు కదా.. రిఫరెన్స్ కోసం సార్.." బుడుగు జవాబు.






కామెడీ క్లబ్ కథలు — మల్లాది వెంకట కృష్ణమూర్తి

# జర్నలిస్ట్

"ఏమండీ! మా అక్కయ్య కొడుక్కి అక్షరాభ్యాసం చేస్తున్నారు. మధ్యాహ్నం ఆఫీస్ నుంచీ భోజనానికి అటే రండి.." చెప్పింది మిసెస్ సుబ్బారావు తన భర్తతో.

"మధ్యాహ్నం ముఖ్యమంత్రికి సినిమా ఇండస్ట్రీ వాళ్ళతో మీటింగ్ వుంది. దాన్ని నేనే కవర్ చెయ్యాలి" అభ్యంతరం చెప్పాడు సుబ్బారావు.

"ఎటూ మధ్యాహ్నం భోజనం చేస్తారుగా. అదేదో మా అక్కగారింటికే వచ్చి చేయండి.."

"ఎక్కడి జూబ్లీహిల్స్? ఎక్కడి రామ్‌నగర్? కుదరదే!"

"ప్లీజండి! మా అక్క మీరు అలిగారనుకుంటుంది. వాళ్ళబ్బాయి మూడో పుట్టినరోజు ఫంక్షన్‌కి కూడా మీరు రాకపోతే వాళ్ళంతా ఎంతో ఇదయ్యారు..బావుండదు"

పుట్టింటి వాళ్ళని ప్రేమించని భార్య ఆంధ్రాలో ఎలా వుండదో, అలాగే తన పుట్టింటి వాళ్ళకన్నా భార్యని ప్రేమించని భర్తా ఉండడు కదా!

"సర్లే! ఎలాగో టైమ్ ఎడ్జస్ట్ చేసుకుంటాలే" చెప్పాడు సుబ్బారావు.

పత్రికాఫీస్ లోంచి సుబ్బారావు బయటపడుతుంటే, న్యూస్ ఎడిటర్ అడిగాడు.

"ఏమయ్యా సుబ్బారావ్! ఫిల్మ్ ఇండస్ట్రీ మీటింగ్ని కవర్ చేస్తున్నావా లేదా?"

"అక్కడికే వెళుతున్నానండి" అబద్ధమాడాడు సుబ్బారావు.

ప్రెస్ అన్న అక్షరాలు అతికించిన స్కూటర్ మీద సుబ్బారావు సరాసరి రామ్‌నగర్ చేరుకున్నాడు.

అతను భార్య తరఫు బంధువులంతా సాదరంగా రిసీవ్ చేసుకున్నారతన్ని.

"భోజనం వడ్డిస్తున్నారా లేదా?" అడిగాడు సుబ్బారావు భార్యని.

"ఇంకో అరగంటేనండీ.."

ముఖ్యమంత్రి వివిధ పాలసీల గురించి బంధువులతో చర్చల్లో పడ్డాడు సుబ్బారావు. తన అసలు ప్రోగ్రామ్‌ని మర్చిపోయాడు. రాజకీయాలంటే అంత ఇది కాబట్టే సుబ్బారావు పత్రికాఫీసులో రిపోర్టర్‌గా కొనసాగుతున్నాడు.

భోజనం అయి తాంబూలం వేసుకుంటుండగానే చెప్పింది భార్య.

"వెంటనే ఐరిష్ బెగ్గర్‌లా వెళ్ళిపోకండి. బావుండదు. కాస్సేపు కూర్చుని వెళ్ళండి."

అప్పుడు కానీ సుబ్బారావుకి తన డ్యూటీ గుర్తుకి రాలేదు. టైమ్ చూసుకుని నాలుక్కరుచుకున్నాడు...మూడున్నర!

తను కవర్ చెయ్యాల్సిన ప్రోగ్రామ్ ఈ సరికి ఐపోయి ఉంటుంది..ఏం చెయ్యాలి?

ఆఁ..ఏం ఫరవాలేదు. ఈ రకం మీటింగ్స్ కొన్ని వందలు కవర్ చేసిన అనుభవంతో అక్కడ జరిగింది పత్రికా భాషలో తన ఊహా శక్తిని జోడించి విషయం లేకపోయినా ఏదో ఉందని భ్రమకలిగించేలా న్యూస్ ఐటమ్ రాసాడు.

ఐతే ఒక విషయంలో తనకి తెలీకుండానే పప్పులో కాలేసాడు సుబ్బారావు...ఎలాగంటే ఇండస్ట్రీ అంతా గౌరవించే ఒక నిర్మాత ఆకస్మిక మరణం వల్ల మీటింగ్ వాయిదా పడిందని తెలుసుకోలేకపోయాడు.. డెస్క్ ఇన్‌చార్జ్ తన అలవాటు ప్రకారం అటుమార్చి ఇటుమార్చి, సుబ్బారావు పంపిన వార్తనే, మర్నాటి పత్రికలో వేసేసాడు.

మర్నాడు ఉదయం దినపత్రికలన్నింటిలో ఆ మీటింగ్ వాయిదాపడిందన్న వార్త వస్తే మన సుబ్బారావు పనిచేసే దినపత్రికలో మొదటి పేజీలో ఏం వచ్చిందో పాఠకవర్యులకి తెలుసు. సుబ్బారావు ఆ పత్రికాఫీస్ గడప మళ్ళీ తొక్కలేదు.

ఇంకో పత్రికలో చేరాడు సుబ్బారావు.

మూడు వారాల తర్వాత ఒక సందర్భంలో అతనికి తారసపడ్డాడు పాత న్యూస్ ఎడిటర్.

"చెప్పాపెట్టకుండా ఎందుకు అలా ఉద్యోగం మానేసావు?" అడిగాడాయన ఎంతో క్యూరియస్‌గా.

"తప్పుడు వార్తలు పనిచేసే దినపత్రికలో పనిచెయ్యడం ఇష్టం లేక.." జవాబు చెప్పాడు సుబ్బారావు సీరియస్‌గా.

***

## జల్సా జోకులు — యర్రంశెట్టి శాయి

శాయిరామ్ రేడియో స్టేషన్‌లో డ్రామా రికార్డింగ్‌కి హాజరయ్యాడు. అది పూర్తయేసరికి బాగా ఆలస్యం అయిపోవడంతో టాక్సీలో ఇంటికి బయలుదేరాడు.

టాక్సీ ఇంటిముందు ఆగకుండా స్పీడ్ గా వెళ్ళిపోవడం చూసి

"ఇల్లు ఇదేనయ్యా. ఆపవేం" అంటూ అరిచాడు డ్రైవర్ తో.

"బ్రేకులు ఫెయిలయిపోయాయి సార్.." అన్నాడు డ్రైవర్.

"అయితే ముందా మీటర్ ఆపెయ్!" ఇంకా గాబరాగా అరిచాడు సాయిరామ్.

***

పెళ్ళయి నెలరోజులవుతుందేమో..ఒకరోజు భర్త ఆఫీసునుంచీ ఇంటికి రాగానే భార్య నందంగా అతనిని కౌగలించుకుంది.

"మీకో శుభవార్తండీ! ఇంకనుంచీ మనం ముగ్గురవుతాం"

"ఆc..నిజంగానా! ఎప్పుడూ..?"
"రేపేనండీ. రేపు పొద్దున్నే ఎక్స్‌ప్రెస్‌కి మా అమ్మ మనింటికి వస్తోంది.."

***

మోతుబరి రామయ్య పాలేరు అర్థరాత్రి లేచి ఓ లాంతరు తీసుకుని ఎక్కడికో బయల్దేరడం రామయ్య చూసాడు.
"ఎక్కడికెళుతున్నావ్?" చుట్టకాల్చుకుంటూ పాలేరునడిగాడతను.
"చేను దగ్గర ఓ పిల్ల కలుసుకోమందండీ!" సిగ్గు పడుతూ అన్నాడు వాడు.
"నేను చేను దగ్గరే నా ప్రియురాలిని కల్సుకున్నాను కానీ ఇలా లాంతరు ఎప్పుడూ పట్టుకెళ్ళలేదు.." అన్నాడు రామయ్య.
"అద్గదీ సంగతి! అందుకే అలాంటి మొహం దొరికింది తమరికి.." ధైర్యంగా అన్నాడు వాడు.

***

ఆఫ్రికా అడవుల్లో మనుషుల్ని తినే తెగకు చెందిన ఒకావిడ రోజు రోజుకీ దిగజారుతున్న తన భర్త ఆరోగ్య పరిస్థితి గురించి ఆందోళనపడి మంత్రాల డాక్టర్ని పిలిపించింది.
"చూడండి డాక్టర్ గారూ..ఎన్ని మందులు వాడినా ఏం ప్రయోజనం కనిపించడం లేదు. ఈయన్తో ఏం చెయ్యాలో తెలీటం లేదు" అంది గాబరాగా.
మంత్రాల డాక్టర్ ఒక్క నిమిషం ఆలోచించాడు.
"సరే..నేను వెళ్ళి వంటల పుస్తకం పంపిస్తాను!" అని అక్కడినుంచీ వెళ్ళిపోయాడు.

***

ముగ్గురు కాలేజీ కుర్రాళ్ళు రాత్రికి ఏం చేయాలో అన్న ఆలోచనలో పడ్డారు.
అందులో ఓ కుర్రాడికి బ్రహ్మాండమయిన అయిడియా వచ్చింది.
"మనం ఓ రూపాయి నాణెం ఎగరేద్దాం. బొమ్మపడితే సినిమాకెళదాం. బొరుసు పడితే కాబరే డాన్స్ కెళదాం. ఒక వేళ అది అంచుమీద నిలబడితే చదువుకుందాం.."

***

"ఇదిగో చూడండి రామ్మూర్తి గారూ! మీ తమ్ముడి వ్యవహారం నాకేమీ నచ్చలేదు."
"ఎందుకని?"
" నా మీద లేనిపోని అబద్ధాలు చెప్తున్నాడందరికీనూ"
"అబద్ధాలు చెబితే భయమెందుకండీ! నిజాలు చెప్తేనే కదా పరువు పోయేది. వాడెప్పుడైనా నిజాలు చెప్తే నాకు చెప్పండి. అప్పుడు వాడి సంగతి చూస్తాను.."

***

# చో చో

సుబ్బారావు, రామారావు కల్సి పబ్ కెళ్ళారు. అక్కడ శివరామ్ కనిపించాడు.

సుబ్బారావు " అతనే శివరామ్..నా చిన్నప్పటి ఫ్రెండ్ .." అన్నాడు రామారావుతో.

"మీ ఫ్రెండా..? ఎప్పుడూ ఇక్కడే ఉంటాడే." రామారావు సందేహం వ్యక్తపరిచాడు.

" అవును ఐదేళ్ళ క్రిందట లవ్‌లో ఫెయిలయిన వద్దనుంచీ అలా ఐపోయాడు.."

"అదేమిటీ..ఎంత ఆనందమైతే మాత్రం ఐదేళ్ళుగా సెలబ్రేట్ చేసుకోవాలా!? "

***

"చిట్టీ..అమ్మ పిలుస్తోంది. ఇప్పుడే వచ్చేస్తాను. అంతవరకూ ఈ చాక్లెట్లు నీ దగ్గర వుంచు. తినెయ్యొద్దే. నేనొచ్చే దాకా వీటిని ముట్టుకోవద్దు.." బంటీ చెప్పాడు చిట్టితో.

ఐదు నిమిషాలు..పది నిమిషాలు..బంటీ రావడం లేదు. చిట్టి ఇంక ఆగలేక పోయింది. నెమ్మదిగా ఒక చాక్లెట్ తీసింది లాగించేద్దామని.

తలుపు చాటునుంచీ గభాల్న బయటికొచ్చిన బంటీ..

"నాకు తెలుసు నేను లేకుండా చూసి నువ్విలాంటి పని చేస్తావని..అందుకే అమ్మ పిలిచినా వెళ్ళకుండా తలుపుచాటునే నుంచుని నిన్ను కాపలా కాస్తున్నా, నీకు కనిపించకుండా.."

***

"మాస్టారూ..మా బుడుగు పరీక్షలెలా వ్రాశాడు?"

"బాగా రాశాడండి..రిజల్ట్స్ తెలీగానే మీవాడు చరిత్రలో నిలిచిపోతాడు.."

"నిజంగానా మాస్టారూ.."

"అవునండీ..ఇంగ్లీషు, లెక్కల్లో కూడా నిలిచిపోయే అవకాశం ఉందండీ.."

***

"ఇదుగో..సోమలింగం. ఇప్పుడే ఇందిరాపార్కు నుంచీ వస్తున్నా. మీ అమ్మాయిని రామారావు కొడుకు ముద్దు పెట్టుకుంటున్నాడు..నీకు ఇలాంటివేమన్నా తెలుస్తున్నాయా?"

"నిజమా ఇప్పుడే చూసొస్తానుండు.."

వెళ్ళి వచ్చిన సోమలింగం, ఫిర్యాదు చేసిన మిత్రుడితో..

"నువ్వు చెప్పింది అంతా అబద్ధం..మా అమ్మాయిని ముద్దు పెట్టుకుంటోంది రామారావు కొడుకు కాదు..ఎవరో కొత్తకుర్రాడు.." రిలాక్సింగ్ గా చెప్పాడు.

***

లింగాపూర్ యాదవ్ కోపంగా బార్‌లోకి వచ్చి "ఇక్కడ యాద్గిరి ఎవరూ.." అన్నాడు.
ఎవరూ మాట్లాడలేదు.. రెండు మూడు సార్లు గద్దించే సరికి ఒకతను ముందుకొచ్చి , విసుగ్గా "నేనే ఐతే ఏమిటంట..!" అన్నాడు.
అంతే యాదవ్ అతన్ని నాలుగు తన్ని వెళ్ళిపోయాడు.
దెబ్బలు తిన్నతను నవ్వుతూ.." చూసారా వాడినెలా ఫూల్ ని చేసానో..నిజంగా నేనే యాద్గిరి ననుకున్నాడు.పూర్ ఫెలో.."

***

"ఆక్సిజన్ లేకుంటే మనిషి జీవితమే లేదు..ఇలాంటి ముఖ్యమైన వాయువుని 18 వశతాబ్దంలో కనిపెట్టారు.."
"నిజంగానా..మరైతే అంతకుముందు ప్రజలు ఎలా బతికేవారు సార్..!?"

***

"సాను భూతికీ, రసానుభూతికీ తేడా ఏమిటో చెప్పగలవా?"
"ఆపదలో ఉన్న స్త్రీని రక్షిస్తే దాన్ని సానుభూతి అంటారు. రక్షించాం గదా అని అదే పనిగా అస్తమానం ఆవిడింటికెళ్ళి చూసి రావడాన్ని రసానుభూతి అంటారు.."

***






**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## ఛీర్స్

**మిత్రులంతా** కలిసి న్యూ ఇయర్‌కి ముందు పార్టీ చేసుకుంటున్నారు. బ్యాంకులో పనిచేసే రామనాథానికి డిసెంబర్ 31న పార్టీకి బయలుదేరబోతుండగా గుర్తొచ్చింది - అంతా తలోబాటిలూ తీసుకురావాలని ముందే అనుకున్నారని.

తను ఉత్తి చేతులతో వెళితే బావుండదు. బాటిల్ కొందామంటే వైన్ షాపులన్నీ మూసేసి ఉన్నాయి. రాత్రి పదిన్నర దాటడంతో ఇయర్ ఎండింగ్ కారణంగా బ్యాంకు పని లేట్‌గా పూర్తయింది రామనాథానికి. పని ఒత్తిడిలో బాటిల్ సంగతి మర్చిపోయాడు. పోలీసులు రాత్రి గొడవకాకూడదని వైన్ షాపులన్నింటిని టైముకి దగ్గరుండి మూయించేసారు.

రామనాథానికి పక్కింటి వాళ్ళ తాళం చెవి గుర్తొచ్చింది. వాళ్ళు ఊరికి వెళుతూ తాళంచెవిని రామనాథానికి ఇచ్చి వెళ్ళారు. కరెంటు మీటర్ రీడింగ్ వాళ్ళొస్తే రీడింగ్ చూపించమని. పక్కింటాయన ప్రతిరాత్రీ రెండు పెగ్గులు తాగిగాని పడుకోడని రామనాథానికి తెలుసు.

వెంటనే ఇంటికి వెళ్ళి భార్యనడిగి పక్కింటి వాళ్ళ తాళం చెవి తీసుకున్నాడు. తలుపు తెరిచి లోపలికెళ్ళి చూస్తే అతడు ఆశించినట్లుగానే, అల్మైరాలో ఓ బాటిల్ కనిపించింది. దాన్ని తీసుకుని రాత్రి పార్టీ ఇచ్చే చోటుకి చేరుకున్నాడు రామనాథం.

మర్నాడు ఉదయం అలాంటి బాటిల్ కొని, పక్కింట్లో యథాస్థానంలో ఉంచాలనుకున్నాడు. ఖాళీ బాటిల్ను తీసుకుని తమ ఇంటివద్దవున్న వైన్ షాపుకి వెళ్ళి దాన్ని చూపించి అలాంటిది ఒకటి ఇమ్మని అడిగాడు.

"మా దగ్గర ఆ బ్రాండ్ లేదుసార్, రాష్ట్రపతి రోడ్ లోని పెద్ద షాపులో అది దొరకవచ్చు" షాపు ఎడసు చెప్పాడు వాడు.

రామనాథం ఆ షాపుకి వెళ్ళి బాటిల్ని చూపించాడు.

"వుంది సార్, ఐదు వేల రూపాయలు " చెప్పాడు షాపు యజమాని.

"ఐదు వేలే..!?"

"అవును సార్! అది స్కాచ్ విస్కీ.." అన్నాడు.

నిజానికి రామనాథం ఐదారు వందలు ఖరీదుచేసే బాటిల్ తీసుకువెళ్ళాలనుకున్నాడు. చేసేది లేక ఐదువేల రూపాయలిచ్చి అలాంటి బాటిల్ ఒకటి కొని తీసుకెళ్ళి దాన్ని పక్కింట్లో యథాస్థానంలో వుంచాడు.

పక్కింటివాళ్ళు వచ్చారు. రామనాథం పక్కింటాయనతో మాట్లాడుతూ మధ్యలో ఆయనకి లిక్కర్ మీదనున్న అభిరుచిని అభినందిస్తూ చెప్పాడు.

"ఐదు వేలు ఖరీదు చేసే బాటిల్‌ని మీరు వారంలో పూర్తి చేస్తున్నారు.."

దానికాయన నవ్వి ఇలా చెప్పాడు

"పొరబాటు..నేను తాగేది ఐదువందల రూపాయల బాటిల్ విస్కీనే!"

"అదేమిటీ? ఈ ఫారిన్ ఇంపోర్టెడ్ విస్కీ ఖరీదు ఐదు వేలు కదా!"

"అదా! ఖాళీ బాటిల్ ఓ ఫ్రెండ్ దగ్గర తెచ్చాన్లెండీ. నేను కొనే బాటిల్లోని విస్కీని షో కోసం వుంచిన ఈ బాటిల్‌లోకి వంపుకుంటాను.." చెప్పాడు పక్కింటాయన.!!

***

## డాక్టర్..డాక్టర్..!

యర్రంశెట్టి శాయి



ఓ పేషెంట్ డాక్టర్ దగ్గరకు వెళ్ళి మందు తీసుకున్నాడు మామూలు ప్రకారం.

"చూడు డాక్టర్! మనిద్దరికీ మధ్య ఎంతో కొంత స్నేహం కూడా ఉంది కాబట్టి - నీకు డబ్బివ్వడం నాకు అంతగా నచ్చడం లేదు. అందుకే నేను నా విల్లులో నీకూ భాగం ఉండేట్లు రాశాను..." అన్నాడు పేషెంట్. డాక్టర్ పేషెంట్ భుజం ఆప్యాయంగా తట్టాడు.

"నీదింత గొప్ప మనసని నాకు తెలుసు! అది సరే - నీకిచ్చిన ప్రిస్క్రిప్షన్ ఓ సారిటివ్వు..కొంచెం మార్పు చెయ్యాల్సి ఉంది.."

***

"మా మావయ్య గత సంవత్సరంగా పిచ్చి పట్టినట్లు ప్రవర్తిస్తున్నాడండీ.." సైకాలజిస్ట్ దగ్గరకొచ్చి చెప్పాడు శంకర్రావు.

"ఏం చేస్తున్నాడు?"

"పొద్దున్నుంచీ సాయంత్రం వరకూ కుర్చీలో కూర్చుని చేతుల్లో స్టీరింగ్ వున్నట్లు వూహించుకుని కారు నడుపుతున్నట్లు ప్రవర్తిస్తున్నాడండీ"

"అది కారు కాదనీ..కుర్చీ అనీ నువ్వు చెప్పలేదూ..?"

"ఎలా చెప్తానండీ! సాయంత్రం కారు కడిగినందుకు నాకు రోజుకి పాతిక రూపాయలిస్తుంటేనూ!"

"మరిప్పుడెందుకు ఇక్కడికొచ్చినట్లు..?"

"ఇప్పుడు కారు తనే కడుక్కుంటున్నాడండీ.."

***

ఆరో అంతస్తులో ఉంటున్న ఒకావిడ రెండో అంతస్తులో వుంటున్న సైకియాట్రిస్ట్ దగ్గరకొచ్చింది.

"మా ఆయన వారం రోజుల్నుంచీ తను 'లిఫ్ట్' ననుకుంటున్నాడండి!" అంది ఆందోళనగా.

"మరి నా దగ్గరకు తీసుకురాకపోయారా?" అడిగాడు డాక్టర్.

"ఉహుం..కుదరదండీ ఆయన రెండో అంతస్తు దగ్గర ఆగరు.."

***

ఇద్దరు డాక్టర్లు క్లబ్‌లో కలుసుకున్నారు.

"ఆ కోటీశ్వరుడికి నువ్వే పరేషన్ చేశావట గదా?"

"అవును! కరెక్టుగా టైముకి చేసేశాను. లేకపోతే ఆపరేషన్ అవసరం లేకుండానే కోలుకునేవాడు.."

***



**డాక్టర్:** భోజనం చేసాక ఈ మందు ఆరు చెంచాలు త్రాగండి!

**లక్ష్మమ్మ:** కానీ మా ఇంట్లో రెండు చెంచాలే ఉన్నాయండీ..

***

గవర్నమెంట్ హాస్పిటల్లో ఒక డి.ఎమ్.ఓ గారు ఓ డాక్టరు తయారు చేసిన మరణ ధృవ పత్రం చూసారు.

అందులో 'మరణమునకు కారణము' అని ఉన్నచోట డాక్టర్ సంతకం కనిపించింది. ఆయన వెంటనే సర్టిఫికెట్ డాక్టర్‌కి త్రిప్పి పంపిస్తూ ఒక నోట్ రాసారు..

"కారణం మీరే అయ్యుండవచ్చు గాని వైద్యశాస్త్రానికి సంబంధించిన చిన్న కారణం కూడా ఏదైనా రాస్తే బావుంటుంది.?!"

***

డాక్టర్: ఏవండీ..అవధాన్లుగారూ! ఈ మధ్య కనిపించడమే లేదు..

అవధాన్లు: పెద్ద జబ్బు చేసిందండీ! అందుకే రావటం కుదరలేదు..

***

చల్లపల్లి రాజా గారు ఆరోగ్య శాఖా మంత్రిగానూ. ఎమ్.ఆర్.అప్పారావు గారు ప్రోహిబిషన్ మంత్రిగానూ ఉన్న రోజులవి. అప్పారావు గారికి బాగా జలుబు చేసి ఉన్నప్పుడు ఆయనింటికి చల్లపల్లి రాజాగారు వచ్చారు.

"రండి!రండి.! అప్పారావు గారికి జలుబు చేసింది. మీ డిపార్ట్‌మెంట్‌కి రావాలని ఆలోచిస్తున్నారు.." అన్నారు యన పక్కనున్నాయన.

"కానీ మాకే జలుబు చేస్తే మేమే వారి డిపార్ట్‌మెంట్‌కి వెళుతున్నాం.." అన్నారు రాజాగారు తనకు అలవాటైన 'మందు' ని తలుచుకుంటూ..

***

టెలిగ్రఫీని కనుక్కున్న శామ్యూల్ ఎఫ్.బి. మోర్స్ అంతకుముందు పెయింటింగ్స్ వేస్తుండేవాడు.

ఓ సారి మరణశయ్యపై బాధపడుతున్న ఓ రోగిని చిత్రీకరించి తన స్నేహితుడైన ఓ డాక్టర్కి చూపించాడు.

"నీ అభిప్రాయం ఏమిటి?" అనడిగాడు ఆతృతగా.

డాక్టర్ కళ్ళజోడు పెట్టుకొని పరీక్షించి "మలేరియా" అన్నాడు తేల్చిపారేస్తూ.

# చౌ చౌ

రైలు బాగా రద్దీగా వుంది..చాలామంది ఆడవాళ్ళు సీట్లు ఖాళీలేక నిలుచుని ఉన్నారు. ఒకా లావు పాటావిడ తన పక్కన ఉన్న మగ వ్యక్తిని వంకకోపంగా చూస్తూ .."నువ్వే కనుక పెద్దమనిషి వైతే లేచి నిలబడవయ్యా..నిలుచున్న అమ్మాయిల్లో ఎవరో ఒకరు కూర్చుంటారు.." అంది.

"నీకే కనుక జాలి లాంటిదుంటే నువ్వు లేచి నిలోచమ్మా..ఏకంగా ముగ్గురు ఆడవాళ్ళు కూర్చోగలరు.." రిపార్టీఇచ్చాడా పెద్దమనిషి

***

"ఒరే బుడుగూ.. యాభై రూపాయలకి ఇరవై యాపిల్స్ వస్తే ఒక్కో యాపిల్ ఖరీదెంతో చెప్పగలవా?" మాస్టారి ప్రశ్న.

"భలే వారు మాస్టారూ..ఈ రోజుల్లో యాభైరూపాయలకి ఇరవై యాపిల్స్ ఎక్కడ వస్తాయి సార్..? ఎవడన్నా అలా ఇచ్చినా అవన్నీ ఏ కుళ్ళిపోయినవో, పుచ్చినవో ఐవుంటాయి.."

***

స్కూళ్ళ ఇన్స్పెక్టర్ ఒక స్కూల్లో పిల్లలని పరీక్షచేస్తున్నారు...

"పిల్లలూ..మీకు తోచిన నంబరు ఒకటి చెప్పండి.." అన్నాడాయన.

"95.." చెప్పాడో కుర్రాడు..

ఇన్స్పెక్టర్ గారు బోర్డు మీద 59 అని రాసారు..

"ఇంకో నెంబరు చెప్పండి.."

"84 అరిచాడింకో కుర్రాడు.

ఈ సారి 48 అని బోర్డు మీద రాసాడాయన.



పిల్లలకి ఆయన ఏమి చెయ్యబోతున్నారో తెలీలేదు.

"ఇంకో నంబరేమైనా చెబుతారా?" మరో సారి అడిగాడాయన.

"66" చివరి బెంచీలోంచి అరిచాడొకతను.. "ఇప్పుడు చూద్దామా..దీన్ని ఎలా తిరగేసి రాస్తాడో.." పక్కనున్న మిత్రుడితో నెమ్మదిగా

అన్నాడు.

***

స్పర్శేంద్రియాల గురించి పిల్లలకు పాఠం చెబుతోంది టీచర్. వాళ్ళనుంచీ సమాధానాలు రాబట్టుకోడానికి ప్రశ్నలు అడగసాగారు ఆవిడ.

"మనకి కళ్ళు ఎందుకున్నాయి..?"

"చూడడానికి.."

"మరి ముక్కు దేనికి..?"

"వాసన చూడడానికి.."

"మరి చెవులు?"

"రింగులు పెట్టుకోడానికి.."

***

చలికాలంలో పక్షులన్నీ ఉత్తర దిక్కుగా వలసపోతున్నాయి. "పెద్ద పక్షి వెనకాలే ఎగురుతూ ఎప్పుడూ దానినే అనుసరించాలా మనం?" అడిగింది ఓ పిల్ల పక్షి.


"తప్పదు మరి గూగుల్ మాప్స్ ప్రింట్ దాని దగ్గరే ఉంది.." పక్కనున్న పక్షి అసలు రహస్యం చెప్పింది.

***

హైదరాబాదు జూలో కొత్తగా ఒక గుర్రాన్ని తెచ్చి ఉంచారు. ఎవరైనా గుర్రానికి చిరుతిళ్ళు పెడతారేమోనని అధికారులు ఒక బోర్డు పెట్టారు.."దయచేసి ఈ గుర్రానికి చిరుతిళ్ళు పెట్టవద్దు.. ఇట్లు - జూ యాజమాన్యం" అని.

మర్నాడు చూస్తే దానికింద మరో బోర్డు ఉంది.. "పై నున్న నోటీసుని ఎవరూ పట్టించుకోనవసరం లేదు..ఇట్లు - గుర్రము "

***



"అదేంటో డాక్టర్ గారూ..నేను గత నెల రోజులుగా స్నానం చేయడం లేదు. ఐనా నా ఒంటి నుంచీ అసలు చెడు వాసనే రావట్లేదు.." ఆశ్చర్యంగా అన్నాడు జంబులింగం.

"మూడు రోజులుపాటు ఈ మందు బిళ్ళలు వాడి మళ్ళీ రండి.." అన్నాడు డాక్టర్.

అలానే బిళ్ళల వాడకం అయ్యాక వచ్చాడు జంబులింగం..

"డాక్టర్..మీరిచ్చినవి ఏం మందులో ఏమో, అవి వాడ్డం మొదలెట్టాక నా ఒళ్ళు నాకే భరించలేనంత దుర్వాసన వస్తోంది.." అని ఫిర్యాదు చేసాడు.

"అయితే మీ ముక్కు పనిచేస్తోందన్న మాట.." నెమ్మదిగా అన్నాడు డాక్టర్.

***

"చదవగానే నెత్తిమీద వెంట్రుకలు నిక్క బొడుచుకునే అద్భుతమైన సస్పెన్స్ నవల ఉంది నా దగ్గర" అన్నాడు విశ్వేశ్వర్.
"లాభం లేదు సార్, మా ఎడిటర్ గారిది బట్టతల.." చెప్పాడు సబ్-ఎడిటర్,

***




నవ్వుల గీతలకి నజరానా

ఆత్మీయ మిత్రుడికి అరుదైన పురస్కారం

చిత్రకారుడు నర్సిమ్ కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బహుమతి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని కళారంగాలలోని కళాకారులకీ వార్షిక బహుమతులు ప్రకటిస్తుంటుంది. అలానే పాత్రికేయులకి కూడా (జర్నలిస్ట్) కూడ బహుమతులిచ్చే సాంప్రదాయం లోగడ ఉండేది. ఐతే గత ఐదేళ్ళుగా అది వెలుగుకి నోచుకోలేదు. ప్రస్తుత ప్రెస్ ఎకాడెమీ ఛైర్మన్ దేవులపల్లి అమర్ గారి ధ్వర్యంలోని కమిటీ ఇటీవలే ఈ అవార్డుల విజేతలని ప్రకటించింది. 2004 నుంచీ 2007 వరకూ జర్నలిజం లోని వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ఈ అవార్డులని ప్రకటించారు. ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాదులో జరిగే ఒక ఉత్సవంలో ఈ బహుమతుల్ని ప్రదానం చేస్తారు. ఇందులో 2005 వ సంవత్సరానికి గాను ఉత్తమ కార్టూనిస్ట్ గా ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ నర్సిమ్ ఎంపికయ్యారు. ఆయనకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రసంశాపత్రమూ,లక్ష రూపాయల నగదూ బహుమతిగా ఇస్తారు.

నర్సిమ్ గురించి ఈ హాస్యవల్లరిలో ప్రస్తావించడానికి ఆయన వేసిన కార్టూన్‌కి లభించిన ఎవార్డు ఒక కారణమైతే, ఆయన 'కౌముది' కి ఆత్మీయ మిత్రులవడం మరొక కారణం..ఎలాగంటే..

24 సంవత్సరాలు వెనక్కి వెళితే..


***


బషీర్ బాగ్ మెయిన్ రోడ్ లో ఆంధ్రపత్రిక ఆఫీసు ఉండేది. సరిగ్గా దానికి ఎదురుగుండా చిన్న వీధి. వీధిలోకి అడుగు పెట్టగానే కుడి వైపు రెండోదో, మూడోదో రెండస్తుల మేడ. పై అంతస్తులో ఒక పత్రిక ఆఫీసు ఉండేది. ఆ పత్రిక పేరు 'వారం వారం'. ఈ వీక్లీ మేగజైన్ జనవరి 1985లో మొదలైంది. మొదటి ఒకటి రెండు సంచికలకి చెన్నూరి నాగరాజు సంపాదకుడిగా వున్నారు. తరువాత పత్రిక స్థాపకులు జి.రామ్మూర్తి గారే సంపాదకులుగా వున్నారు. ఆ పత్రిక మూడో సంచిక విడుదలయ్యే సమయానికి అనుకుంటాను, ఓ ఆదివారం అక్కడికి వెళ్ళాను. రామ్మూర్తి గారు మాట్లాడారు. వయసులో ఆయన కంటే చాలా చిన్నవాడినే ఐనా మొదటి పరిచయంలోనే స్నేహం కలిసింది. అప్పటికే 'పల్లకి' లో వస్తున్న నా ఫోటో కవితలు చూసిన ఆయన, సామాజిక స్పృహ ఉండే ఫోటోలకి కవితలు వ్రాసిస్తే వేస్తానని అన్నారు. మరుసటి వారమే అలాంటి ఫోటో కవితలతో వెళ్ళగానే లే ఔట్ ఆర్టిస్ట్‌ని పిలిచి డిజైన్ చెయ్యమని చెప్పారు. ఆ ఆర్టిస్ట్ అప్పుడే డిగ్రీ పూర్తి చేసి వచ్చిన కుర్రవాడు, పత్రికాఫీసులోనే ఒక రూములో ఉంటూ పనిచేస్తున్నాడని చెప్పారు. నాకంటే ఐదారేళ్ళు చిన్నవాడు. పక్కనే నివాసం అవడంవల్ల లుంగీలోనే ఉన్నాడింకా అప్పటికి. తన వద్దకి వెళ్ళి కూర్చున్నాను. మాటల్లో తెలిసింది అతను కేవలం ఆర్టిస్ట్ మాత్రమే కాదనీ తెలుగు కథలూ, కవితలూ,నవలలూ బాగా చదివిన సాహిత్యాభిమాని అని. ఆ రోజునుంచే మంచి మిత్రుడయ్యాడు. అతనే నర్సిమ్ అని వేరుగా చెప్పనవసరం లేదనుకుంటాను. తను పత్రికలో పనిచేసిన రెండు సంవత్సరాలూ దాదాపు ప్రతి ఆదివారం అక్కడే కలుస్తూ ఉండే వాళ్ళం. సమకాలీన సాహిత్యం గురించీ, పత్రికల గురించీ ఎక్కువగా చర్చించుకుంటూ ఉండేవాళ్ళం. ప్రముఖ రచయిత కె.ఎన్.వై. పతంజలి కూడా అక్కడికి వస్తుండే వారు ఆ రోజుల్లో. ఆ తరువాత 1996 లో అమెరికన్ వీసా కోసం మద్రాసు వెళ్ళినప్పుడు టి.నగర్‌లో నేను ఉన్న హోటల్‌కి వచ్చి కలిసారు నర్సిమ్. అప్పటికే తను ఇండియా టు డే లో చేరి చిత్రకారుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. అప్పటినుంచీ మళ్ళీ కలుసుకునే అవకాశం రాకపోయినా ఇ-మెయిల్ ద్వారా రెగ్యులర్‌గా కబుర్లు తెలియచేస్తూనే ఉన్నారు. 2003 తానా ప్రత్యేక సంచికకి నేను సంపాదకత్వం వహించినప్పుడు చక్కటి ముఖచిత్రం ఇచ్చారు నర్సిమ్. నిగర్వి, సహృదయుడు, మంచి మిత్రుడు, సాహిత్యాభిలాషి, సమాజ సంక్షేమం గురించి నిరంతరం ఆలోచించే వ్యక్తిత్వమూ, కళకి సామాజిక ప్రయోజనం ఉండాలని నమ్మి ఆచరణలో చూపించే కళాకారుడు..నర్సిమ్ కి ఈ రోజు ఆంధ్రప్రదేశ్ పురస్కారం లభించడం ఆనందదాయకం. మిత్రుడు కుంచె నుంచీ మరిన్ని భావస్ఫోరకమైన చిత్రాలు రావాలని 'కౌముది' ఆశిస్తోంది.

***

డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడే 'ఈనాడు' లో ఆర్నెల్ల పాటు ఆర్టిస్ట్ గా పనిచేసారు నర్సిమ్. తరువాత 'వారం వారం', 'ఉదయం', 'ఆంధ్రజ్యోతి' , 'సుప్రభాతం' పత్రికల్లో పనిచేసి 1992 లో మద్రాసులోని ఇండియా టుడే లో చేరారు. గత 17 సంవత్సరాలుగా 'ఇండియా టు డే' లోనే కొనసాగుతున్న నర్సిమ్, ఆ పత్రిక తెలుగు, తమిళం, మళయాళం, హిందీ ఎడిషన్లన్నింటిలోనూ ఇలస్ట్రేషన్స్, కార్టూన్స్ వేస్తున్నారు. ఆయన వేసిన కార్టూన్ల , చిత్రాల ప్రదర్శనలు అనేక చోట్ల నిర్వహించారు. కార్టూన్లకీ, వర్ణచిత్రాలకీ జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ అనేక బహుమతులూ, గుర్తింపులూ పొందిన నర్సిమ్ తెలుగు వారు గర్వించదగ్గ ఒక మంచి చిత్రకారుడు.

– కిరణ్‌ప్రభ



కామెడీ క్లబ్ కథలు మల్లాది వెంకట కృష్ణమూర్తి

## యుగాంతం

ఒక రోజు కుచేలుడి దగ్గరికి లంకె బిందెలతో వచ్చి న్యాయం చెప్పమని కోరారు, ఇద్దరు మిత్రులు.

"అయ్యా , నా మిత్రుడైన ఇతని నుండి ఎకరం పొలం కొన్నాను. పొలంలో చిన్న ఇల్లు కట్టుకుందామని పునాదులు తీస్తుంటే, అందులో ఈ లంకె బిందెలు దొరికాయి. వజ్రాలు, బంగారు నగలు ఇందులో ఉన్నాయి. ఇవి నా మిత్రుడి పూర్వీకులు పాతి ఉంటారు. కాబట్టి ఈ బిందెని తిరిగి నా మిత్రుడుకి ఇస్తే తీసుకోనంటున్నాడు.."

"ఇతను చెప్పింది నిజమేనా?"

ప్రశ్నించాడు కుచేలుడు రెండవ వ్యక్తిని.

"పూర్తిగా నిజం ప్రభూ! నేను పొలాన్ని అమ్మాక, దానికి యజమాని నా మిత్రుడు అయ్యాడు. ఆ బిందెలు యజమానికి చెందడం ధర్మం కాబట్టి తీసుకోనన్నాను" చెప్పాడు రెండో వ్యక్తి.

"వీడు నాకు పొలం అమ్మాడు తప్ప, అందులో ఇతని పూర్వీకులు దాచిన లంకెబిందెలు అమ్మలేదు ప్రభూ! అలాంటప్పుడు అవి నాకు చెందడం ధర్మం కాదు. పొలాన్ని వుంచుకుని లంకెబిందెలు యిస్తానంటే తీసుకోవడంలేదు..." చెప్పాడు మొదటివాడు.

"పొలం మాత్రం అమ్మానని రేపు పొలంలో పండిన ధాన్యం ఇతను నాకిస్తే తీసుకోవడం ఎంత అధర్మమో, పొలంలో దొరికిన లంకె బిందెలు తీసుకోవడమూ అంతే అధర్మమని నా విశ్వాసం ప్రభూ!"

ఇద్దరి వాదనలూ విన్నాక కుచేలుడు ఆ లంకె బిందెలని తన దగ్గర వుంచుకుని మర్నాడు తీర్పు చెప్తానని వాళ్ళిద్దరినీ పంపించేసాడు.

ఇదిలా ఉండగా - మరొక చోట - పై సంఘటన జరిగిన కొద్ది సేపటికే, శ్రీకృష్ణుడు ఒక అడవిలో కూర్చొని వేణువు వాయించుకుంటూ బొటనవేలు కదుపుతుంటే దాన్ని చూసిన ఒక వేటగాడు అది లేడిగా భావించి బాణం వేసాడు. అది గుచ్చుకున్న కృష్ణుడు ప్రాణాలు విడిచాడు.

దీన్నిలా వుంచేసి మళ్ళీ మనకథలోకి వద్దాం.

మరునాడు మిత్రులిద్దరూ కుచేలుడి దగ్గరికి వెళ్ళారు.

మొదటి వ్యక్తి చెప్పాడు-

"ప్రభూ! నేను ఇంటికి వెళ్ళాక ఆలోచించుకున్నాను. నాదే పొరబాటు. పొలాన్ని నా మిత్రుడు నాకు అమ్మాడు. అంటే అందులోని నిధి నిక్షేపాలతో సహా అమ్మినట్లే. కాబట్టి ఆ లంకె బిందెలు నేను తీసుకోడానికి సమ్మతిస్తున్నాను.."

అందుకు రెండో వాడు అభ్యంతరం చెప్పాడు.

"నేను ఇంటికి వెళ్ళాక ఆలోచించుకున్నాను ప్రభూ! నేను నా మిత్రుడికి కేవలం భూమి మాత్రమే అమ్మాను. మా పూర్వీకులు కష్టపడి సంపాదించి భూమిలో నా కోసం దాచిన ఆ లంకె బిందెలని అమ్మలేదు కాబట్టి అది నాకే చెందాలి.."

అంతదాకా మౌనంగా ఉన్న కుచేలుడు.

"ఆగండాగండి..మీ ఇద్దరూ ఎవరు? లంకెబిందెలేమిటి? పొలం ఏమిటి?" అని అడిగాడు.

ఇద్దరూ నివ్వెరపోయారు.

"అదేమిటి ప్రభూ! నిన్ననేగా మేము మీ దగ్గరికి లంకె బిందెలతో వచ్చింది.. ఇవాళ తీర్పు చెప్తానని, లంకె బిందెలు మీ దగ్గర వుంచమని చెప్పారుగా?"

"నేను మిమ్మల్ని చూడడం ఇదే మొదటి సారి వెళ్ళండెళ్ళండి.." కసిరాడు కుచేలుడు.

ఆకాశమార్గాన విహారం చేస్తున్న నారదుడ్ని అడిగాడు విష్ణుమూర్తి ఈ వింతచూసి "నారదా! ఇదెంత విచిత్రంగా వుంది. నిన్న నిస్వార్ధంగా మాట్లాడిన మిత్రులిద్దరూ ఇవాళ స్వార్ధంవైపు ఎందుకు మొగ్గు చూపుతున్నారు? కుచేలుడు కూడా ఆ లంకెబిందెలు కొట్టేయాలని ఎందుకిలా వాళ్ళెవరో ఎరగనట్లు నాటకం ఆడుతున్నాడు?"

చిరునవ్వు నవ్వి చెప్పాడు నారదుడు -

"నిన్న వాళ్ళు కుచేలుడి దగ్గరికి వచ్చినప్పుడు శ్రీకృష్ణుడు బతికే వున్నాడు. అది ద్వాపర యుగం. కాబట్టి న్యాయం రాజ్యమేలింది. కృష్ణావతారం ముగియగానే కలియుగం ప్రభావం ముగ్గురిమీదా పడి ఎవరికి వాళ్ళు స్వార్ధపూరితంగా ఆలోచిస్తున్నారు"

"చక్కటి విషయాలు సెలవిచ్చారు కదా నారదా! అదేమిటీ? నీ మహతి తీగ తెగినట్లుంది." అడిగాడు విష్ణుమూర్తి.

"అవును ప్రభూ! యుగం మారగానే నా మహతి తీగ తెగింది. మీరే బిగించి పెట్టండి.."

***

## కుర్ర కలాపాలు

యర్రంశెట్టి శాయి

భూమి బరువు గురించి పాఠం చెప్పాక ఓ ఎనిమిదేళ్ళ కుర్రాడు లేచి "సార్! భూమి ఎంత బరువు వుంటుంది?" అనడిగాడు అమాయకంగా.



టీచర్ జవాబు తెలీక ఉక్కిరిబిక్కిరి అవుతుండగా బెల్ మోగింది.

"రేపు చెప్తాలే" అని బ్రతుకుజీవుడా అంటూ బయటపడి ఆ రాత్రి లైబ్రరీలోని పుస్తకాలన్నీ తిరగేసి తెల్లార్లూ నిద్రలేకుండా వెతికి సమాధానం తెలుసుకుని మర్నాడు గర్వంగా క్లాసుకొచ్చాడు.

ఆ కుర్రాడిని నిలబెట్టి భూమి బరువెంతో చెప్పాడతనికి.

"ఆ బరువు మనుషుల బరువు కలుపుకునా, లేకుండానా?" మళ్ళీ అడిగాడా కుర్రాడు.

***

హైదరాబాదుకి కొత్తగా బదిలీలో వచ్చాక ఓ రోజు తన ఇరుగుపొరుగు వాళ్ళతో మోర్నింగ్ షో సినిమాకెళ్ళి తిరిగివచ్చింది రాధారాణి.

ఉర్దూ తప్ప మరోభాష తెలీని కొత్త పనిమనిషిని పిలిచి "పిల్లలందరికీ స్నానాలు చేయించావా?" అనడిగింది, తను చిన్నప్పుడు నేర్చుకున్న వచ్చీరాని హిందీలో.

"అందరికీ చేయించానమ్మా! కానీ ఆ కళ్ళజోడున్న పెద్దపిల్లాడు మాత్రం నీళ్ళు పోసుకోడానికి నానా రభసా చేశాడు. చివరకు నాలుగు తగిలిస్తేగానీ నా మాట వినలేదు."అ ంది పని మనిషి

రాధారాణి అదిరిపోయింది.."కళ్ళజోడు పెట్టుకున్నది - మా ఆయనే పిచ్చి ముఖమా!"

***

నాలుగేళ్ళ చిన్నిగాడిని మొదటి రోజు స్కూలుకి పంపించింది వాళ్ళమ్మ. వాడు స్కూలు అయిపోయాక బయటికొస్తూనే ఎత్తుకుని ముద్దాడి "స్కూలు ఎలా వుందిరా చిన్నీ.."అనడిగిందామె.

"బాగుంది మమ్మీ! కానీ మా క్లాసులో ఒకామె కూర్చుని ఒకటే మాట్లాడుతోంది. స్కూలు అయేంత వరకూ ఆపలేదు " అన్నాడు వాడు ఆశ్చర్యంగా.

***



ప్రతి విద్యార్థీ ఇరవై స్కూలు మాగజైన్లు అమ్మి డబ్బు స్కూలుకి కట్టాలని నిబంధన పెట్టారు. అయిదో తరగతి చదువుతున్న చంటిగాడు ఇరవై పుస్తకాలూ వాళ్ళ కాలనీలో అమ్మడానికి బయల్దేరి అరగంటలో అన్నీ అమ్మేసి తిరిగి వచ్చాడు.

"అప్పుడే ఇరవై మంది కొనేశారా?" ఆశ్చర్యంగా అడిగాడు వాళ్ళ నాన్న.


"పుస్తకాలన్నీ ఒక్కాయనకే అమ్మాను నాన్నా! వాళ్ళ కుక్క నన్ను కరిచిందిగా మరి!"

***

బాయ్స్ స్కాట్స్ లో ఉన్న బాలాజీరావ్ పొద్దున్నే ఆనందంగా తల్లి దగ్గర కొచ్చాడు.

"ఇంతకుముందే ఓ మంచి పని చేసాను మమ్మీ! మన పక్కింటాయన రోజూ ఏడున్నర లోకల్ ట్రైనుకి డ్యూటీకి వెళ్ళాలి కదా! ఇవాళ పాపం ఇంటిదగ్గర బయలు దేరేసరికి ఏడున్నర అయిపోయింది. రైలు దొరుకుతుందో దొరకదో అని మన కుక్కని ఆయన మీదికి ఉసిగొలిపాను. దాంతో రైలు దొరికింది ఆయనకు."

***



తండ్రి కొండశిఖరం చివ్వరికెళ్ళి కిందకు చూస్తుంటే శీనుగాడికి భయం వేసింది.

"నాన్నా! అలా చివ్వరికెళ్ళి చూడకూడదని చెప్పింది అమ్మ! మీరు వెనక్కేనా వచ్చేయండి..లేదా మీచేతిలోని బిస్కెట్ పాకెట్ నాకిచ్చేయండి.." అన్నాడు భయంతో..

***

సరితను కె.జి.లో చేర్పించారు తల్లిదండ్రులు. మొదటి రోజు స్కూలుకెళ్ళి రాగానే-

"ఏం నేర్పించారమ్మా స్కూల్లో?" అనడగింది వాళ్ళమ్మ ఆప్యాయంగా.

"ఎక్కువేం చెప్పలేదు. మళ్ళీ రేపుకూడా స్కూలుకెళ్ళాల్సిందే " ***

టీ తాగడానికి కాకా హోటల్ కి ముగ్గురు బేవార్సు మిత్రులొచ్చారు

''నాకో కప్పు టీ కావాలి..స్ట్రాంగ్ గా..''

''అలానే సార్..''

''నాక్కూడా టీ కావాలి..వేడిగా..''

''అలాగే సార్.. మరి మీకు?'' మూడో అతన్ని అడిగాడు సర్వర్.

''నాక్కూడా టీయే ..అరువుగా..''

***

''సర్వర్ ఈ సాంబార్లో పడింది ఏమై ఉంటుందంటావ్?''

''ఖచ్చితంగా చెప్పలేను సార్.. ఈ మధ్యనే కొత్తగా చేరాను. ఒకదానికొకటి చెబితే బాగుండదు కదా..''

***



భోజనం చేద్దామని హోటల్ కి వెళ్ళాడు జంబులింగం.

కూర్చుని గంట కావొస్తున్నా తనని ఎవరూ పట్టించుకోక పోవడంతో విసుగుచెంది

''ఈరోజంతా నేను ఇలా కూర్చుని వుండాల్సిందేనా?'' అన్నాడు అసహనంగా.

''అక్కర్లేదు సార్..రాత్రి తొమ్మిదింటికి హోటల్ మూసేస్తాం..'' అమాయకంగా బదిలిచ్చాడా గడుసు సర్వర్.

***

''నువ్వు తెచ్చే బోడి అరకోడి మాంసం కోసం ఎంతసేపు కూర్చోవాలయ్యా''

''ఎవరైనా వచ్చి మరో అరకోడికి ఆర్డర్ యిచ్చేవరకూ కూర్చోవాల్సిందే మీ ఒక్కళ్ళకోసం కోడిని సగమెలా చంపుతాం చెప్పండి..''

***

''రసంలో చచ్చిన ఈగ వుందేంటయ్యా..'' జంబులింగం గట్టిగా అరిచాడు.

''ఎందుకంత కంగారు సార్.. చాలా రోజుల తర్వాత ఇవాళ రసం వెచ్చబెట్టాం. పాపం ఈగ చనిపోయి ఎంతో సేపు ఐఉండదు. తీసేస్తానుండండి..''

***

''ఏంటయ్యా సర్వరూ..సాంబారులో చిల్లర నాణేలు వస్తున్నాయ్..''

''మీరే కదసార్..కిందటి వారం వచ్చినప్పుడు సాంబారులో ''ఛేంజ్'' ఉంటేగానీ మజా ఉండదని అన్నారు..!?''

***

''అవును జంబులింగం..ఏమిటీ రాత్రి మీకూ మీ ఆవిడకీ బాగా గొడవజరిగినట్లుంది.. చివరికేమయిందేమిటీ..''

**కౌముది**



"ఏమయ్యేదేముందీ.. చివరికి ఆవిడే మోకాళ్ళ మీద పాక్కుంటూ నా దగ్గరకి వచ్చింది.."

"ఓ..చివరికి నువ్వే గెలిచావన్నమాట...ఐతే అలా పాక్కుంటూ వచ్చి ఏమందేమిటి..?"

"ఏమంటుందీ.. మంచం కిందనుంచీ బయటకి రారా పిరికి పందా.. అంది..!"

***

"ఎక్స్యూజ్ మీ. మా ఆయన సమాధి ఎక్కడుందో కనిపించట్లేదు. కానీ ఖచ్చితంగా ఇక్కడే ఉండాలి.." అడిగింది భామాశేఖర్.

"మీ ఆయన పేరేమిటి.." అడిగాడు స్మశానం మేనేజర్.

"రాజశేఖర్ అండీ.."

"ఈ లిస్టులో రాజశేఖర్ అని ఎవరూ లేరు ..కానీ భామాశేఖర్ అని ఉంది.."

"ఐతే అది ఆయనదే.ఆయన వన్నీ నా పేరు మీదే ఉంటాయిలెండీ.." ***




**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## తనకు తెలిసిన విద్య

నేర పరిశోధనలో ప్రపంచంలోని ఏ పోలీసు సంస్థ గొప్పదో నిర్ణయించాలనుకుంది. అంతర్జాతీయ ఐక్యతా సమితి. అందుకు నిపుణులు ఓ పోటీని రూపొందించారు. అమెరికాలోని ఎఫ్.బి.ఐ, బ్రిటన్‌కు చెందిన స్కాట్లాండ్ యార్డ్ పోటీలో పాల్గొన్నాయి.

భారతదేశానికి చెందిన పోలీసు శాఖకి కూడా అందులో పాల్గొనమని ఆహ్వానం అందింది. భారతదేశ హోం మంత్రిత్వశాఖలో పనిచేసే కార్యదర్శి అనేక మంది సర్కిల్ ఇన్స్పెక్టర్ల పర్సనల్ ఫైల్స్‌ని పరిశీలించి చివరికి కరీంనగర్ జిల్లాలోని ఓ పల్లెటూళ్ళో పనిచేసే సి.ఐ. గిరిధర్ రావుని అతని కానిస్టేబుళ్ళని అందుకు ఎంపిక చేశాడు. టీమ్ ఎయిర్ ఇండియా విమానం ఎక్కి పోటీ జరుగుతున్న జెనీవా నగరానికి చేరుకుంది.

ఆ రోజు ఎఫ్.బి.ఐ, స్కాట్ లాండ్ యార్డ్, భారత పోలీసులకి పోటీ. ఓ తెల్లటి కుందేలుని మూడు దేశాలకి చెందిన సంస్థల నించి వచ్చిన వారికి పరిశీలనకై ఇచ్చాక, ఆ కుందేలుని ఓ పదెకరాల అడవిలోకి వదిలి ఎవరు ముందుగా కుందేలుని తెస్తే వాళ్ళు గెలిచినట్లు అని చెప్పారు.

ఎఫ్.బి.ఐ కి చెందిన వారు తమకి కనబడ్డ కుందేళ్ళని పట్టుకుని వాటి బాడీ కొలతలు, బ్లడ్ గ్రూప్ టెస్ట్‌లు, డి.ఎన్.ఎ టెస్ట్‌లు చేస్తూ, అడవిలోకి వదిలిన కుందేలు కోసం వెదకసాగారు.

స్కాట్లాండ్ యార్డ్‌కి చెందిన వాళ్ళు నేలమీద కుందేలు అడుగు జాడలని భూతద్దంలోంచి పరిశీలిస్తూ, దాన్ని వెదుకుతూ వెళ్ళసాగారు.

భారతదేశానికి చెందిన గిరిధరరావు తన కానిస్టేబుల్స్‌తో అడవి లోనికి వెళ్ళి తమకి కనబడ్డ జంతువుని పట్టుకుని, కుందేలు జాడ చెప్పమని థర్డ్ డిగ్రీ ప్రయోగించసాగారు.

అలా అడవిలోకి ప్రవేశించిన పావుగంటలో గిరిధర్ రావు అతని కానిస్టేబుల్స్ సంకెళ్ళు వేసిన ఓ దుప్పిని తెచ్చారు.

"ఇదిగో సాధించాం" చెప్పాడు గిరిధర రావు.

"ఇదేమిటీ? మేం వదిలింది తెల్ల కుందేలుని కదా?" ఆశ్చర్యంగా అడిగారు పోటీ నిర్వాహకులు.

"ఇదేం చెప్తుందో వినండి.." అని గిరిధర రావు సైగ చేయగానే దుప్పిని లాఠీతో ఇవ్వరానిచోట ఒటిచ్చుకున్నాడు కానిస్టేబుల్.

"నేనే తెల్ల కుందేలుని..నేనే తెల్ల కుందేలుని" బాధగా అరచి వప్పుకుంది దుప్పి వెంటనే.

"అందుకు వీళ్ళు సాక్షులు.." చెప్పాడు గిరిధర తమతో తెచ్చిన ఇతర జంతువులని చూపిస్తూ.

***

## కుర్ర కలాపాలు

**యర్రంశెట్టి శాయి**

కండక్టర్ బస్‌లో టిక్కెట్లు ఇస్తూ ఓ చిన్న కుర్రాడి దగ్గర కొచ్చే సరికి కుర్రాడు జేబులో చేయి పెట్టి కంగారుగా అన్ని జేబులూ వెతికి కాళ్ళ దగ్గరకూడా చూడసాగాడు.

"ఏమయింది బాబూ?" అడిగాడు కండక్టర్ ప్యాయంగా.

"నా రూపాయి పోయింది" దిగులుగా అన్నాడు కుర్రాడు. కండక్టర్ జాలిపడి కుర్రాడికి ఉచితంగా టికెట్ ఇచ్చాడు. కుర్రాడు టికెట్ తీసుకుని కన్నీళ్ళు తుడుచుకుంటూ

"మరి మిగతా చిల్లర ఇవ్వవేం?" అన్నాడు.

***

పిల్లల అల్లరితో చిరాకేసుకొచ్చింది సావిత్రమ్మకి.

"ఇదిగో ఇలాగే అల్లరి చేసేట్లయితే రేపు మీరు ఆడుకోడానికి కీ ట్రైన్ బొమ్మను ఇవ్వను" అందికోపంగా.

"ఇవ్వకపోయినా ఫరవాలేదు. రేపు మేము 'రైల్వే సమ్మె' ఆడుతున్నాం" తొణక్కుండా అన్నారు వాళ్ళు.

***


"మీలో యుద్ధాలంటే ఎవరికి అయిష్టం?" క్లాసులోని పిల్లల నుద్దేశించి అడిగాడు హిస్టరీ మాస్టరు.

అందరూ చేతులెత్తారు.

"సరే! యుద్ధాలంటే మీకెందుకింత అయిష్టం!" ఓ కుర్రాడి నడిగాడతను.
"వెధవ యుద్ధాలు జరిగిన దగ్గర్నుంచీ మేము చరిత్రలో వాటి గురించి చదవలేక చావాలి కదండీ!" దిగులుగా అన్నాడు కుర్రాడు.

***

నాని గాడు పార్కుకెళ్ళి పొద్దు గూకక ముందే ఇంటికి తిరిగి వచ్చేసాడు.
"మమ్మీ! పార్కులో మా టీచర్ కనిపించింది." వాళ్ళమ్మతో అన్నాడు. వాడు.
"ఏం మాట్లాడావ్?" నవ్వుతూ అడిగిందామె.
"నేనెందుకు మాట్లాడుతాను? ఇవాళ ఆదివారం కదా!?"



***

మొదటిరోజు కె.జి.క్లాసు కొచ్చిన ఓ పిల్ల గౌనుకి ఓ కాగితం తగిలించి ఉంది. టీచర్ ఆ పిల్లను దగ్గరకు పిలిచి కాగితం మీద రాసి ఉన్న అక్షరాలను చదివింది.
" ఈ పిల్ల వ్యక్తపరిచే ఆలోచనలు, అభిప్రాయాలు, మా కుటుంబ సభ్యుల అభిప్రాయాలతో ఏకీభవించి ఉండనవసరం లేదు. చాలా వాటికి మేము ఎలాంటి బాధ్యతా వహించబోము.."

***

క్లాసులో ఓ కుర్రాడు భయంగా లేచి నిలబడ్డాడు.
"టీచర్! నేను చేయని తప్పుకి నన్ను శిక్షించడం మంచిదేనా?"
"మంచిది కాదు.."
"అయితే మరి నేను ఇవాళ హోమ్ వర్క్ చేసుకురాలేదండీ.."

***

ఎక్జిబిషన్ లాటరీలో ఓ పెద్ద మనిషికి ఓ బొమ్మ వచ్చింది. అతని పిల్లలు నలుగురు బొమ్మకోసం అతని చుట్టూ మూగే సరికి అతనో ఉపాయం ఆలోచించాడు.
"ఈ బొమ్మ ఎవరిక్కావాలో వాళ్ళు అమ్మ చెప్పినట్లు వినాలి. ఎదురు మాట్లాడకూడదు. అమ్మ చెప్పిన పనల్లా చేయాలి. అమ్మ తిట్టినా నోరు మెదపకూడదు"
నలుగురు పిల్లలూ ఒకేసారి అన్నారు.
"అయితే నువ్వే తీసుకో నాన్నా!"

***

# చౌ చౌ



"డుంబూ.. నీ మేజోళ్ళు భలే విచిత్రంగా వున్నాయే. ఒకటి నలుపు ఒకటి తెలుపు.."

"అవును టీచర్..ఇలాంటిదే మరో జత కూడ ఉంది నాకు.."

***

" రోజు అలా ఎందుకేడ్చానో తెలీదు గానీ తల్చుకుంటే ఇప్పటికీ భలే సిగ్గేస్తూ ఉంటుంది.." సీగాన పెసూనాంబ చెప్పింది.

"ఎప్పుడూ.." బుడుగు అడిగాడు..

"అదే.నేను పుట్టినప్పుడు.."

***



"హలో..టీచర్.. ఈరోజు బుడుగు స్కూలుకి రావడం లేదు.."

"ఎందుకని.."

'బుడుగుకి జొరం వచ్చింది.."

"ఎవరూ మాట్లాడేది..?"

"నేను..మా డాడీని మాట్లాడుతున్నా.."

***

"భారతదేశం ఎందుకు ముందుకి పోలేక పోతోంది..?"

"హిమాలయాలు అడ్డుగా వున్నాయి కదా టీచర్!"

***

"అరే అన్నాయ్ రాత్రి పూట కూడా సూర్యుడు ఉంటాడా?"

"ఉంటాడే బుజ్జీ.."

"మరి కనిపించదెందుకనీ.."

"రాత్రి పూట చీకటి ఉంటుంది కదా..అందుకే సూర్యుడు కనిపించడు.."

***



"హిమాలయాలు ఎక్కడున్నాయిరా బుడుగూ.."

**కౌముది**

"తెలీదండీ.."

"తెలీదా..అయితే బెంచి ఎక్కు.. వెధవా..అప్పటికి గానీ తెలీదు నీకు.."

"ఎక్కాను సార్..బెంచీ ఎక్కినా కనిపించడం లేదు.."

***




కామెడీ క్లబ్ కథలు — మల్లాది వెంకట కృష్ణమూర్తి

## కోడి పుంజు

తూర్పుగోదావరి జిల్లాలోని ఓ చిన్న వూరు

ఆ వూళ్ళో మెథడిస్ట్ చర్చ్‌లో కన్ఫెషన్ బాక్స్‌లో కూర్చుని ఉన్నారు ప్రీస్ట్ సెబాస్టియన్. నిత్యం నిర్ణీత సమయంలో ఓ అరగంట పాటు అక్కడ కూర్చుంటాడతను. ఒకటి రెండు రోజులకొకరు వచ్చి తాము చేసిన పాపం చెప్తారు. ఏం చేస్తే ఆ పాపం పోతుందో సెబాస్టియన్ తగిన సలహా ఇస్తాడు. ఆ చర్చి ఆరంభించినప్పటి నించి ఇది ఆనవాయితీగా వస్తోంది. సాధారణంగా భర్తని కొట్టిన భార్య, పక్కతోటలోని కొబ్బరి చెట్లనుంచి కాయలు దొంగిలించిన వారు, సారాయి తాగి పోట్లాటకి దిగిన వాళ్ళు కన్ఫెషన్ బాక్స్ దగ్గరికి వస్తుంటారు.

ఆ రోజు సెబాస్టియన్ కన్ఫెషన్ బాక్స్ లో కూర్చునీ కోర్చోగానే బయటి నించి కోడిపెట్ట రెక్కల చప్పుడు వినిపించింది.

"ఎవరది?" అడిగాడు ఫాదర్ సెబాస్టియన్.

"నమస్కారం ఫాదరూ. నేను మరియమ్మ కొడుకుని 'కన్ను పెసను' వచ్చానండయ్యా" వినిపించిందో గొంతు.

"చెప్పు ఏం పాపం చేసావు?" అడిగాడు ఫాదర్ సెబాస్టియన్.

"కోడి పుంజయ్యా..ఉదయం ఒకళ్ళింట్లోంచి దొంగిలించానయ్యా. ఇంటికెళ్ళి కొయ్యబోయే ముందు నాకు పాపం సేస్తున్నాననే బాధేసి, ఇక్కడికి లగెత్తుకొచ్చానయ్యా. కోడి పుంజుని వెంట తెచ్చానయ్యా. దాన్ని నువ్వు తీసేసుకుని నా పాపాన్ని పోగొట్టమని చెప్పడానికి వచ్చానయ్యా.."

"ఊహుఁ.. నేను తీసుకోనా కోడిపుంజుని.."

"తీసుకో ఫాదరూ. తీసుకుని నా పాపం కాయమని బెతిమలాడడానికి పనివేళా ఇక్కడికి వచ్చానయ్యా.."

"నేను తీసుకోనన్నాగా? నీ పాపం పోవాలంటే నువ్వు దాన్ని ఎవరింట్లోంచి దొంగిలించావో ఆ ఇంటాయనకి తిరిగి ఇచ్చెయ్. దాంతో నీ పాపం ప్రక్షాళనమై నువ్వు నరకం నుంచి కాపాడబడతావ్.."

"అక్కడే చిన్న చిక్కొచ్చిందయ్యా. ఆ ఇంటాయన కోడిని తీసుకోనంటున్నాడు.."

కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పాడు ఫాదర్.

"అలాగా? నువ్వు చెప్పేది నిజమేనా?"

"నీతోడు ఫాదరూ.."

"సరే! అది నిజమే అయితే నువ్వు దాన్ని నీ కుటుంబం కోసం నీ దగ్గరే ఉంచుకోవచ్చు."

"అలా చేస్తే పాపమేమోనన్న అనుమానం తీర్చుకోడానికి వచ్చానయ్యా.."

"కోడి అసలు యజమాని వద్దన్నాక పాపం లేదు. అందుకు హామీ నాది. వెళ్ళు.."

"సిత్తం.. ధర్మ ప్రభువులు.." కన్ఫెషన్ బాక్స్‌కి మొక్కి మరియమ్మ కొడుకు చంకలో కోడితో వెళ్ళిపోయాడు.

చర్చి మూసేసాక ఆరాత్రి తన ఇంటికి వెళ్ళాడు సెబాస్టియన్.

"ఏమండీ.. ఈ ఉదయం మనకోడి పుంజుని ఎవరో ఎత్తుకెళ్ళారండీ.." అతనికెదురొచ్చిన భార్య చెప్పింది అయనతో.

***

## కుర్ర కలాపాలు — యర్రంశెట్టి శాయి

ఇద్దరు అయిదో క్లాసు పిల్లలు స్కూలు కొస్తూనే వాళ్ళ "ప్రథమ చికిత్స" టీచర్ దగ్గరకు పరుగెత్తారు.

"టీచర్ మేము ఇవ్వాళ ఓ అబ్బాయికి చెరువులో మునిగిపోతుంటే రక్షించి 'ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్' ఇచ్చాం. వాడిని గట్టిగా పట్టుకోలేక చేతులన్నీ నొప్పి పుట్టాయి ఇద్దరికీ.." అన్నారు వాళ్ళు.

"కాని - ఎందుకలా పట్టుకోవడం?"

"లేకపోతే చూడండి టీచర్- మేము ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ ఇవ్వకముందే లేచి పారిపోతున్నాడు వాడు.."

***

"చెడు అలవాట్లు' అనే పాఠం చెప్తూ స్టూడెంట్స్ అందరినీ ప్రశ్నలేస్తోంది టీచరమ్మ.

"యస్..శ్రీకాంత్! నువ్వెప్పుడైనా బ్రాంది విస్కీలు తాగావా?"

"లేదు టీచర్! మాడాడీ తాగకూడదని చెప్పారు!"



**కౌముది**

"వెరీ గుడ్ ! తండ్రి అంటే అలా ఉండాలి.. మరి అలాంటివి ఎందుకు తాగకూడదో కూడా మీ డాడీ చెప్పారా?" ఉత్సాహంగా అడిగింది టీచర్.

"చెప్పారు టీచర్! ఇద్దరం తాగితే డబ్బు చాలదట.."

***

"రేపు నేనూ - నా కుటుంబం అనే విషయం మీద వ్యాసం రాసుకురండి" అయిదో క్లాసు పిల్లలకి చెప్పింది క్లాసు టీచర్.

శీనుగాడు ఇంటికి రాగానే వ్యాసం మొదలుపెట్టి మధ్యలో అనుమానం వచ్చి వాళ్ళ మమ్మీని పిలిచాడు.

"మమ్మీ! నేనెక్కడినుంచి వచ్చాను?" అనడిగాడు అనుమానంగా.

"దేవుడు తెచ్చిచ్చాడు.." చెప్పిందామె.

"మరి నువ్వెక్కడి నుంచి వచ్చావ్?"

"నన్నూ దేవుడు తెచ్చాడు.."

" మా అమ్మమ్మ,,"

"అమ్మమ్మను కూడా దేవుడే తెచ్చాడు.."

వాడు మారు మాట్లాడకుండా కాంపోజిషన్ రాయటం ప్రారంభించాడు.

" మా కుటుంబంలో మూడు తరాలనుంచీ సహజమైన పుట్టుకలు లేవు.."

***

రామకృష్ణారావ్ ఆఫీసు పనిమీద మద్రాస్ వెళ్ళి పిల్లలకోసమని బర్మా బజార్ లో రెండు రకాలైన జపాన్ బొమ్మలు కొనుక్కొచ్చాడు.

ఇంటికి రాగానే ఆ బొమ్మలు బయటకు తీస్తూ వాళ్ళ బాబి గాడితో -

"ఇదిగో..ఒకటి నీకు , ఒకటి చెల్లాయ్‌కీ. నీకేది కావాలి?" అనడిగాడు.

బాబిగాడు ఓ క్షణం ఆలోచించి "చెల్లాయ్ దే నాక్కావాలి" అన్నాడు.

***



ఓ పెద్ద మనిషి రాజారావ్ ఇంటికి ఫోన్ చేసాడు.

"హలో.."అన్నాడు ఓ చిన్నపిల్లాడు ఫోన్‌లో.

"మీ డాడీని పిలువు బాబూ.." అన్నాడా పెద్ద మనిషి.

"డాడీ.. మమ్మీ గుడికెళ్ళారు."

"పోనీ ఇంకెవరైనా ఉన్నారా ఇంట్లో..?"

" మా సిస్టర్ వుందండీ..!"

" అయితే ఆమెను మాట్లాడమను!"

పావు గంట తర్వాత కుర్రాడి గొంతు వినిపించింది " అది ఉయ్యాలలోంచి దిగటం లేదండి.."

***

చిన్నిగాడు స్కూల్లో చేరిన మొదటి రోజు అది. హోమ్ బెల్ అవగానే పిల్లలందరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కానీ చిన్నిగాడు మాత్రం క్లాసులోనే ఉండిపోయాడు.

" నువ్వు ఇంటికెళ్ళవేం రా చిన్నీ?" అడిగింది టీచర్.

"నాకు పదిహేనేళ్ళు వచ్చేవరకూ స్కూల్లోనే ఉండాలని మా మమ్మీ చెప్పిందండీ.." దిగులుగా అన్నాడు చిన్ని.

***

"మీ కుక్క పేరేంటమ్మా పాపా?"

"తెలీదండీ..ఎన్ని సార్లడిగినా చెప్తేగా అది!?"

***

ఓ పిసినారి రామారావు గారు కొత్తగా రిలీజైన హిచ్‌కాక్ సినిమా చూడ్డానికొచ్చారు. బయట చాలా రష్ గా వుండడం వల్ల ఓ కుర్రాడిని పిలిచి క్యూలో నిలబడి టికెట్ తెచ్చిమ్మని కోరాడు. ఆ కుర్రాడు ఓ రూపాయి సంపాదించవచ్చు కదా అన్న ఆశతో గంటసేపు క్యూలో నిలబడి ఆయనకు టికెట్ తెచ్చి ఇచ్చాడు.

పిసినారి రామారావు ఆ కుర్రాడి చేతిలో పది పైసలు పెట్టి హాల్లోకి వెళ్ళబోయాడు.

ఆ కుర్రాడి వళ్ళు మండిపోయింది. వెంటనే ఆయన వెంబడి పరుగెత్తుకొచ్చి "సార్! ఈ సినిమాలో హంతకుడు ఇంట్లో పనిచేసే నౌఖరే" అని చెప్పేసాడు కసిగా! ***

# చౌ చౌ

స్వామి భోజనానంద తన శిష్యబృందంతో ఒక వూళ్ళొ అడుగుపెట్టాడు. భక్తి పేర ప్రజలను మోసం చేస్తున్న అతడి గుట్టు ఎలాగైనా రట్టు చేయాలని బుడుగు అనుకున్నాడు. కానీ స్వామీజీ బుడుగుకి దొరకలేదు. కనీసం ఆయన శిష్యుడ్ని పట్టుకుంటే ఏదయినా తెలుసుకోవచ్చని ప్లాన్ వేశాడు.



" మీ గురువుగారికి వెయ్యి సంవత్సరాలని చెబుతున్నారు..నిజమేనా" అడిగాడు బుడుగు.

"ఏమోనండి.. ఏను వచ్చి నాలుగొందల సంవత్సరాలే అయింది.." అంటూ వెళ్ళిపోయాడా శిష్యుడు.

***

"ఏవండీ..ఈ రోజు ఆఫీసు నుంచి త్వరగా వచ్చేస్తారు కదా.." జంబులింగం భార్య జంబులింగంతో గోముగా అంది.

" సినిమాకేనా త్వరగా వచ్చేస్తాన్లే.." అన్నాడు జంబులింగం.

"అదేనండీ..నేనూ పక్కింటి పిన్నిగారూ కల్సి వెళుతున్నాం. మీరు ఇంట్లో ఉంటారనీ.."

***

"హలో.. ఇది ..2456897 నంబరేనాండీ.."

"రాంగ్ నంబర్..ఇది 2456896.."

"అలాగా..అయితే ఒక సారి మీ పక్కింటాయనకి ఫోన్ ఇస్తారా?"

***

పరమానందయ్య గారు క్లాసులో డిక్టేషన్ చెబుతున్నారు.

చివరి బెంచీలో ఉన్న బుడుగు " వినిపించడం లేదు సార్.." అన్నాడు.

"సరే ..అయితే బోర్డు మీద రాస్తాన్లే.." అంటూ బోర్డుకేసి నడిచాడు పరమానందయ్య.

***

"ఆ డాక్టరు నీ జీవితాన్ని కాపాడేడా..ఎలా?"

" ఆ మధ్య నాకు జబ్బు చేస్తే మా వాళ్ళు ఆయన కోసం కబురు పంపేరు. ఆయన రాలేదు.."

***

"మగాళ్ళ కంటే ఆడాళ్ళే ఎక్కువ కాలం బ్రతకడానికి కారణం ఏమిటంటావ్?"

" ఆ ఏముందీ.. వాళ్ళకి భార్యలు ఉండరుగా.."

***

"ఏమేవ్.. మీ అయన ఆడపిల్లల వెంట పడుతున్నాడంట.."

"ఏం ఫరవాలేదు.. కుక్కలు కార్ల వెంట పరిగెత్తినంత మాత్రాన కారుని నడపలేవు కదా.."

***

"మమ్మీ మేము జూలో ఏనుగుల్లా ఆడుకుంటున్నాం..మాకు నువ్వు సహాయం చెయ్యగలవా?" అడిగారు పిల్లలు.

"అలాగే..ఇంతకూ నేనేం చెయ్యాలి?" అడిగింది తల్లి.

"నువ్వు 'జూ' చూడడానికి వచ్చావన్నమాట.. మేం తినేవన్నీ నువ్వు పెడతావన్నమాట..సరేనా?" ఒకేసారి అన్నారిద్దరూ.

***

"వర్షం ఎందుకు కురుస్తుంది నాన్నా..?"

"గడ్డి పెరగడానికి..పువ్వులు పుయ్యడానికి.."

"బాగానే ఉంది.. మరైతే మనం నడిచే దారిలో ఎందుకు కురుస్తుంది?"

***






కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

## కోర్టు సంభాషణలు

సినిమాలో కోర్టు సీనులు గుర్తున్నాయా? చాలాసార్లు సమాధానాలు సులువుగా ఉన్నా అడగాలి కాబట్టి ప్రశ్న అడుగుతారు. అలాంటి ప్రశ్నలు, జవాబులూ ఒక్కోసారి అమితమైన నవ్వు తెప్పిస్తాయి. మచ్చుకి కొన్ని చూడండి..

ప్రశ్న: నీ పుట్టినతేది?
జవాబు: మే 16
ప్రశ్న: ఏ సంవత్సరం?
జవాబు: ప్రతీ సంవత్సరం

ప్రశ్న: నీకు నిజంగా మతి మరుపు ఉందంటావ్?
జవాబు: అవును
ప్రశ్న: ఉదాహరణగా నీవు మరిచిపోయిన కొన్ని విషయాలు చెప్పు
జవాబు: నిన్న లెటర్ పోస్ట్‌చేయడం, ఇవాళ అండర్‌వేర్ వేసుకోవడం


ప్రశ్న: మీ ఇంట్లో మీతో ఉండే అబ్బాయి వయసెంత?
జవాబు: 36
ప్రశ్న: ఎన్నాళ్ళుగా మీతో ఉంటున్నాడు?
జవాబు: నలభై అయిదేళ్ళుగా
ప్రశ్న: డాక్టర్..ఓ మనిషి నిద్రలో మరణిస్తే ఆ సంగతి అతనికెప్పుడు తెలుస్తుంది?
జవాబు: మర్నాడు ఉదయం నిద్రలేచాక తెలుసుకుంటాడది..

ప్రశ్న: యుద్ధంలో మరణించింది మీరా మీ చిన్న తమ్ముడా?
జవాబు: మా  చిన్న తమ్ముడు.

ప్రశ్న: నువ్వు సూపర్ మార్కెట్ ముందునించి వెళ్ళేదాకా అక్కడే వున్నావు. అది నిజమేనా?
జవాబు: అవును
ప్రశ్న:  తర్వాత అతను నిన్ను చంపాడా?

ప్రశ్న: ఇది నీ ఫోటో నేనా?
జవాబు: అవును
ప్రశ్న: దీన్ని తీసినప్పుడు నువ్వు  అక్కడే ఉన్నావా?

ప్రశ్న: ఆమెకి పిల్లలున్నారా?
జవాబు: ముగ్గురు
ప్రశ్న: కొడుకులెంతమంది?



**జవాబు:** కొడుకులు లేరామెకి.

**ప్రశ్న:** కూతుళ్ళెంతమంది?

**ప్రశ్న:** మెట్లు బేస్‌మెంట్ లోకి వెళతాయా?

**జవాబు:** అవును

**ప్రశ్న:** అందులోంచి అవి పైకి వస్తాయా?

**ప్రశ్న:** మొదటి వివాహం ఎందువల్ల ఖరైంది?

**జవాబు:** చావు వల్ల

**ప్రశ్న:** ఎవరి చావు వల్ల?

**ప్రశ్న:** మీరు యూరప్‌కి ఎందుకెళ్ళారు?

జవాబు: హనీమూన్‌కి

**ప్రశ్న:** మీ వెంట ఎవరు వచ్చారు?

***

## మందుభాగ్యం..! యర్రంశెట్టి శాయి



**ఓ మందేశ్వరరావు** బాగా మందు కొట్టేసి అర్ధరాత్రి ఓ ఇంటికెళ్ళి తలుపులు బాదేశాడు.

ఇంటాయన బయటకొచ్చి "ఏమిటి?" అన్నాడు కోపంగా.

"కోప్పడకండి. అర్జంటుగా శంకర్రావు గారింటికెళ్ళాలి! కొంచెం ఇల్లెక్కడో చెప్తారా?" అన్నాడతను తూలుతూ.

ఇంటాయన ఆశ్చర్యపోయాడు.

"అదేమిటయ్యా! నువ్వేగా శంకర్రావువి?"

" ఆ సంగతి నాకూ తెలుసులేవయ్యా! నే అడిగేది అతనిల్లు ఎక్కడా అని!"

విసుక్కున్నాడు శంకర్రావు.

***

**ఓ తాగుబోతు** గుండెనొప్పితో డాక్టర్ దగ్గరకు పరిగెట్టాడు.

ఇంజక్షనిచ్చి అతనికి 'నీతి' కథ చెప్పాలనుకున్నాడు డాక్టరు.

"ఇలా తాగడం ఎంత ప్రమాదకరమో మీకు తెలీదు. మీ శరీరం చాలా నెమ్మదిగా విషమయం చేసుకుంటున్నారన్నమాట మీ చేతుల్తోనే"

అన్నాడు.

"ఫరవాలేదు లెండి! తొందరగా చేసుకోవడం నాకూ ఇష్టం లేదు!" అన్నాడు తాగుబోతు.

***

**ఇద్దరు తాగుబోతులు** ఒక తుపాకీ తీసుకుని చెట్టుమీద వాలిన ఓ పిట్టని కాల్చడానికెళ్ళారు. అందులో ఒకడు తుపాకీ పిట్టకు గురిపెట్టాడు.

"లాభంలేదు.. పిట్టను కాల్చలేవు.." అన్నాడు రెండోవాడు.

"ఎందుకని?" అడిగాడు మొదటివాడు కోపంగా.

"తుపాకీలో గుళ్ళు లేవు కదా?"

" ఆ సంగతి పిట్టకేం తెలుస్తోందోయ్ వెర్రి మొఖమా?" నవ్వుతూ అని తుపాకీ పేల్చాడు మొదటి వాడు.

***

**ఓ తాగుబోతు** అర్థరాత్రి ఓ వీధిదీపం కింద ఏదో వస్తువు కోసం వెతుకుతున్నట్లు కనిపించాడు.

"ఏమిటి వెతుకుతున్నావ్!" జాలిపడి అడిగాడో దారిన పోయే దానయ్య.

"నా పర్సుపోయింది.." అన్నాడు తాగుబోతు విచారంగా.

"ఎక్కడ?"

"వెనుక వీధిలో.."

దానయ్య ఆశ్చర్యపోయాడు.

"మరి ఇక్కడ వెతుకుతావేం?"

" ఆ వీధిలో లైట్లు లేవోయ్ పిచ్చినాయనా..చీకటిగా ఉంది" జాలిగా నవ్వి మళ్ళీ వెతకసాగాడు. ***

**తాగుబోతు** విచారంగా బార్‌లో కూర్చుని ఓ కాగితం మీద లెక్కలు వేసుకుంటున్నాడు.



"ఏమిటి బిల్లుకి డబ్బు తక్కువైందా?" ధైర్యం చెబుదామని అడిగాడు మేనేజరు.

"అబ్బే అదికాదు! మా ఆవిడ గురించి ఆలోచిస్తున్నాను!" అన్నాడు తాగుబోతు.

"మీరు తాగి ఇంటికెళితే కేకలేస్తుందనా?" జాలిగా అడిగాడు మేనేజరు.

"అబ్బే అదికాదు. నిన్న మా ఆవిడ ప్రతిజ్ఞ చేసింది. నేను తాగడం మానే వరకూ తను పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టదట.." దిగులుగా అన్నాడు తాగుబోతు.

"అరే! పెద్ద చిక్కొచ్చి పడిందే" అన్నాడు మేనేజర్.

"డాక్టర్ నడిగితే ఆవిడలా భోజనం చెయ్యకపోతే వారానికి నాలుక్కిలోల బరువు తగ్గిపోతుందని చెప్పాడు!"

'పాపం ఆవిడంటే మీకు ప్రాణమనుకుంటాను. మరి తాగుడు మానేద్దామనుకుంటున్నారా?" సానుభూతితో అన్నాడు మేనేజర్.

"మానేయడమా నాపిండాకూడా? మా ఆవిడ పీడ విరగడవ్వాలంటే పదిహేను వారాలు పడుతుందే అని ఛస్తున్నాను.."

***

# చౌచౌ

"ఒరే బుడుగూ..నన్నయ రాసిన కొన్ని కావ్యల పేర్లు చెప్పు.."

"తెలీదు సార్..ఆయన సెల్ నంబర్ ఉంటే ఇవ్వండి..కనుక్కుని చెబుతాను.."

***

"ఏమోయ్ సోమలింగం..నలభై రోజుల్లో తమిళం చదువుతున్నావేమిటీ?"

"తమిళంలో తిట్లు నేర్చుకుని మా ఆవిడని నోరారా తిడదామని.."

"ఆ పనేదో తెలుగులోనే చెయ్యొచ్చు కదా.."

"తనకి తెలుగొచ్చు..తమిళం రాదు.." అన్నాడు సోమలింగం ఆనందంగా.

***

"సార్.. మీరు  మా కంపెనీ ట్యూబ్ లైట్ కొంటే ప్రతిరోజూ దాన్ని చూడకుండా ఉండలేరు.."

"అంత బాగా వెలుగుతుందా?"

"కాదు సార్..ఎప్పుడెప్పుడు వెలుగుతుందా? అని.."

***

అమెరికాలో ఉన్న అల్లుడికి ఉత్తరం రాస్తున్నారు మామగారు. "ఏమండోయ్..మనవడు కోతిబొమ్మ కొనిపెట్టమని అదే పనిగా పేచీ పెడుతున్నాడని ఒక ముక్క రాసి పడేద్దురూ.." చెప్పింది భార్య.

దానికి మామగారు ఇలా రాశారు..

"అల్లుడు గారూ..మీ అబ్బాయి కోతిబొమ్మ కొనమని నిత్యం మా ప్రాణాలు తోడేస్తున్నాడు. కోతిబొమ్మ కొనమంటారా? మీరు వచ్చేవరకు ఆగమంటారా?"

***

" మా మామయ్య కప్పుని మింగేశాడ్రా"

మరెలా డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళావా?"

"ఎలా తీసుకెళ్ళడం..!? అప్పటికే గెంతుకుంటూ చాలా దూరం పోయాడు.."

***

ఒక గాడిద మీద ఎక్కి ఫోటో తీయించుకున్న మనవడు  ఫోటోని తాతకి చూపిస్తూ

"గాడిదమీద మనిషి టైటిల్ బాగుందా తాతయ్యా.."అని అడిగాడు.

"ఆఁ..బావుంది కానీ మరి నీ మీద ఎక్కి కూర్చున్నదెవరో కనిపించడం లేదేంటి?" అన్నాడు తాత.

***

"నాయనమ్మా ఈ రోజు స్కూల్లో వందమీటర్ల పరుగు పందెంలో పాల్గొంటున్నాను. నన్ను ఆశీర్వదించవూ!?" అడిగేడు మనవడు.

"కాస్త ముందు వెనక చూసుకుని నెమ్మదిగా పదుగెత్తు నాయనా.." అంది నాయనమ్మ.

***






కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

## వెడ్డింగ్ యానివర్సిరీ

తమ 50వ వెడ్డింగ్ యానివర్సిరీ రోజున ఆచారి, అతని భార్య తాము తొలిసారిగా కలుసుకున్న హైస్కూలులోని తమ క్లాసురూముకి వెళ్ళారు. అక్కడ డెస్క్ మీద "ఐ లవ్ యూ రుక్మిణి" అని ఆచారి ఆ రోజుల్లో చెక్క బల్ల మీద చెక్కిన అక్షరాలని తన భార్యకి

చూపించాడు. విషయం తెలిసి స్కూలు టీచర్ వాళ్ళ పేర్లు పిలిస్తే సరదాగా 'ప్రెజెంట్ టీచర్' అని కూడా అన్నారిద్దరూ.

సరే.. అదయ్యాక ఇంటికి తిరిగి వస్తుంటే, ఓ బేంక్ వేన్ లోంచి వాళ్ళ కాళ్ళ దగ్గర ఒక మూట పడింది. చూస్తే అందులో పది లక్షల రూపాయలున్నాయి.

"ఆ బేంక్ పేరు వేన్ మీద రాసుంది. తీసుకెళ్ళి ఇచ్చేద్దాం" చెప్పాడు ఆచారి.



ఒద్దు అని రుక్మిణి దాన్ని తీసుకెళ్ళి తమింట్లో సింక్‌లో దాచింది.

మర్నాడు పోలీసులు ఒకో ఇంటికీ వెళ్ళి దారిలో పడిపోయిన ఆ బేంక్ డబ్బు గురించి ఆరా తీయసాగారు.

రుక్మిణి, ఆచారుల ఇంటికి కూడా వచ్చి అడిగారు.

"నిన్న బేంక్ వేన్ లోంచి డబ్బుల మూట పడిపోయింది. మీరు కాని చూశారా?"

"లేదు" చెప్పింది రుక్మిణి

"మా ఆవిడ అబద్ధం ఆడుతోంది. వద్దంటున్నా వినకుండా ఆ డబ్బుల మూటని ఇంటికి తెచ్చింది" నిజం చెప్పాడు ఆచారి.

"మా ఆయనకి స్క్రూ లూజు" వెంటనే చెప్పింది రుక్మిణి.

పోలీసులు ఆచారిని ఆసక్తిగా అడిగారు

"అసలు నిన్నేం జరిగిందో వివరంగా చెప్పు"

"నిన్న మా పెళ్ళిరోజు. దాంతో స్కూలు కెళ్ళి అటెండెన్స్ చెప్పి తిరిగి వస్తుంటే దారిలో డబ్బుల మూటా కనిపించింది. దాన్ని తెచ్చి మా ఆవిడ సింక్‌లో దాచింది.."

## ఉద్యోగం-ఉల్లాసం..!

యర్రంశెట్టి శాయి

ఆచారి వంక ఓ పిచ్చివాడ్ని చూసినట్లుగా చూసి ఆ పోలీసులిద్దరూ బయటికి నడిచారు. ***

సెక్రటరీ: ఉద్యోగం ఒకతను వచ్చి కూర్చున్నాడండీ. లోపలకు పంపించమంటారా?

ఆఫీసరు: ఎలా వున్నాడతను?



సెక్రటరీ: పొడుగ్గా నల్లగా వున్నాడు. ఒకటే చేయి ఉంది.

ఆఫీసరు: అంతకు ముందు ఏం ఉద్యోగం చేసేవాడట?

సెక్రటరీ: సర్కస్ కంపెనీలో ఒకే ఒక్క ఫీట్ చేసేవాడట!

ఆఫీసరు: ఏమిటది?

సెక్రటరీ: సింహం నోట్లో చెయ్యి పెట్టడం!

***

అమోఘరావ్‌ని వాళ్ళ ఆఫీసరు పిలిచాడు.

"మిస్టర్ అమోఘరావ్. చనిపోయినవాళ్ళు తిరిగి పుడతారంటావా?" అడిగాడు ఆఫీసరు.

"అవున్సార్ పుడతారు" ఆ ప్రశ్న ఎందుకడిగాడా అని ఆలోచిస్తూ జవాబిచ్చాడు అమోఘరావ్.

"అలాగా! అయితే సరే. మరేం లేదు. నిన్న మీ తాత అంత్యక్రియలకోసమని నువ్వు శెలవు పెట్టి వెళ్ళిపోయాక, నీ కోసం మీ తాత

ఆఫీసుకొచ్చాడు.."

***

**రాంబాబు** ఉద్యోగాల వేటలో ఉన్నాడు. అతి కష్టం మీద ఓ ఉద్యోగం తాలూకు వ్రాత పరీక్షలో నెగ్గి ఇంటర్వ్యూ కొచ్చాడు. ఇంటర్వ్యూలో చాలా మందికి ఏదో ఒక పిచ్చి ప్రశ్న అడిగి తికమకపెట్టి ఫెయిల్ చేస్తారని అతనికి చాలామంది వార్నింగిచ్చేరు. భయంతోనే ఇంటర్వ్యూ హాల్లోకి అడుగు పెట్టేడతను.

"చూడు మిస్టర్! ఓ చిన్న ప్రశ్న వేస్తాను. బాగా ఆలోచించి సమాధానం చెప్పు. ఒక వ్యక్తి ఒక వస్తువుని ఎనిమిది రూపాయల ముప్పయి పైసలకు కొని, వెంటనే దాన్ని ఆరూపాయల అరవై పైసలకు అమ్మేశాడు. అతనికి లాభమా , నష్టమా?

రాంబాబు తెగ ఆలోచించి అన్నాడు.

"రూపాయల్లో నష్టం. పైసల్లో లాభం సార్.."

***

**కొన్నేళ్ళపాటు** ఉద్యోగం అల్లాడిపోయిన గణపతి రావుకి చివరకు అతి ఖరీదైన వస్తువులమ్మే షాపులో ఉద్యోగం దొరికింది.

చేరిన మొదటి రోజునే అతను ఎంతో ఖరీదైన గాజు సామాను సెట్టు పగలగొట్టాడు. అందమైన తివాచీ మీద 'టీ' వొలికి మరకలు పడిపోయింది.

చాలా విలువగల పెయింటింగ్ పొరబాటున అతని చేతిలోనే విరిగి పోయింది.

"వీటన్నిటి ఖరీదూ నువ్వే కట్టుకోవాలి. ప్రతి నెలా నీ జీతంలో సగం తెగ్గోస్తాను" అన్నాడు షాపు యజమాని కోపంగా.

"అన్నీ కలిపి ఎంత కట్టుకోవాలి?" అడిగాడు గణపతి రావు అమాయకంగా.

"అయిదువేల రూపాయలు" అన్నాడు షాపు యజమాని కసిగా.

"అహ్హా..లలల్లా..దేముడు కరుణించెన్. నా జన్మధన్యమయ్యెన్.." అంటూ ఆనందంగా పాట పాడాడు గణపతి రావు.

"అయితే అయిదువేల రూపాయలు కట్టడమంటే నీ కింత సంతోషంగా వుందన్నమాట" అన్నాడు షాపు యజమాని కోపంగా.

"అవున్సార్..ఇప్పట్లో నా ఉద్యోగం ఊడిపోయే ప్రమాదం లేదుగా మరి..!"

***



**పర్సనల్** ఆఫీసర్ పద్మనాభం తన ఎదురుగ్గా నిలబడ్డ అప్పారావ్ వంక చిరాకుగా చూశాడు.

"అయితే నీకీ ఆఫీస్‌లో ఉద్యోగం కావాలంటావ్?"

"అవునండీ!"

"నువ్వేం పని చెయ్యగలవ్?"

అప్పారావు బుర్రగోక్కున్నాడు. "నిజం చెప్పాలంటే నేనే పనీ చెయ్యలేనండీ.."

"ఓహో..అదన్నమాట సంగతి. మరలాంటప్పుడు నాలుగు నెలల క్రిందటే అప్లయి చేసి ఉండాల్సింది.ఆ ఎక్కువ జీతాలు గల ఉద్యోగాలన్నీ అప్పుడే భర్తీ అయిపోయాయి.."

***

**సీతాపతి** ఓ కాగితం పట్టుకుని ఆఫీసర్ గదిలోకి జొరబడ్డాడు.

"సార్. ఆర్నెల్ల క్రితం మీరు ఓ గుమాస్తాని డిస్మిస్ చేసేశారు చూడండి. అతనిని తమ కంపెనీలో చేర్చుకోబోతోందనీ, కనుక అతని

గురించి మీ అభిప్రాయం తెలుపవలసిందనీ ఆ కంపెనీ వాళ్ళు రాశారు.."

"వాడి గురించా?" మండి పడుతూ అన్నాడు ఆఫీసరు.

"వాడికి తెలిసిన విద్యలు లంచం, దొంగతనం. వాడి బుద్ధి. కపట బుద్ధి. ఇదే రాయ్ వాళ్ళకు. అన్నట్లు యింకో విషయం కూడా రాసెయ్! వాడు పెద్ద చవటనీ. వాడికి వచ్చిన విద్యలన్నీ మనమే నేర్పించామనీ కూడా స్పష్టం చెయ్.."

***

# చౌ చౌ

**జంబులింగం** పోలీస్ స్టేషన్ కి ఫోన్ చేశాడు.

"ఏమండీ..ఎవరో మా పెరట్లో బాంబు వదిలేసి వెళ్ళారు.." అన్నాడు.

అవతలనుంచీ పోలీసు " ఏం ఫరవాలేదు, ఓ మూడు రోజులు చూడు.." అన్నాడు.

"తరువాత.."

"ఎవరూ రాకపోతే నువ్వే ఉంచుకో.."

***

**పక్కింటాయన** తలుపు తడుతుంటే తీశాడు జంబులింగం.

"జంబులింగం గారూ.. దొంగా పోలీస్ ఆటాడుకుందాం వస్తారా?" పక్కింటాయన ఉత్సాహంగా అడిగాడు.


"ఎవరెవరు ఆడుతున్నా రేమిటి?" జంబులింగం ఆసక్తిగా అడిగాడు.

"మీరు, నేను , మీ ఆవిడ.." పక్కింటాయన సమాధానం.

" నాకిష్టం లేదు.." జంబులింగం మూతి ముడుచుకున్నాడు.

"అయితే మీ దోస్త్ కటీఫ్..మేమిద్దరమే ఆడుకుంటాం"

***



"పెళ్ళికి ముందు నువ్వు ఏం చేస్తుండే వాడివి?"

"నేను చెయ్యాలనుకున్న పనులన్నీ చేసుకునే వాడ్ని"

"మరి ఇప్పుడో..?"

"పనులైతే చేస్తున్నాను కానీ, నేననుకున్నవి కాదు, మా ఆవిడ చెప్పేవి.."

***

**స్నేహితుడి** పెళ్ళి రెసెప్షన్ కి వెళ్ళిన జంబులింగం ప్లేటు తర్వాత ప్లేటు మారుస్తూ..భోజనం లాగిస్తూనే ఉన్నాడు. చాలా సేపు గమనించిన ఇంకో ఫ్రెండు " చాల్లేరా జంబులింగం..ఇంకా ఎంత సేపు తింటావ్..?" మందలింపుగా అన్నాడు.

" నాకూ ఇంతసేపు తినడం ఇబ్బంది గానే ఉంది కానీ ఏం చెయ్యమంటావ్? డిన్నర్ 7 గంటల నుంచీ 10 గంటల దాకా అని వుంది.." అసలు విషయం చెప్పాడు జంబులింగం.

***

"**మీ నాన్న** నా కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తున్నప్పటి ఫోటోలో నా మొహం దివ్యంగా ఉంది కదూ.." కాలర్ ఎగరేస్తూ గర్వంగా అన్నాడు జంబులింగం.

" ఏమో గానీ, నాకు మాత్రం ఆ సమయంలో మా నాన్న వసుదేవుడిలా కనిపించారు.." కసిగా చెప్పింది మిసెస్ జంబులింగం..!

***

**తగలబడిపోతున్న** భవనంలోనుంచి ఆరుగురుని బలవంతంగా బయటికి లాక్కొచ్చాడు జంబులింగం.

అందుకని పోలీసులు అతన్ని జైల్లో పెట్టారు.

ఎందుకంటే అలా అతను బయటికి లాక్కొచ్చిన వాళ్ళు అగ్ని మాపక దళానికి సంబంధించిన వాళ్ళు మరి..!

***

" **ఏమండీ..**ఈ బస్సులో అక్కడినుంచీ ఈ చివరి స్టాప్ దాకా వచ్చారు. కిందికి దిగకుండా మళ్ళీ వెనక్కి టిక్కెట్ అడుగుతున్నారేమిటీ.."

"మరేం చెయ్యమంటావయ్యా..నేనెక్కాల్సిన 22 బస్సు రాలేదు.అందుకని ఈ 11 నంబరు బస్సులో రెండు సార్లు ప్రయాణిస్తున్నా.."

***




కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

# న్యాయం కావాలి

కోర్టు, కోర్టు వాతావరణం అంటే ఏమాత్రం తెలియని ఓ అరవయ్యేళ్ళ ముసలాయన విజిటర్స్ కోసం ప్రత్యేకించబడ్డ చెక్క బెంచీలో కూర్చుని బిక్కు బిక్కు మంటూ అక్కడ జరిగే తతంగాన్ని చూస్తున్నాడు.

పోలీసులు రకరకాల నేరస్థుల్ని, దొంగలని, దొంగతనం చేయించిన వాళ్ళని, వ్యభిచారులని, వ్యభిచార గృహాలని నడిపేవాళ్ళని, జూదగాళ్ళని అనేకమందిని తీసుకువస్తున్నారు. చాలామంది తమతప్పులని ఒప్పుకుంటున్నారు. న్యాయమూర్తి వారికి వారి నేరాలను బట్టి శిక్షవిధిస్తున్నారు.



లంచ్ విరామ సమయంలో గంటకొట్టారు. పోలీసులు, కోర్ట్ క్లర్క్, ప్యూన్, న్యాయమూర్తి, లాయర్లు, సాక్షులు..అంతా వెళ్ళినా ఆ ముసలాయన మాత్రం కూర్చున్నచోటునించి కదలలేదు.

నేలవైపు చూస్తూ దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు. మధ్యమధ్యలో తనలో తనే ఏదో గొణుక్కుంటున్నాడు. అరగంటకోసారి తన చేతి సంచి లోంచి కొన్ని కాగితాలని బయటికి తీసి చూసుకుని, తృప్తిగా తలాడించి మళ్ళీ వాటిని కరెన్సీ నోట్లకన్నా భద్రంగా ఆ సంచిలో దాస్తున్నాడు.

లంచ్ అవర్ అయిందన్న గుర్తుగా గంట మోగింది. న్యాయమూర్తి మళ్ళీ వచ్చారు. పోలీసులు, ప్యూన్, క్లర్క్, సాక్షులు అంతా మళ్ళీ వచ్చారు.

ఒక్కొక్కరికి శిక్షలు విధిస్తున్న న్యాయమూర్తి ఆ ముసలాయనకి అపర పరమాత్మలా కనిపిస్తున్నాడు.

"మీకేం కావాలి?" ఉదయం నుంచీ కదలకుండా అక్కడే కూర్చున్న వున్న ఆ ముసలాయన్ని గమనిస్తున్న న్యాయమూర్తి అకస్మాత్తుగా అడిగాడు.

ఆయన కొద్దిగా తడబడ్డాడు. వెంటనే లేచి నిలబడ్డాడు. కుడిచేతిలోని సంచిని ఎడం చేతిలోకి మార్చుకున్నాడు. న్యాయమూర్తి దగ్గరకు నడిచాడు.

అందరికళ్ళూ ఆయన్నే గమనిస్తున్నాయి. చేతిసంచిలోంచి కాగితాలని తీసి న్యాయమూర్తికి అందించి చెప్పాడాయన.

"పందొమ్మిద్ది వందల యాభై నాలుగులో నేను విజయవాడలో పి.డబ్ల్యు.డి.లో పనిచేస్తుండగా ఎనిమిది వందలు లంచం తీసుకున్నాను. ఆ తర్వాత కూడా ఎన్నో సార్లు లంచం తీసుకున్నాను. లంచాలు తీసుకున్న నేరానికి నన్ను శిక్షించాల్సిందిగా కోరుతున్నాను. ఈ సంగతి ఋజువు చేసే కాగితాలు ఇవి."

న్యాయమూర్తి ఆయన అందించిన అన్ని కాగితాలు పరిశీలించి ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇన్నేళ్ళ తర్వాత మీలో ఈ ధర్మబుద్ధి ఎలా కలిగింది?"

"నిజమే. నెల్రకితం రిటైరయ్యా.." పొడిగా చెప్పడాయన.

"జైల్లో వుంటే భోజనం దొరుకుంతుందనా?" అడిగాడు న్యాయమూర్తి.

ఆయన తల అడ్డంగా ఆడించి చెప్పాడు.

"నా భార్య, తొమ్మిది మంది పిల్లలతో, పధ్నాలుగు మంది మనవళ్ళతో ఉదయం అంతా ఆ ఇంట్లో గడిపేకంటే జైల్లో మంచి

చోటుకాబట్టి..''!!

***

## న్యాయవాదం   యర్రంశెట్టి శాయి

''మరి నిన్ను ఖడ్గమృగం అని ఆర్నెల్లయితే ఇంతకాలం ఎందుకూరుకున్నావ్?''

అడిగాడు న్యాయవాది.

''నిన్నే గదయ్యా..అయిద్రాబాదెళ్ళి దాన్ని చూసొచ్చింది..'' అంటూ చిరాకు పడ్డాడు వెంగళయ్య.

***

ఒక సినీతార ఒకతను తనను రేప్ చేసాడన్న ఆరోపణతో కోర్టుకెళ్ళింది.

''మిమ్మల్ని రేప్ చేసిందెవరో గుర్తించగలరా?'' అడిగాడు లాయరు.

''అడుగో! అతనే!'' చూపించింది తార ఎదురుగా బోనులో నుంచున్నతని వంకచూపుతూ.

''రేప్ ఎప్పుడు జరిగిందో చెప్పగలరా?''

''ఎందుకు చెప్పలేను? నిన్నటికి సరిగ్గా రెండు నెలలనుంచీ జరుగుతోంది..''

***

జడ్జీ: నీ భార్యకి మనోవర్తిగా నెలకు మూడు వందలు మంజూరు చెయ్యాలనుకుంటున్నాను.

భర్త: చాలా థాంక్స్ సార్. నేను కూడా కొద్దో గొప్పో ఇస్తాను లెండీ..

***

లాయర్: నువ్వా కారుని ఎందుకు తీసుకుపోయావో కోర్టుకి చెప్పు.

ముద్దాయి: ఇందులో పెద్ద రహస్యమేముందండీ! నేను ఆ రోడ్డు వెంబడి పోతుంటే ఆ కారు స్మశానం బయట ఖాళీగా కనిపించింది. బహుశా ఆ కారు గలాయన చనిపోయి ఉంటారని నేను తీసుకెళ్ళాను.

***

జడ్జీగారు బోనులో నిలబడ్డ వ్యక్తిని చూసారు.

''ఏమయ్యా? నిన్నింతకు ముందు ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం వుందే?''

''చూశారు సార్..నేనే మీ ఆవిడకు సంగీతం నేర్పించాను...రెండేళ్ళక్రితం!''



"ఓహో.. నువ్వేనన్న మాట! అయితే - పదేళ్ళు జైలు.." అన్నారాయన కసిగా!

***

ఇద్దరు భార్యలున్నారన్న ఆరోపణమీద ఓ ధనవంతుడిని కోర్టుకెక్కించారు. బోలెడు డబ్బు ఖర్చుచేసి ఓ మాంఛి లాయర్ ని ఏర్పాటు చేసుకున్నాడతను.

ఎలాగయితేనేం, అతనే కేసు గెలిచాడు. అతను నిర్దోషి అని తేల్చారు జడ్జీగారు.

"చూశావా..నీ కేసు గెలిపించేశాను. ఇంక నువ్వు హాయిగా ఇంటికెళ్ళ వచ్చు.." అన్నాడా లాయర్ కోర్టు బయటికి రాగానే.

"ఏ యింటికి? మొదటి భార్య ఇంటికా, రెండో భార్య ఇంటికా?" అడిగాడతను.

***


జడ్జీ: ఏమోయ్..మళ్ళీ ఎలా వచ్చావిక్కడికి?

ముద్దాయి: ఇద్దరు పోలీసులు తీసుకొచ్చారండీ..

జడ్జీ: మళ్ళా తాగుడేనా?

ముద్దాయి: అవునండీ! ఇద్దరూ ఫుల్‌గా తాగే వున్నారు.

***



జడ్జీగారు బోనులో విచారంగా నిలబడ్డ ముద్దాయిని చూసి జాలిపడ్డారు.

"నీకు లాయర్ కావాలంటే చెప్పు ఏర్పాటు చేస్తాను.." అన్నాడు జాలిగా.

"అబ్బే..అవసరం లేదండీ.." తలూపుతూ అన్నాడు ముద్దాయి.

"లాయర్నిస్తే ఫీజు ఇవ్వాలనుకుంటున్నావేమో! అదేం లేదు..ఫ్రీ" వివరించారు జడ్జీగారు.

ముద్దాయి ఓ క్షణం ఆలోచించాడు.

"సరే మీకంతగా సహాయం చేయాలనుంటే నాకో మంచి సాక్షిని ఏర్పాటు చెయ్యండి. లాయర్ మాత్రం అవసరం లేదు.." నెమ్మదిగా అడిగాడతను.

***

ఓ అమాయకరావ్ కొత్తగా క్లబ్ లో చేరాడు. మొదటిరోజు లాన్స్‌లో కూర్చుని తనపక్కనే ఉన్న లాయర్ తో పరిచయం చేసుకున్నాడు.

"మబ్బులు మూసుకొస్తున్నాయ్. ఇంకాస్సేపట్లో వర్షం కురుస్తుందంటారా?" అనడిగాడు లాయర్ని.

"కురుస్తుందని నేననను" అన్నాడు లాయర్. ఆ మర్నాడు అమాయకరావ్‌కి లాయర్ నుంచి సలహా ఇచ్చినందుకు గాను బిల్ వచ్చింది,

మరో పదిరోజుల తర్వాత మళ్ళీ లాయర్ పక్కనే కూర్చోవటం తటస్థించింది.

"మనకి పాకిస్థాన్ కి యుద్ధం వస్తుందంటారా?" అడిగాడు అమాయకరావ్.

"సందేహాస్పదమే!" అన్నాడు లాయర్. రెండోరోజు దానిక్కూడా బిల్ పంపించాడతను.

ఆ బిల్ పట్టుకుని కోపంగా లాయర్ దగ్గరకెళ్ళాడతను.

"ఏయ్..శుంఠా! నువ్వు పరమ వెధవ్వి..దొంగ రాస్కెల్ వి.." అని అరిచి వెనక్కు వెళ్ళబోతూ మళ్ళీ ఆగి "ఇదుగో! ఇప్పుడు ఇదంతా నేను చెపుతున్నాను. నిన్నేమీ అడగటం లేదు..గుర్తుంచుకో.." అనేసి వెళ్ళిపోయాడతను.

***

# చౌ చౌ

"అవునూ బాబాయ్ గార్ని మెంటల్ సుపత్రిలో చేర్పించారట గదా! ఇప్పుడు ఎలా ఉంది పిన్ని గారూ?" అని అడిగింది పక్కింటి సుశీల.

"కాస్త నయం తల్లీ! మొదట్లో ప్రధాన మంత్రిని అనేవారు, ఇప్పుడు ముఖ్యమంత్రిని అంటున్నారు.." అన్నారు పిన్ని గారు.

***

పిసినారి సింగినాథం తన భార్యతో బస్టాండుకు వెళుతున్నాడు. దారిలో ఒక మిఠాయి షాపు ముందు ఆగి "ఏమోయ్..కాంతం ఇంకో మైసూర్ పాక్ తింటావా?" అన్నాడు భార్యతో.

అప్పుడామె ఆశ్చర్యంగా "ఇంకోటి తినడమేంటండీ..మనం అసలు ఆ షాపులోకి వెళ్ళందే" అంది.

"మరీ అంత మతి మరుపు అయితే ఎలా..మనకు పెళ్ళైన కొత్తలో వచ్చి ఇదే షాపులో ఒక మైసూర్ పాక్ తినలేదూ..గుర్తు తెచ్చుకో.." అన్నాడు రంగారావు.

***

"ఏమయ్యా డాక్టరూ.. నాకివ్వాల్సిన బాకీ సంగతి ఏం చేశావు? మర్యాదగా ఇప్పుడిస్తావా లేదా?"

" అలాగే..కాస్సేపు కూర్చో..నిన్ననే ఒకతను కాలినొప్పి అని వస్తే గుండె నొప్పి వచ్చే మాత్ర ఒకటి ఇచ్చా. అతను రాగానే స్కానింగ్ తీసేసి నీ బాకీ తీర్చేస్తా.." చెప్పాడా డాక్టర్.

***

శంకరప్ప: అదేంట్రా..మొన్న ఆ పక్క వీధిలో ఆయన అంత్యక్రియలకు రాలేదెందుకు? బాగా తెలిసిన వాడేగా!?

వెంగళప్ప: వచ్చి ఏంలాభం రా..రేపు నా అంత్యక్రియలకు ఆయనొొస్తాడా ఏంటి? అందుకే నేనూ రాలే.

***

ఓ ఇంటర్వ్యూలో "మూడు యాపిల్ పండ్లను ఓ ఐదుగురికి  ఎలా సమానంగా పంచగలరు?"

"జ్యూస్ చేసి.."



"మనదేశంలో పెట్రోల్ ఎక్కడెక్కడ దొరుకుతుంది?"

"ఇదేం ప్రశ్నండీ.. అన్ని పెట్రోల్ బంకుల్లోనూ దొరుకుతుంది.."

"భయంకరమైన అడవి మృగాలు ఒక 10 చెప్పండి.."

"ఐదు సింహాలు..ఐదు పులులు.."

***

మిలటరీలో కొత్తగా చేరిన సైనికులకు శిక్షణ ఇస్తున్నారు.

ఇంతలో ఒక యువకుడు "సార్..విమానం లోంచో హెలికాప్టర్ లోంచో దూకేసిన తరువాత నా పారాచూట్ ఓపెన్ కాకపోతే ఏం చెయ్యమంటారు?" అన్ అడిగాడు.

"నా దగ్గరకు తెచ్చెయ్యమ్మా..ఇంకోటిస్తా" అన్నాడు పై అధికారి కోపంగా.

***




**కామెడీ క్లబ్ కథలు** — **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## కప్పశాస్త్రం

ఎం.బి.బి.ఎస్ చదువుతున్న ఓ మిత్రుడు వెంగళ్రావుని తన సైన్సు లేబరేటరీకి ఓసారి తీసుకెళ్ళాడు. ఆ రోజు కప్ప మీద ప్రయోగాలు జరుగుతున్నాయి.

అతని మిత్రుడు కప్పకున్న నాలుగు కాళ్ళలో ముందుదాన్ని కోసి చెప్పాడు.

"గెంతు"

కప్ప ముందుకి గెంతింది. తర్వాత ముందున్న ఇంకోకాలు కట్ చేసి మళ్ళీ చెప్పాడు.

"గెంతు"

అది ఇంకోసారి ముందుకి గెంతింది. తర్వాత వెనుకనున్న ఓ కాలుని కోసేసి చెప్పాడు దానికి.

"గెంతు!!"

అది గెంతలేదు.

"నిన్నే ..మళ్ళీ గెంతు.."

అది వున్న చోటునుంచీ కదల్లేదు.

"దీన్ని బట్టి నీకేమర్థమయింది?" ప్రశ్నించాడు వెంగళ్రావుని.

"కప్పకి రెండు కాళ్ళూ తీసేదాకా దాని చెవులు పని చేస్తూనే ఉంటాయి. ఎప్పుడైతే మూడో కాలు కూడా తీస్తేస్తామో..అప్పుడు దాని చెవులు పనిచేయడం మాని, మనం చెప్పేది వినబడదు.." చెప్పాడు వెంగళ్రావు.

***

**పత్రికానాందం** — **యర్రంశెట్టి శాయి**

ఓ పెద్ద రాజకీయ సభకు హాజరయి తమ పత్రిక ఆఫీసుకు తిరిగి వచ్చాడు ఓ విలేఖరి.

"ఏమిటి సభ విశేషాలు? మహానాయకులంతా ఏమన్నారు?" ఆత్రుతగా అడిగాడు ఎడిటర్.

"నిజం చెప్పాలంటే విశేషాలేమీ లేవు. ఒక్క ముక్క కూడా మాట్లాడలేదెవ్వరూ" చెప్పాడు విలేఖరి.

"సరే! అలాగయితే ఒక పేజీ కంటే ఎక్కువ మేటర్ రాయకు" చెప్పాడు ఎడిటర్.

***

మార్క్‌ట్విన్ చాలా జబ్బుతో ఉన్నప్పుడు పొరబాటున ఓ న్యూస్ పేపర్లో చనిపోయినట్లు ప్రచురింపచేశారు. ఆ తరువాత తను పూర్తిగా కోలుకున్నాక పేపర్లో ఇలా ప్రచురించారాయన.

"మీ అందరికీ విచారం కలిగించేదేమిటంటే నేనింకా బ్రతికే వున్నాను.."

***

ఓ కమ్యూనిస్టు దేశంలో ఒక పత్రికా విలేఖరిని సెన్సార్ ఆఫీస్ వాళ్ళు పిలిచారు.

"అందరి విలేఖరుల్లోకి నువ్వు రాసిన వార్తల్లోనే పచ్చి అబద్ధాలున్నాయి.." అన్నాడు సెన్సారింగ్ అధికారి.

"పొరబాటయింది, ఇక ముందు అలా రాయను.." వినయంగా అన్నాడు విలేఖరి.

"పిచ్చివాడా! అదేం మాట! అలా రాసినందుకే నీకిప్పుడు ఛీఫ్ ఎడిటర్ గా ప్రమోషన్ ఇస్తున్నాను.." నవ్వుతూ అన్నాడా అధికారి.

***

రమణారావ్ ఆత్మహత్య చేసుకున్న విషయం ఓ పేపర్ ప్రచురించింది.

"ఆయన ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమీలేదు. ఎందుకంటే ఆయనకింకా వివాహం కాలేదు.."

***



ఓ ప్రముఖ దినపత్రిక ప్రతిరోజూ స్వర్గస్తులు అన్న శీర్షిక కింద ఆ రోజు దేశంలో చనిపోయిన ప్రముఖుల పేర్లు -వివరాలు ప్రచురిస్తుండేది. ఓ రోజు ఆ శీర్షిక కింద ఇలా రాసింది.

"ఈ రోజు ఎవ్వరూ చనిపోలేదని తెలియజేయడానికి చింతిస్తున్నాము."

***

ఓ పెద్ద మనిషి ఓ దినపత్రిక ఆఫీసులోకి రుద్రావతారం దాల్చి జొరబడ్డాడు.

"నేను చనిపోయినట్లు మీ ఇవాల్టి పత్రికలో అబద్ధం రాశారు. ఇది పొరబాటని రేపు పేపర్లో క్షమాపణ చెప్పకపోయారంటే, కోర్టుకీడ్చి పత్రిక మూయించేస్తాను.." అన్నాడు ఎడిటర్‌తో.

మర్నాడు ఆ పేపరులో ఇలా ప్రకటించారు.

"నిన్న చనిపోయారని మేము ప్రచురించిన ఫలానా పెద్ద మనిషి చనిపోలేదని తెలియజేయుటకు చింతిస్తున్నాము. పాఠకులకు కలిగిన ఈ అసౌకర్యానికి మన్నించవలసిందిగా కోరుతున్నాం.."

***

" ఈ నవల నేను మూడేళ్ళ క్రితం మీకు తిప్పి పంపించాను కదూ!?" కోపంగా అడిగాడు ఎడిటర్.

చౌ చౌ

"అవును" వప్పుకున్నాడు రచయిత.

"మళ్ళీ ఎందుకు తీసుకొచ్చారిప్పుడు?"

"ఈ మూడేళ్ళ లోనూ మీకు సాహిత్యపు విలువలు తెలిసుంటాయనుకున్నాను.." నొచ్చుకుంటూ అన్నాడు రచయిత.

***

పత్రికా విలేఖరులు ఆచార్య వినోభాభావేతో ఇంటర్వ్యూకి వెళ్ళారు.

సాధారణంగా ఇంటర్వ్యూలకి యిష్టపడని వినోభాభావే ఆ రోజు ఇంటర్వ్యూకి అంగీకరించి "అయితే నేను మీకు ఏభాషలో జవాబు చెప్పాలో మీరే చెప్పండి.." అనడిగారు. ఆయనకు చాలా భాషలు వచ్చు.

"మీ ఇష్టం..మీకేది ఉత్తమమయిన భాష అని తోస్తే అందులోనే మాట్లాడండి!" అన్నారు వాళ్ళు.

"అయితే నేను 'మౌనం' అత్యుత్తమయిన భాషగా భావిస్తాను అని మౌనంగా ఉండిపోయారాయన.

***

ఒక పెద్ద మనిషి బాపూగారితో..

"మీరు వారపత్రికలో సీరియల్స్‌కు బొమ్మలు గీస్తుంటారు కదా. ఒక్కో బొమ్మకు ఎంత తీసుకుంటారు?"

"వెయ్యిరూపాయలు.."

"అబ్బ.. ఒక్క బొమ్మ గీసినందుకు వెయ్యి రూపాయలా?" ఆశ్చర్యంగా అడిగాడు అతను.

"అబ్బే ! గీసినందుకు కాదు! ఆ సీరియల్ చదివినందుకు.."

***



ఒక పెద్ద పేరున్న రచయిత తన స్నేహితుడికి తన గురించి చెబుతున్నాడు.

"..తమాషా ఏమిటంటే - పదేళ్ళ తరువాత నాకు తెలిసొచ్చింది. నా కసలు రాయటం రాదనీ..నేను మంచి రచయితను కాలేననీ.."

"అప్పుడు మరి రచనలు చేయటం మానేశారా?" ఆతృతగా అడిగాడతని స్నేహితుడు.

"ఎలా మానటం? అప్పటికే నాకు మరీ పేరు ప్రఖ్యాతులు వచ్చేశాయి మరి..!"

***

జోగినాదం, సింగినాదం మిత్రులు. ఒక రోజు స్నాక్స్, బీరు బాటిళ్ళూ తీసుకుని ఎవరూ లేని కొండప్రాంతానికి వెళ్ళారు.

"అరే అన్నీ తెచ్చాం కానీ, బీరుబాటిళ్ళ మూత తీసేందుకు ఓపెనర్ను మర్చిపోయాం" అన్నాడు జోగినాదం.

"నేనిక్కడే ఉంటా..నువ్వెళ్ళి తీసుకురా.."

"లేదు నేను వెళితే నువ్వన్నీ తినేస్తావ్.."

"నువ్వొచ్చేదాకా ఏదీ ముట్టుకోను. నన్ను నమ్ము. త్వరగా వెళ్ళిరా.." అన్నాడు సింగినాదం.

జోగినాదం సిటీకి బయలు దేరాడు.

రోజంతా గడిచినా జోగినాదం జాడలేదు. చీకటి పడింది. తెల్లారింది. సింగినాదం ఎదురు చూసీ చూసీ ఆకలికి తట్టుకోలేక స్నాక్స్ పేకెట్లు చించి..తినబోగానే అప్పటిదాకా రాయి చాటున ఉన్న జోగినాదం ఒక్కసారిగా ఇవతలికి దూకాడు..

"నేను వెళ్ళగానే నువ్వు తింటావని నాకు తెలుసు..అందుకే ఇక్కడే కాపు కాశాను.." అంటూ సింగినాదం మీద మండి పడ్డాడు జోగినాదం.

***

"విడాకులు ఎందుకు తీసుకోవాలనుకుంటున్నారు?" భార్యా భర్తలని ఉద్దేశించి అడిగాడు జడ్జి.

"పెళ్లైన ఆరు వారాల్లో అన్నీ గొడవలే. ఆమె చెప్పింది నాకు నచ్చదు. నేను చెప్పింది ఆవిడకు నచ్చదు. ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం కుదరడం లేదు.." అన్నాడు భర్త.

"ఆయన చెబుతున్నది తప్పు. మా పెళ్ళై ఆరు వారాలు కాదు.. ఆరు వారాలపైన రెండు రోజులు.." కోపంగా అరిచింది భార్య.

***

ఛాయాదేవి: మా ఆయన రెజ్లింగ్ , బాక్సింగ్ అంటే పడి చస్తారు. 24 గంటలూ ఆ పోటీలే చూస్తారు.

సూర్యకాంతం: మరి నువ్వు సీరియళ్ళకోసం చానెల్స్ మారుస్తావు కదా అప్పుడేం చేస్తారు?

ఛాయాదేవి: వాషింగ్ మిషన్ లో రెండు షర్టులు వేసి , స్విచ్ ఆన్ చేసి అక్కడ కూర్చొంటారు..

***

ఇది రెండేళ్ళ క్రిందటి ముచ్చట..

అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ ఒక స్కూలు కెళ్ళారు. తాను మాట్లాడిన తర్వాత విద్యార్థులకు ఏమయినా సందేహాలుంటే అడగమన్నారు.

బాబ్ అనే అబ్బాయి లేచాడు.

"సార్.. నేను మిమ్మల్ని ఒక మూడు ప్రశ్నలు అడగాలనుకుంటున్నాను.. సమాధానాలు చెబుతారా?"

"ఓ ఎస్.." అని నవ్వారు బుష్

బాబ్ అడిగిన ప్రశ్నలు..

"1. ఐక్యరాజ్య సమితి అనుమతి లేకుండా ఇరాక్ పై అమెరికా ఎలా యుద్ధం ప్రకటించింది?

2. ఎన్నికల్లో కెర్రీకి ఎక్కువ ఓట్లు వచ్చినా మీరు ప్రెసిడెంట్ ఎలా అయ్యారు?

3. ఒసామా బిన్ లాడెన్ ఎలా అయ్యారు?"

అయిదు నిమిషాలు క్లాసులో నిశ్శబ్దం. ఇంతలో ఇంటర్ వెల్ బెల్ మోగింది. పిల్లలంతా పావుగంట సేపు ఆడుకోటానికి వెళ్ళిపోయారు.

ఆ తరువాత క్లాసు మొదలైంది.

మళ్ళీ జార్జి బుష్ క్లాసుకు వచ్చారు.

ఈ సారి మైకేల్ అనే విద్యార్థి లేచి "సార్! నేను ఓ అయిదు ప్రశ్నలడుగుతాను. సమాధానాలు చెబుతారా?" అన్నాడు.

సరే నన్నట్లు తలూపారు బుష్.

బాబ్ అడిగినవే మూడు ప్రశ్నలు అడిగాడు మైకేల్.

"4. ఇంటర్ వెల్ బెల్ మామూలు కంటే 20 నిమిషాలు ముందే ఎందుకు మోగింది?

5. బాబ్ ఏమయ్యాడు?

???

***

టీచర్: టెలిఫోన్ ని కనుక్కున్నది ఎవరు?

బుడుగు: అలెగ్జాండర్ గ్రాహెం బెల్

టీచర్: వెరీ గుడ్! మరి అతని అసిస్టెంట్ వాట్సన్ ఏం చేశాడు?

బుడుగు: టెలిఫోన్ బిల్లుల్ని కనుక్కుని అందరికీ పంపిస్తున్నాడు.

***

"ఇప్పుడు జరగబోయే పరీక్షల్లో ఎవరేనా మీ ఫ్రెండ్ పేపర్లో చూసి రాస్తే వాళ్ళ మార్కులు కోసేస్తాను.." అంది టీచర్.

కొంతసేపటికి బుడుగు , గిడుగు పేపర్లో చూసి రాస్తున్నాడు. అది చూసిన టీచర్ "ఎందుకు కాపీ కొడుతున్నావు?" కోపంగా అడిగింది టీచర్.

"అతను నా ఫ్రెండ్ కాదు టీచర్.."

***

డాక్టర్: ఆ పేషెంట్ నీతో మాట్లాడిన తర్వాత అలా వెనక్కి తిరిగి చూడకుండా పారిపోతున్నాడు.ఏం చెప్పావు?

నర్స్: రేపు ఆపరేషన్ అయిన తర్వాత ఏం చేస్తారు? అని అడిగాడు.

డాక్టర్: నువ్వేం చెప్పావు?

నర్స్: మీ బంధువులకి అప్పగిస్తాం అని చెప్పాను. పొరబాటుగా అర్థం చేసుకున్నట్లున్నాడు డాక్టర్..!

***




## తెలివిగల వాళ్ళు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

"తెలివయిన వాళ్ళని  క్లాసులో ముందు బెంచీలో, తెలివి తక్కువ వాళ్ళని  వెనక బెంచీలో కూర్చోబెడతారట కదా?"

ఏడో తరగతి టీచర్‌ని ప్రశ్నించాడు ఇన్స్‌పెక్షన్‌కి వచ్చిన డి.ఇ.ఒ.

"అవును సార్.. "జవాబిచ్చాడు టీచర్.

"ఎవరు తెలివి గలవాళ్ళో, ఎవరు తెలివి తక్కువవాళ్ళో ఎలా నిర్ణయిస్తారు?" అడిగాడు డి.ఇ.ఒ

"విద్యార్థుల తలిదండ్రులని ఓ ప్రశ్న అడుగుతాను. సరయిన సమాధానం ఇచ్చిన వాళ్ళ పిల్లలని ముందు వరుసలో కూర్చోమంటాను.."

"ఎలాంటి ప్రశ్నలు వేస్తారు?"

"ఉదాహరణకి కెప్టెన్ గౌడ్ ఓడలో మూడుసార్లు ప్రపంచం చుట్టూ ప్రయాణం చేసి ఒక ట్రిప్ లో మరణించాడు. అది ఎన్నో ట్రిప్‌లో జరిగింది? తేలిక కాబట్టి మీరూ కూడా జవాబు చెప్పగలిగే ప్రశ్న ఇది.." అన్నాడు టీచర్.

"నాకీ హిస్టరీ గురించి పెద్దగా తెలీదు. ఇంకో ప్రశ్నేదైనా అడుగు.."

## పేకజోకీయం

యర్రంశెట్టి శాయి

రోజూ సాయంత్రం పేకాట కెళ్ళిపోయే ప్రకాశ్‌రావ్ మీద వాళ్ళావిడ విరుచుకు పడింది.

"పెళ్ళయి పదిహేనేళ్ళవుతోంది. ఏనాడైనా సాయంత్రం ఇంట్లో గడిపి అఘోరించారా? ఆ పక్కింటాయనను చూడండి. ఒక్కరోజయినా యిల్లు వదలగా నేను చూళ్ళేదు. దాన్నే అసలయిన ప్రేమంటారు.."

"వాళ్ళ డాక్టరు పక్షవాతం పక్షవాతం అంటాడేం మరి?" ***

శంకర్రావ్ పొద్దున్నే విశ్వనాథం గారింటికొచ్చాడు.

"కంగ్రాచ్యులేషన్స్ గురూజీ! మొన్న బొంబాయి రేసుల్లో లక్షరూపాయలు కొట్టారటగా?"

"అందులో పూర్తినిజం లేదులే. నిజం చెప్పాలంటే అది మద్రాసు రేసు, బొంబాయి కాదు.." అన్నాడు విశ్వనాథం చిరునవ్వుతో.



"ఎక్కడయితేనేం లెండి! లక్ష కొట్టారుగా?"

"లక్ష రూపాయలు కాదు - పదివేలే!"

"అయిన ఫర్లేదు లెండి. అదీ తక్కువేం కాదుగా?"

"నిజం చెప్పాలంటే ఆ పదివేలూ నేను గెలవలేదు. ఓడిపోయాను" అన్నాడు విశ్వనాథం లేచి నిలబడుతూ.

***

నాగరాజు ఓ ఎమ్యూజ్మెంట్ పార్క్ కెళ్ళాడు. అక్కడ ఓ బోర్డుముందు నిలబడి జూదం ఆడబోతుంటే ఓ గొంతు అతని చెవిలో వినబడింది.

"ఒరే నాగరాజు, నేను నీ ఫ్రెండ్ పరాత్పరరావ్ ఆత్మను . నువ్వుఓ వంద రూపాయలు ఆ పచ్చరంగు మీద ఆడు.." అంద గొంతు.

నాగరాజు వందరూపాయలు కాశాడు. దాంతో వెయ్యిరూపాయలు వచ్చిందతనికి.



"ఈ సారి ఎరుపుమీద ఆడు" అంది పరాత్పరరావు ఆత్మ.

దాంతో పదివేల రూపాయలు వచ్చిందతనికి.

"ఈసారి బ్లూ రంగు మిద కాశెయ్..." అంది గొంతు.

లక్షరూపాయలు వచ్చింది నాగరాజుకి.

"ఇప్పుడు దేనిమీద కాయమంటావ్..?" అడిగాడతను.

"తెలుపు.." అంది గొంతు.

అంతే! ..అంతా మట్టిగొట్టుకుపోయింది.!

"అరరే!! నాకు ఇలాగే ఆఖర్లో తంతేనే..వళ్ళు మండి ఆత్మహత్య చేసుకున్నాను.." అంది గొంతు.

***

ఎప్పుడూ పేకాటలోనే మునిగి తేలుతున్న భర్తమీద వళ్ళుమండి పోతోంది సుభద్రమ్మకి.

"ఆది వారం వచ్చిందంటే చాలు పేకాట.! ఇదేం మనిషో ఇదేం లోకమో..భార్యంటే ముచ్చటలేదు. పిల్లలంటే ప్రేమలేదు. మీరు ఒక్క ఆదివారం ఇంట్లో గడపండి చూద్దాం. నేను ఆశ్చర్యంతో చచ్చి ఊరుకుంటాను.." కోపంగ అందావిడ.

"ఇదిగో..ఊరికే అలా ఆశలు పెట్టవద్దు.." చిరాగ్గా అన్నాడామె భర్త.

***

ఇద్దరు కలసి ఒక వ్యాపారం ప్రారంభించారు.

ఓ రోజు ఇద్దరూ ఆఫీసు మూసేశాక క్లబ్ కెళ్ళి పేకాటలో పడ్డారు. హఠాత్తుగా ఒకతనికి ఆఫీసులో ఇనప్పెట్టె తాళం వేయలేదన్న సంగతి గుర్తు కొచ్చింది.

"కొంపమునిగింది గురూ! ఇనప్పెట్టె తాళం వేయడం మర్చి పోయాను..." అన్నాడతను ఒకతను ఆందోళనగా.

"వేయక పోతేనేం? మనిద్దరం ఇక్కడే ఉన్నంగా!" తేలికగా అన్నాడు రెండో వాడు.

***

## చౌ చౌ

ఉద్యోగానికి అప్లికేషన్ ఫారం పూరిస్తున్నాడు సి.వి.సత్యమూర్తి.

"ఇంతకు ముందెప్పుడైనా అరెస్ట్ చేయబడ్డారా" అన్న ప్రశ్నకు `లేదు` అని రాశాడతను.

"ఎందుకని?" అన్న ప్రశ్నకు ఓ క్షణం ఆలోచించి `అసలు దొరుకుతే గదా!` అని రాశాడతను.

***

ఓ సీనియర్ ఆఫీసర్ జూనియర్ ఆఫీసర్ని పిలిపించాడు తనగదిలోకి.

"ఏంటీ రిపోర్టునిండా తప్పులు?" కోపంగా అడిగాడు సీనియర్.

"ఏం చెయ్యను సార్? నా కింద నలుగురు పనికిరాని వాజమ్మలు పనిచేస్తున్నారు.."

"సంతోషించవయ్యా! నాకింద అయిదుగురు పనికిరాని వాళ్ళు పని చేస్తున్నారు.."

***

జడ్జి: ఏమయ్యా చెప్పు ఎందుకు చేశావీ రేప్? నిజం చెబితే శిక్ష తగ్గిస్తాను..

కామాంధరావ్: సార్..రేప్ ఎందుకు చేస్తారో మీకు తెలీకనే అడుగుతున్నారంటే నేను నమ్మను సార్.

***

ఉన్నట్టుండి వర్షం జోరందుకుంది. మూర్తి అటూ ఇటూ చూశాడు. కాస్త దూరంలో ఒక వ్యక్తి గొడుగు తో కనిపించాడు. అతని వైపు పరుగు తీశాడు మూర్తి. ఇది గమనించిన ఆ గొడుగు వ్యక్తి తనూ పరుగు లంకించుకున్నాడు. ఏలాగైతే ఐదునిమిషాలకు గొడుగు వ్యక్తిని చేరుకున్నాడు మూర్తి..

"సారీ సర్..ఈ గొడుగు మీదైతే మీరే తీసేసుకోండి.." అంటూ గొడుగుని మూర్తి చేతిలో పెట్టేసి పరుగు

లంకించుకున్నాడు ఆ వ్యక్తి..!

***

"నాన్నా..నాకొ కటి కొనిపెడతావా?" బుడుగు అడిగాడు,

"ఏమిట్రా అది..?"

" సన్నాయి వాయిద్యం కావాలి నాన్నా.."

"ఒద్దురా బాబూ..అది నువ్వు వాయించావంటే మాకు నిద్రపట్టదు.."

"కాదు నాన్నా..మీరు నిద్ర పోయాకే వాయిస్తాను కదా.."

***

"బుడుగూ..మీ నాన్న గారి వయసెంత?"

"నావయసెంతో మా నాన్న గారి వయసూ అంతే.."

"అదెలాగ?"

"అవును మరి నేను పుట్టాకే కదా ఆయన నాన్న అయింది.."

***

"పెళ్ళికి అంతమంది మిత్రుల్ని ఎందుకు పిలుస్తారో తెలుసు.."

"తెలుసు..జీవితంలో అత్యంత విషాదకరమైన సందర్భాల్లో పక్కన ఉండే వాళ్ళే నిజమైన మిత్రులు.."

***

భార్యాభర్తలు పంటిడాక్టర్ దగ్గరకొచ్చారు.

"మత్తు మందు అవసరంలేకుండానే పన్ను పీకెయ్యొచ్చు సార్.." అన్నాడతను.

"ఓ..అంత ధైర్యముందా మీకు..?"

"పన్ను పీకాల్సింది నాకు కాదండీ..మా ఆవిడకి..!"

***

"ఒరే బుడుగూ.. ఇవి ఎన్ని వేళ్ళు.." టీచర్ అడిగాడు రెండు చేతులకున్న వాళ్ళనీ నిలువుగా చూపిస్తూ..

"పది వేళ్ళు సార్.." బుడుగు వినయంగా చెప్పాడు.

"ఇందులోంచి ఐదు వేళ్ళు వేళ్ళు తీసేస్తే ఏమౌతుంది?"

"ఒక మొండి చెయ్యి, ఇంకో ఐదువేళ్ళు సార్.."

***

"టీచర్..మా బుడుగు పరీక్షలు ఎలా రాశాడండీ.."

"బాగానే రాసినట్టున్నాడండీ.. ఫలితాలు వచ్చిన రోజు ఖచ్చితంగా చరిత్రలో నిలిచిపోయే అవకాశముంది.."

"అంత బాగా రాశాడాండీ..!?"

"ఔను..బహుశా మాథ్స్‌లోనూ, సైన్సులోనూ కూడా నిలిచిపోయే అవకాశముంది.."

***




## వేట

మల్లాది వెంకట కృష్ణమూర్తి

**వీరేంద్రని ఆఖరుసారిగా అడిగింది భార్య...**

"అయితే మీరు వెళ్ళక తప్పదా?"

"తప్పదు. ఫ్రెండ్స్ అంతా కలిసి ముందే ఈ ప్రోగ్రామ్ వేసుకున్నాం. పైగా ఇంకెవరికీ కార్లు లేవు. అంతా నా కారులోనే వెళ్ళాలి. నేను ఇప్పుడు మానేస్తే వాళ్ళు డిజప్పాయింట్ అవుతారు"

"అసలు మీకు ఈ వేట పిచ్చి కొత్తగా ఎందుకు పుట్టాలి, నా ఖర్మ కాకపోతే" బాధగా వాపోయింది శ్రీమతి వీరేంద్ర.

"శనాదివారాలేగా..సోమవారం ఉదయానికల్లా ఇంట్లో వుంటాను..క్రిందటి సారిలా ఏ కుందేలునో, దుప్పినో కొట్టుకు వస్తాను. చూస్తూండు.."

"డాడీ! పులిని తీసుకురా" ఉత్సాహంగా అడిగాడు పుత్రరత్నం.

"పులిని వేటాడితే జైల్లో పెడతారు"

వీరేంద్ర భార్య , భర్త బట్టలు లైసెన్సుగల తుపాకిని సూట్‌కేసులో సర్దింది.

"మీ ఫ్రెండ్స్ కెవరికీ తుపాకుల్లేవు, అయినా మీ వెంట ఎందుకు వస్తున్నారు?" అడిగింది ఆవిడ బయలుదేరుతున్న భర్తని.

"ఎందుకంటే చూడడానికి.."

భర్త కారులో బయలుదేరిన మర్నాడు ఉదయం వీరేంద్ర భార్య అతని ఫ్రెండ్స్ ఇళ్ళకి ఫోన్ చేసింది. ఆవిడ

ఊహించినట్లుగానే జవాబు వచ్చింది. వాళ్ళెవరూ వీరేంద్ర వెంట వెళ్ళలేదు. వీరేంద్రకారు నిజానికి అతని గర్ల్‌ఫ్రెండ్ ఇంటి ముందు ఆగి ఉంది. ఆ రాత్రంతా, మర్నాడు రాత్రి కూడ.

సోమవారం ఉదయం వీరేంద్ర కారు వచ్చింది. హారన్ విని అతని భార్యగేటు తెరిచింది.

కారు దిగి పారదర్శకమైన ప్లాస్టిక్ బేగ్ లోని కుందేళ్ళని రెంటిని భార్యకి చూపించి గర్వంతో చెప్పాడు వీరేంద్ర-

"చూశావటోయ్! నాలుగు రాళ్ళు ఖర్చయినా, రెండు కుందేళ్ళని వేటాడి తెచ్చాను.."

వీరేంద్ర జుట్టుపట్టుకుని అతని తలని ఎత్తి, అపరకాళికలా చూస్తూ అడిగింది అతని భార్య.

"అలాగా! అసలు నేను తుపాకితో పాటు తుపాకి గుళ్ళు పెట్టకపోయినా అవి మీకు ఎక్కడినుంచీ వచ్చాయి?"

వెంటనే వీరేంద్ర కలవరపడ్డాడు..!

తర్వాత సీన్ మీరే ఊహించుకోండి. ***

## దాంపత్యం జోకులు — యర్రంశెట్టి శాయి

**రామచంద్రరావు గారు,** ఆయన భార్య బంగారమ్మా కలిసి వెళ్ళారు. అక్కడి హోటల్లో దిగినవాళ్ళు జలక్రీడలాడేందుకు ఒక స్విమ్మింగ్ పూల్ ఉంది. బేతింగ్ సూట్ తెచ్చుకోవడం మర్చిపోయిన ఆడకూతుళ్ళకోసం ఆ హోటల్ మేనేజ్ మెంట్ వారు పేపర్ తో తయారు చేసిన బేతింగ్ సూట్ ఇస్తారని తెలిసింది రామచంద్రరావు గారికి.

వెంటనే డ్రెస్ చేసుకుని "ఇప్పుడే అలా హోటల్ ఆవరణలోకి వెళ్ళివస్తాను.." అన్నారు బంగారమ్మతో.

"ఎక్కడికి?" అనుమానంగా అడిగింది బంగారమ్మ.

"అలా కిందికి వెళ్ళి పేపర్లో ఇవాళ ఏమేం ఉన్నాయో చూసొస్తానే.." అన్నారాయన గుంభనగా నవ్వుతూ.

***

**సిటీకి దూరంలో** ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్న లక్ష్మణరావు ఒక రోజు రాత్రి ఎనిమిదయినా ఇంటికి రాకపోయేసరికి భార్యకి కంగారు పుట్టింది.

వెంటనే అతని ప్రాణ స్నేహితులిద్దరికీ "మా ఆయన ఇంతవరకూ ఇల్లు చేరలేదు. ఒక వేళ మీ ఇంట్లో ఉన్నారా?" అంటూ ఎస్.ఎమ్.ఎస్ లు ఇచ్చింది.

వెనుకే లక్ష్మణరావు వచ్చేశాడు. "బస్సు మిస్సయిపోవడం వల్ల ఆలశ్యమయింది.." అని చెప్పాడు.

భోజనాలు ముగించి ఇద్దరూ నిద్రపోదామనుకుంటున్నప్పుడు రెండు ఎస్.ఎమ్.ఎస్ లు వచ్చాయి. రెండింటిలోనూ " మీ ఆయన మాఇంట్లోనే విన్నాడు. ఈ రాత్రి ఇక్కడే ఉండి రేపు ఉదయం ఇంటికొస్తాడు..!" అనిఉంది.

***

"ఆ మధ్య మా ఆవిడ కంట్లో ఓ నలకపడింది. డాక్టర్ దగ్గరకి తీసుకెళ్తే ఐదొందలు ఖర్చయింది.."

"ఓస్ ఇంతే కదా! మా ఆవిడ కంట్లో ఓ చీరపడింది. అది తీయడానికి ఐదు వేలు ఖర్చయింది.."

***

భార్యంటే వణికి పోయే రామ్మూర్తిగారు ఒక రోజు రైలు స్టేషన్‌కి వెళ్ళి తన స్నేహితుడికి సెండాఫ్ యిచ్చి వస్తూ ఆ పక్కనే ఉన్న వెయిటింగ్ మెషీన్ మీద తన తూకం తూచుకోవాలని ముచ్చటపడ్డాడు. మిషన్ మీద నిలబడి రూపాయి నాణెం వేశాడందులో, టికెట్ బయటికొచ్చింది.

సరిగ్గా 70 కిలోలు చూపుతోందది. వెనకకు తిప్పి చూస్తే టికెట్ మీద "ఇప్పుడు ఈ రూపాయి ఖర్చుకి మీ ఆవిడకేమని లెక్క చెప్తావూ?" అని రాసి ఉంది!

***

"నువ్వు జీవితంలో మరువలేని రోజేమిట్రా శ్రీకంఠం?" బార్‌లో కూర్చుని అడిగాడు పద్మనాభం.

" మా ఆవిడని మొట్టమొదటి సారిగా కలుసుకున్న రోజు.." అన్నాడు శ్రీకంఠం.

"ఆశ్చర్యం! నేనూ అంతే! ఎంత ప్రయత్నించినా తాగినా మర్చిపోవడం కుదిరిచావడం లేదా రోజుని.." విచారంగా అన్నాడు పద్మనాభం.

***

"ఏమిట్రోయ్ - నీ చెంపమీద అయిదేళ్ళూ తేలినయ్ - ఎవరివి?" అడిగాడు శంకరం.

"మా ఆవిడవి!' అన్నాడు రామానుజం.

"అదేమిటి? ఎందుకలా చేసింది?"

"పెళ్ళయ్యాక కౌగలించుకున్నందుకు!"

"అదేమిటి? అందులో తప్పేముంది?"

"కాని పెళ్ళయిన రెండేళ్ళ తర్వాత కదా..నేనా పని చేసింది!?" చిరాగ్గా చెప్పాడు రామానుజం.

***

శారదమ్మ పక్కింటి రాధతో తనగోడు చెప్తోంది.

"ఆయనెంత దుర్మార్గంగా ఉంటున్నారో నేను చెప్పలేను రాధమ్మా! నన్నెంత చిత్రవధ చేస్తున్నారంటే ఈ ఆరు నెలల్లో నా బరువు పదికిలోలు తగ్గిపోయింది.." కన్నీళ్ళతో అంది శారదమ్మ.

రాధమ్మ తెగ జాలిపడిపోయింది.

"అలాంటి మొగుడు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే! అతన్ని వదిలేసి మీ దారిన మీరు హాయిగా ఉండరాదూ?" అంది ప్రేమగా.

"అదెలానో చేస్తాను కానీ నేనింకో పదికిలోలు బరువు తగ్గిపోతే! అందంగా స్లిమ్‌గా వుంటాను కద అని ఎదురుచూస్తున్నాను-" సిగ్గు పడుతూ అంది శారదమ్మ.

***

# చౌ చౌ

"అబ్బా..రాత్రి రైల్లో ప్రయాణంలో విపరీతంగా కళ్ళు తిరిగాయోయ్.."

"అయ్యో అదేమిటీ?"

"నేను కూర్చున్న సీటు రైలు ప్రయాణించే దిక్కుకి ఎదురుగా ఉంది..అలా ఎక్కువసేపు చూస్తుండే సరికి కళ్ళు తిరిగాయి.."

"అయ్యో పాపం..ఎదుటి సీట్లో ప్రయాణికుడితో మాట్లాడి సీట్లు మార్చుకోకపోయారా?"

"అనుకున్నా.. ఐతే ఎదుటి సీట్లో ఎవరూ లేరు. ఇంకెవరితో సీటు మార్చుకోవాలో తెలీలేదు..'

***

ఎబిసి బ్రదర్స్ క్లాత్ ఎంపోరియమ్ వాళ్ళు దసరా సందర్భంగా 80 శాతం డిస్కౌంట్ ప్రకటించారు. తెల్లవారు ఝామునుంచే జనాలు క్యూ కట్టారు. చిదంబరం క్యూలో వెళ్ళకుండా పక్కనుంచీ ముందుకి వెళ్ళబోయాడు. జనాలు అరుస్తూ అతన్ని వెనక్కి తోసేశారు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా చిదంబరం మళ్ళీ ముందుకి వెళ్ళడానికి ప్రయత్నించాడు. మళ్ళీ తిట్లూ..తోపులాటలూ..! ముచ్చటగా మూడో సారి దూసుకు వెళ్ళబోయాడు చిదంబరం....ఊఁహు.. కుదరలేదు..

"ఇదిగో ఇలా ఐతే షాపు తెరవనంతే.." బిగ్గరగా అరిచాడు చిదంబరం..!

***

"చమన లాల్ నగలదుకాణంలోనే ఎందుకు దొంగతనం చేశావు?"

"ఇందులో నా తప్పేమీ లేదండీ.."

"దొంగతనం చేసింది కాకుండా తప్పేమీ లేదంటావా?"

"అవును జడ్జిగారూ.. చమన్ లాల్ షాపు బయట 'అనుకూలమైన ఈ దసరా సమయాన్ని వినియోగించుకోండి..' అని ఉందిసార్.. అవకాశాన్ని వినియోగించుకోమని వాళ్ళే అంటున్నప్పుడు వృధా చెయ్యకూడదు కదండీ. అందుకే .." నసిగాడు గజదొంగ గంగులు..!

***

ఇంకో దొంగతనం కేసులో గంగులుని అరెస్ట్ చేశారు. నేరం ఋజువయ్యాక రెండేళ్ళు జైలు శిక్ష వేశారు కోర్టువారు.

"ఇది న్యాయం కాదు సార్.."

"ఏది న్యాయం కాదు. దొంగతనం ఋజువయ్యాక కూడా.."

"అదికాదండీ.. ఏదో ఒక్క కుడిచెయ్యి చేసిన నేరానికి నా శరీరం అంతటికీ శిక్ష విధించడం ఏం సబబు సార్?"

"ఓహో..అలానా ఐతే నీ ఒక్కచేతికే శిక్ష వేస్తాను. మరైతే జైలుకి మొత్తం శరీరాన్ని తెచ్చుకుంటావో లేదో నువ్వే నిర్ణయించుకో.." జడ్జిగారు పరిహాసంతో కూడిన ధీమాతో అన్నారు,

అంతే..! గంగులు తన కృత్రిమ చేతిని ఊడదీసి జడ్జిగారు టేబిల్ మీద పెట్టి మారు మాట్లాడకుండా బయటికి వచ్చేశాడు..!

***

**సముద్రంలో** ప్రయాణిస్తున్న ఓడ ప్రమాదానికి గురయ్యింది. పరిస్థితి గందరగోళంగా ఉంది. ప్రయాణీకులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. మన గుర్నాధం మాత్రం చిన్నప్పుడు వాళ్ళ వూరి కాలువలో నేర్చుకున్న ఈత ని తలచుకుని ఈదుకుంటూ ఒడ్డుకి వెళ్ళిపోదామనుకున్నాడు.

"కెప్టెన్ గారూ..ఇక్కడికి నేల ఎంత దూరంలో ఉంది..?"

"రెండు కిలోమీటర్లు.."

"ఓస్ ఇంతేనా..నేను ఈదుకుంటూ వెళ్ళిపోతాను..ఇంతకీ నేల ఎటువైపు ఉందో చెబుతారా..?"

"ఇక్కడ.. కిందవైపు..సముద్రం లోపల!!"

***

**"ఏమోయ్ గుర్నాధం..**ఈ సంవత్సరమే మీ పెళ్ళి సిల్వర్ జూబిలీ కదా..ఏం చేస్తున్నారు?"

" మా ఆవిడా నేనూ కలిసి సింగపూర్ వెళుతున్నాం.."

"ఓహ్.. ఎంత గొప్ప ప్లానింగో.. మరి గుర్నాధం.వచ్చే సంవత్సరం ఎక్కడికి వెళతారు?"

"వచ్చేసంవత్సరం కూడా సింగపూరే..!"

"అదేమిటీ?"

"మరి మా ఆవిడని వెనక్కి తెచ్చుకోవాలి కదా!"

గుర్నాధం అసలు విషయం బయటపెట్టాడు..!

***




**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## తెలివి ఒక్కరి సొత్తంటే

ఓ కాన్ఫరెన్సుకి హాజరవడానికి ముగ్గురు ఇంజినీర్లు, ముగ్గురు అకౌంటెంట్లు వెళుతున్నారు. ముగ్గురు అకౌంటెంట్లు తమ ముగ్గురికి టిక్కెట్లు కొన్నారు కానీ ముగ్గురు ఇంజినీర్లు కలిపి ఒకే టిక్కెట్టు కొనడం చూసి ఆశ్చర్యపోయిన అకౌంటెంట్లు అడిగారు, ఒకే టికెట్ మీద ముగ్గురెలా ప్రయాణం చెయ్యగలరని.

"మీ అకౌంటెంట్లకి ఇంజినీరింగ్ బుర్ర అర్థంకాదు కాని, జరిగేది చూస్తుండండి" వాళ్ళలో ఒకడు దురుసుగా జవాబిచ్చాడు.

రైల్లో అంతా తమ తమ స్థానాల్లో కూర్చున్నారు. కొద్ది సేపటికి ఆ కంపార్ట్‌మెంట్లోకి టిక్కెట్లు చెక్ చెయ్యడానికి టి.సి రాగానే ఇంజినీర్లు ముగ్గురూ లేచి బాత్ రూమ్ లోకి వెళ్ళి తలుపు గడియపెట్టుకున్నారు.

అకౌంటెంట్ల టిక్కెట్లు చెక్ చేశాక టి.సి బాత్ రూమ్ తలుపు నెట్టి చూసి లోపల ఎవరో ఉన్నారని గ్రహించి తలుపును తడుతూ గట్టిగా అడిగాడు

"టికెట్ ప్లీజ్.."

బాత్ రూమ్ తలుపు చెయ్యి పట్టేంతమేర తెరుచుకుంది, లోపలి నుంచి వచ్చిన చేతిలోని టిక్కెట్ని చూసి తృప్తిపడి ముందుకివెళ్ళిపోయాడు టి.సి.

ఇంజినీర్లు వచ్చి తమ సీట్లో కూర్చున్నాక అడిగారు అకౌంటెంట్లని

"తెలివి మా సొత్తు కదా?"

"అవును" అంగీకరించారు అకౌంటెంట్లు.

కాసేపు ఆ ముగ్గురు అకౌంటెంట్లు ఆ విషయం మీద రహస్యంగా చర్చించుకున్నారు. కాన్ఫరెన్సు అయ్యాక అకౌంటెంట్లు రెండు టిక్కెట్లనే కొనడం గమనించారు ఇంజినీర్లు.

"ఇదేమిటి మూడో వాడికి టికెట్ కొనరే..?" అడిగారు వాళ్ళు.

"తెలివి ఒక్కరి సొత్తుకాదు.. జరిగేది మీరే చూస్తుండండి.." జవాబు చెప్పారు అకౌంటెంట్స్.

ఎప్పటిలా ఇంజీర్లు ముగ్గురూ కలిపి ఒక్కటే టికెట్ కొన్నారు. అంతా రైల్లోకి ఎక్కారు. కొద్దిసేపటికి టి.సి తమ కంపార్ట్‌మెంట్లోకి రావడం గమనించిన ఇంజినీర్లు ఎప్పటిలానే బాత్రూమ్ లోకి వెళ్ళి తలుపేసుకున్నారు. కొద్ది సేపటికి ఒక అకౌంటెంట్ లేచి వెళ్ళి బాత్ రూమ్ తలుపు తట్టి

"టికెట్ ప్లీజ్.." అన్నాడు.

బాత్రూమ్ తలుపు కొద్దిగా తెరుచుకుని అందులోంచి ఓ చేయి టిక్కెట్‌తో బయటికి వచ్చింది. అకౌంటెంట్ టిక్కెట్ ని తీసుకుని గప్‌చిప్‌గా వచ్చి తన సీట్లో కూర్చున్నాడు..!! ***

## భార్యాభర్తల భాగోతం

**యర్రంశెట్టి శాయి**

**ఆ భార్యా భర్తలిద్దరికీ సహజంగానే** పెద్ద ఎత్తున వివాదం చెలరేగింది.

"ఇదిగో సీతా, మనకి పోట్లాట ఎందుకు? ఇంక నుంచీ అన్నీ అర్థం ఉన్న మాటలే మాట్లాడుకుందాం..సరేనా?" అన్నాడు భర్త.

"అమ్మా ఆశే అలా ఐతే నన్ను తేలిగ్గా గెలిచెయ్యవచ్చని మీ ఆలోచన కదూ?" తెలివిగా అంది భార్య.

***

"నిన్న తెల్లవారు ఝామున అయిదింటికి మీ ఇల్లు చేరుకున్నావ్ కదా. మీ ఆవిడ గొడవ చేసిందా?" అడిగాడు కె.కె.రావు.



"అసలు వచ్చింది నేనని తెలిస్తే కదా. దానికి మెలకువరాకుండా బట్టలు మార్చుకుని పడుకోబోతుంటే కొంచెం అలికిడి అయి మెలకువ వచ్చింది. ఎవరది? టైగర్..నువ్వేనా? అంటూ మా కుక్క అనుకుని అడిగింది.."

"మరి నువ్వేం చేశావప్పుడు?"

"ఎలాగూ కుక్కనే అనుకుంటోంది కదా అని ఆమె చేతి వేళ్ళు నాకి పడుకుండిపోయాను.."

***

**"మగాడు** చెప్పిందల్లా 'కాదు' అనడమే మీ ఆడాళ్ళ అలవాటు! అవునా కాదా?" చిరాగ్గా అన్నాడు భర్తా రావు.

"కాదు!" అంది భార్యమణి ఖండితంగా.

***

**ఒకావిడ** సరాసరి ఆఫీస్‌కొచ్చి రివిగా ఆఫీసర్ గదిలోకి వెళ్ళబోతుంటే సెక్రటరీ అడ్డుపడ్డాడు.

"అలా వెళ్ళకూడదండీ. ఆయన అనుమతి తీసుకోవాలి ముందుగా" అంటూ అందుకోసం తను లోపలికి వెళ్ళాడు.

"సార్..మీ కోసం ఒకావిడ వచ్చారు.. పంపమంటారా?"

"ఎలా వుంది? అందంగా వుందా?"

"చాలా అందంగా వున్నారండీ.."

"అయితే లోపలికి పంపు వెంటనే"

ఆ స్త్రీ లోపలికెళ్ళి ఓ నిమిషం ఆఫీసరుతో మాట్లాడి వెళ్ళిపోయింది. వెంటనే ఆఫీసరు సెక్రటరీని కోపంగా పిలిచాడు.
"నీ అభిరుచి తగలెయ్యా. ఆమె నీ కంటికి అంత అందంగా కనిపించిందా?" అన్నాడు మండిపడుతూ.
"నిజం చెప్పాలంటే అందంగా లేదు కానీ, ఆవిడ మీ భార్యగారేమో అనుకుని అలా చెప్పానండీ.."
"ఏడ్చినట్లుంది..ఇప్పుడు కాదని ఎవరన్నారు..?"

***

**లిఫ్ట్** కిక్కిరిసి పోయింది. భార్యతోపాటు నిలబడ్డ కృష్ణారావుకి అవతలపక్క అందమైన వయ్యారి భామ ఆనుకుని నిలబడాల్సి వచ్చింది. కృష్ణారావు అదే అదననుకుని ఆ వయ్యారి భామ వేపు మరింత ఒదిగి నిలబడడం అతని భార్యకు వళ్ళుమండేలా చేసింది. లిఫ్ట్ కింద ఆగగానే ఆ వయ్యారి భామ కృష్ణారావు చెంపమీద ఫటేల్‌మని కొట్టింది.



"ఈ దెబ్బ ఎందుకో తెలుసా? లిఫ్ట్‌లో నన్ను కాలు మీద గిల్లినందుకు.." అనేసి వెళ్ళిపోయిందామె.
కృష్ణారావు ఆశ్చర్యపోయాడు. "అదేమిటి అలా అంటుంది - నేనెక్కడ గిల్లనామెని?"అన్నాడు భార్యతో.
"మీరు గిల్లలేదని తెలుసులే పదండి..నేను గిల్లాను, మీకు బుద్ధిరావాలని.." అందామె.!

***

## చా..చా ఏరుకొచ్చిన నవ్వులు

**జంబులింగం** మార్కెట్ నుంచి ఇంటికి వెళుతూ ఒకతన్ని లిఫ్ట్ అడిగాడు. ఆ స్కూటర్ అతను ఆపి, జంబులింగాన్ని ఎక్కించుకున్నాడు. జంబులింగం బరువైన కూరల సంచీని నెత్తిమీద పెట్టుకునే కూర్చున్నాడు.
"అలా ఎందుకండీ.. సంచీని కూడా సీట్ మీద పెట్టెయ్యండి.." అన్నాడు స్కూటర్ అతను.
"అయ్యో ఎందుకండీ..అసలే నా బరువు మోస్తోంది మీ స్కూటర్. పైగా ఈ కూరల సంచీ బరువుకూడా ఎందుకు సీటు మీద!" సవినయంగా సెలవిచ్చాడు జంబులింగం.

***

"**అవునూ**..నీకు మీ వారి మీద కోపం వచ్చినప్పుడు ఏం చేస్తావ్?"
"టాయిలెట్ కడుగుతాను.." జంబులింగం భార్య జవాబు చెప్పింది.
"నిజంగానా? విచిత్రంగా ఉందే..టాయిలెట్ కడిగితే మీ వారిమీద కోపం తగ్గుతుందా!?"
"మామూలుగా ఐతే ఏమో కానీ..నేను టాయిలెట్ కడిగేది, మా వారి టూత్ బ్రష్ తో కదా..!"

***

" డాడీ..స్పోర్ట్స్ షూస్ వేసుకుంటూన్నావ్..ఏం గేమ్ ఆడడానికి వెళుతున్నావ్.." జంబులింగం కొడుకు అడిగాడు.
"పక్కింటి అంకుల్ తో చెస్ ఆడడానికి.."

***

"ఆ అమ్మాయికి చెవుడు అనుకుంటాౖనా.."
"ఏమి అందుకలా అనిపించింది?"
"నేను 'ఐ లవ్ యు' అంటుంటే 'నా చెప్పులు కొత్తవే తెలుసా' అని పొంతనలేని సమాధానం చెబుతోంది"!

***

**జంబులింగానికి** బ్యాంక్ మేనేజర్గా ప్రమోషన్ వచ్చింది. బిజినెస్ బాగా పెంచితే కమీషన్ వస్తుందని చెప్పారు. జంబులింగానికి సరికొత్త ఆలోచన వచ్చింది. కొత్త ఉద్యోగాల కోసం ప్రకటన తయారు చేయించాడు.
"20 సంవత్సరాల వయసుగల అమ్మాయిలు, 40 సంవత్సరాల వయసుగల మగవాళ్ళు ..బ్యాంకు ఉద్యోగాలకి కావలెను" అని.
అది చదివిన అసిస్టెంట్ మేనేజర్కి అనుమానం వచ్చింది.
"సార్..ఇదేదో కొత్త రకంగా ఉంది. దీనిలోని లాజిక్ ఏమిటో తెలీడం లేదు.." అన్నాడు.
"పిచ్చి వాడా బ్యాంక్ బిజినెస్ పెరగాలంటే తెలివి తేటలు కావాలోయ్. 20ఏళ్ళ అమ్మాయిల్ని డిపాజిట్ కౌంటర్ లో పెడతాం. నలభై ఏళ్ళ మగవాళ్ళని విత్ డ్రాయల్ కౌంటర్ లో పెడతాం..ఎలా వుంది ఐడియా!?"

***

**నయాగరా** జలపాతన్ని చూపించడానికి వెళ్ళిన గైడ్ టూరిస్టులకి చెబుతున్నాడు..
"ఇప్పుడు మీరు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నయాగరా జలపాతాన్ని చూస్తున్నారు. ఇది ప్రపంచంలో కెల్లా ఎత్తైన జలపాతం. ఇటు అమెరికా నుంచీ అటు కెనడా నుంచీ కూడా చూడొచ్చు. ఇంకో విశేషమేమిటంటే పాతిక సూపర్ సోనిక్ విమానాల శబ్దం కూడా ఈ జలపాతం హోరు ముందు దిగదుడుపే. అమ్మా...వెనకాల కబుర్లు చెప్పుకునే ఆడవాళ్ళూ..మీరు కొంచెం నిశ్శబ్దంగా ఉంటే నయాగరా జలపాతం గలగలలు విందాం.. "



***




**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

# గోమాతా శీలవతి..!

ఒక గ్రామంలో జరిగే సంతకి ఆవుని కొనడానికి వెళ్ళాడో పాలవ్యాపారి. ఒకడి దగ్గర మూడు ఆవులుండడం చూసి అడిగాడు ఒకో దాని ధర ఎంత అని.

"దీని ధర పది హేను వేలండీ.. రోజుకి తొమ్మిది లీటర్ల పాలిస్తుంది.. ఏడాది కోసారి ఈనుతుందని గ్యారంటీ.."

"ఇంకొంచెం చవకగా కావాలి.." కోరాడతను.

"ఇది చూడండి సార్..! దీని ధర పదిన్నరవేలు. రోజుకి ఆరు లీటర్ల పాలిస్తుంది..."



"మరి ఆ మూడో ఆవు ధర ఎంత?"

"అది బాగ ఎక్కువండీ..ఇరవై వేల రూపాయలు.."

"అబ్బో..రోజుకి ఎన్ని లీటర్లిస్తుందేమిటి?"

"ఒక్క లీటరు కూడా ఇవ్వదండీ..ఇంతదాకా దానికి ఒక్క పిల్లకూడా పుట్టలేదండీ.."

"గొడ్డుపోయిన ఆవుకి అంత ధర ఎందుకోయ్?"

అడిగాడతను ఆశ్చర్యంగా.

"అది ఇంతదాక ఒక్క ఆంబోతుని కూడా కన్నెత్తి చూసి ఎరగదు. శీలవతండీ..అంచేతా.." గర్వంగా చెప్పాడతను..

***

## ప్రేమ..ప్రేమ..ప్రేమ..

**యర్రంశెట్టి శాయి**

రామచంద్రం తన ప్రియురాలు అరుంధతితో సినిమాకెళ్ళి ఆటోలో ఆమెను వాళ్ళింటిదగ్గర డ్రాప్ చేశాడు.

"కాస్సేపు నీ రూమ్ కొచ్చి కబుర్లు చెప్పుకోవచ్చా?" అడిగాడు రామచంద్రం.

"బాగుండదు! మా రూమ్మేట్ కిలాంటివి నచ్చవు .."

"పది నిమిషాలు మాట్లాడినా తప్పుపడతారా ఏమిటి?" నిష్టూరంగా అడిగాడతను.

"అతను తప్పు పడతాడు మరి!" అందామె లోపలికెళ్ళి తలుపేసుకుంటూ.

***

**దీన్‌కుమార్** సినిమా థియేటర్ లోపలికి అడుగుపెడుతుంటే విజయ్‌కుమార్ ఎదురొచ్చాడు.

"అదేమిటి? నిన్న రాత్రి నువ్వూ, నీ ప్రియురాలూ కలిసి ఈ సినిమా సెకండ్ షో చూశారు కదా?" అడిగాడు విజయకుమార్ ఆశ్చర్యంగా.


"అవును, ఇప్పుడు సినిమా చూద్దామని వచ్చాను" అన్నాడు దీనకుమార్.

***

**"ఏమోయ్ కబీర్ దాస్** పెళ్ళిచేసుకున్నావంట గదా..ఇంత సడన్ గా చేసుకున్నావు..ఏమిటీ విశేషం?"

"నువ్వే చెప్పుకో చూద్దాం.."

"ఆ అమ్మాయి ఫాదర్ కి బోలెడాస్తి ఉండి ఉంటుంది."



"కాదు"

"బోలెడు కట్నం ఇస్తామని ఉంటారు.."

"కాదు.."

"అమ్మాయి నెలతప్పి ఉంటుంది.."

"కాదు"

"అమ్మాయికి అందమైన అక్క ఉందని కనిపెట్టి ఉంటావ్.."

"కాదు.."

"ఆ అమ్మాయి ప్రాణ స్నేహితురాలు నీతో చనువుగా మాట్లాడి ఉంటుంది.."

"కాదు"

"ఇంక నేను ఊహించలేనా బాబూ..నువ్వే చెప్పు.."

"మేమిద్దరం ప్రేమించుకున్నాం"

"అద్గదీ..అలా చెప్పు ఏదో ఒక లొసుగు ఉండే ఉంటుందని అనుకున్నా.."

***

**ఉదయార్కర్** తన ప్రియురాలితో కార్లో నిర్మానుష్యమైన రోడ్డుమీద వెళ్తోంటే "ఈ మధ్య నాకు ఆపరేషన్ జరిగింది కదా! ఎక్కడ జరిగిందో చూపించమంటావా?" కవ్వింపుగా అడిగిందామె.

"చూపించు డియర్!" అన్నాడు ఉదయార్కర్ వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో.

"ఇదిగో! ఈ రోడ్డు చివరకెళ్ళి కుడిచేతి వైపు తిరిగితే చాలు ఆ హాస్పిటల్ కనబడుతుంది.." అందామె.

***

"**నువ్వలా** అందంగా చూస్తుంటే ఏమనిపిస్తుందో తెలుసా?"

"ఏమనిపిస్తుంది?" సిగ్గు పడుతూ అడిగింది హేమలత.

"నిన్ను ముద్దు పెట్టుకోవాలనిపిస్తుంది..!" చెప్పాడతను.

"అయితే త్వరగా కానీ..ఇలా ఎక్కువసేపు చూడడం కష్టం" అంది హేమలత.

***

**ఓ రోమియో** తన జూలియట్‌తో పారిపోవాలని ప్లాన్ వేసుకున్నాడు.

అనుకున్న ప్రకారం అర్థరాత్రి జూలియట్ ఇంటికెళ్ళి నిచ్చెన మీద ఎక్కి ఆమె గదిలోకి చూస్తూ "జూలియట్! త్వరగా పద. హాయిగా పారిపోయి కొత్త జీవితం ప్రారంభిద్దాం" అన్నాడు రోమియో గట్టిగా.

"ష్! గట్టిగా అరవక. మా ఫాదర్ విన్నాడంటే మన ప్లానంతా నాశనమై పోతుంది.." అంది జూలియట్.

"ఏం కాదు.. మీ నాన్నే నిచ్చెన పడకుండా గట్టిగా పట్టుకుని నిలబడ్డారు." చెప్పాడు రోమియో.

***

"**ప్రియా!** నిజంగా నేనే నీ మొదటి ప్రియుడ్నా?"

"అవును గానీ..మీ మగాళ్ళంతా ఇదే ప్రశ్న అడుగుతారెందుకూ?" చిరాకుగా అందామె.

***

"ప్రతిమ నన్ను ప్రేమిస్తుందంటావా?"

"తప్పకుండా ప్రేమిస్తుంది. నిన్నొక్కడినే ఎందుకు వదులుతుంది?"

***

## చా..చా ఏరుకొచ్చిన నవ్వులు

**వాలీబాల్ పోటీల్లో** గెలిచిన వాళ్ళకి బహుమతులివ్వడానికి ప్రతిపక్ష నాయకుడిని పిలిచారు. బహుమతి ప్రదానంతరం ఆయన మాట్లాడుతూ..

"అసలు ఈ పోటీల్ని ప్రారంభించింది మేమే. ఐతే అధికారపక్షం దీన్ని బాగా నిర్లక్ష్యం చేసింది. ఫైనల్‌కి వచ్చే జట్లు కేవలం రెండే ఉంటున్నా పట్టించుకోవడంలేదు. మేము మళ్ళీ అధికారం లోకి వస్తే ఫైనల్లోకి వచ్చే జట్ల సంఖ్య పెంచుతామని హామీ ఇస్తున్నాను..."

***

**"నువ్వు అమెరికా వెళ్తున్నావు** కదా..వచ్చే వరకూ నీ కారు నాకిచ్చి వెళ్ళకూడదూ.."

"జాగ్రత్తగా చూసుకోవాలి మరి..."

"ఏం ఫరవాలేదు. షెడ్‌లో జాగ్రత్తగా ఉంచుతాను కదా.."

"షెడ్డా..? మీ ఇంట్లో కారు షెడ్ లేదుకదా.."

"నా వద్ద లేకపోతే ఏమైంది? నేనెప్పుడు వెళ్ళే మార్వాడి వద్ద ఉంది కదా.."

***

**"ఎదురింటి శకుంతల లేదూ..**ఎప్పుడూ వాళ్ళాయన గురించి లేనిపోనివి చెబుతుంది. మొగుడూ పెళ్ళాలన్నాక ఏవో ఒకటి వస్తుంటాయి కదా... మా వారిని చూడు ..ఇంట్లోకేమైనా కొనమంటే రెండు మూడు రోజుల వరకూ తీసుకు రారు. నాకు కోపం వచ్చి నోటి కొచ్చినట్లు తిడతాను. ఆయన ఇంకో రెండు అంటారు. నాకు ఒళ్ళుమండి అప్పడాలకర్రతో ఒక్కటిస్తాను. ఆయన బెల్టుతో నాలుగు తగల్నిస్తారు...అయినా ఇవన్నీ అందరి తో చెప్పుకుంటున్నామా ఏమిటీ..?"

***

**"కరెంటు పోయింది కదా,** అయినా వంట గదిలోంచి చప్పుళ్ళొస్తున్నా యేమిటి వదినా?" కాంతమ్మని అడిగింది శారదాంబ.

" మీ అన్నయ్య గారేనమ్మా..వంట చేస్తున్నారు.."

"చీకటిగా ఉంది కదా ..ఎలా చేస్తున్నారు?"

"ఆయన ఫోటోగ్రాఫర్ కదా! డార్క్ రూమ్ బాగా అలవాటు.."

***

**అప్పటి వరకూ** ప్లాట్‌ఫార్మ్ మీదున్న జంబులింగం హఠాత్తుగా పట్టాలపైకి దూకాడు.

జంబులింగం భార్య "ఏంటండి.. అలా పట్టాల మీదికి దూకారు..రైలొస్తే చచ్చిపోతారు.."

"నువ్వు వినలేదా, రైలు ప్లాట్‌ఫార్మ్ మీదికొస్తోందని ఇప్పుడే కదా మైకులో చెప్పారు. నువ్వూ తొందరగా దూకెయ్.."

***

**ఫిలాసఫీ** క్లాసులో "దేవుడున్నాడా లేడా?" అనే అంశంపై చర్చ జరుగుతోంది.

"మీరెప్పుడైనా దేవుడ్ని చూశారా?" ప్రొఫెసర్

అడిగాడు స్టూడెంట్స్‌ను.



"లేదు"

"దేవుడ్ని తాకారా?"

"లేదు"

"దీన్ని బట్టి దేవుడు లేడని అందరం నమ్మాలి.." ముగించాడు ప్రొఫెసర్.

"మీ మెదడును మేం ఎప్పుడూ చూడలేదు. ఎప్పుడూ తాకలేదు. అంటే మీకు మెదడు లేనట్లేగా సార్.." ఠక్కున లేచి అడిగాడు ఒక స్టూడెంట్.

***

**జంబులింగం:** నువ్వేది కట్టుకున్నా దానికే అందమొస్తుందోయ్..

భార్య: అందుకేగా మిమ్మల్ని కట్టుకుంది..!

***

**సోమలింగం:** నాన్నా..మనకి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చింది?

జంబులింగం: తప్పురా 'మనకి' అనకూడదు, దేశానికి అనాలి..!

***